సాహితి
నవ ప్రపంచానికి కొత్త దారులు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us:
www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-11-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 278 పేజీలు: 10+4 వెల: 8.00



శనివారం మంగళం ఎర్రచందనం డిపోలో చెట్లు పరిశీలిస్తున్న డి.సిఎం పవన్‌కళ్యాణ్

### ప్రతి ఎర్రచందనం దుంగకు

# ఇక బార్ కోడ్

### జియో ట్యాగింగ్ ద్వారా లైవ్ ట్రాకింగ్

### ఎన్ని లక్షల ఎర్రచందనం చెట్లు కొట్టేశారో ప్రపంచానికి తెలియాలి: డిసిఎం పవన్

**సచివాలయం,నవంబరు 8,ప్రభాతవార్త:** స్మగ్లర్ల చేతిలో అక్రమంగా నరకగా అటవీశాఖ అధికారులకు పట్టుబడిన ప్రతి ఎర్రచందనం దుంగకు ప్రత్యేక బార్ కోడ్,జియో ట్యాగింగ్‌తో లైవ్ ట్రాకింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి,అటవీ పర్యావరణ >>2

# ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలి

### వారంలో ఒకరోజు ప్రజాప్రతినిధులంతా ప్రజావేదికద్వారా అర్జీలు స్వీకరించాలి

### పింఛన్ల కార్యక్రమంలో ప్రతి ఎమ్మెల్యే, మంత్రులు, ఎంపిలు పాల్గొనాలి

### 'పేదలకు సేవలో' కార్యక్రమంలో నాయకులందరూ పాల్గొనాలి

### పార్టీ కార్యాలయ విభాగాల సమీక్షా సమావేశంలో సిఎం చంద్రబాబు



శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన టిడిపి అధ్యక్షుడు, సిఎం చంద్రబాబు

**గుంటూరు, నవంబరు 8, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ సంక్షేమ కార్య క్రమాలు ప్రజలందరికీ చేరేలా పార్టీ నాయకులు సమన్వయం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లోని పార్టీ కార్యాలయ విభాగాలతో ఆయన నిర్వహించిన సమీక్షా సమావేశంలో కీలక సూచనలు చేశారు. పార్టీ కార్యకలాపాలు, ప్రజా సమస్యల పరిష్కారం, నాయకుల బాధ్యతలపై ముఖ్యమంత్రి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ >>2



శనివారం కళ్యాణదుర్గంలో భక్త కనకదాసు విగ్రహావిష్కరణలో ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేష్

### ఆర్డీటి సంస్థకు

# అనుమతి సాధిస్తాం

### రాష్ట్రపండుగగా భక్త కనకదాసు జయంతి

### కాంస్యవిగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేష్

### కురుబలకు అన్ని రంగాల్లో ప్రోత్సాహం

**కళ్యాణదుర్గం, నవంబరు 8 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న అనంతపురం ఉమ్మడి జిల్లాలో ప్రజలు తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచి అన్న నందమూరి తారక రామారావును, పిల్లనిచ్చిన మామ మన అందరి బాలయ్యను మూడుసార్లు, మరో మామ నందమూరి హరికృష్ణను ఒకసారి గెలిపించి రాష్ట్ర శాసనసభకు పంపిన గొప్ప ప్రజలున్న జిల్లాగా అనంతపురం ఉమ్మడి జిల్లా నిలుస్తోందని జిల్లా ప్రజల రుణం తీర్చుకోలేనిదని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు కూటమి ప్రభుత్వ రాష్ట్ర విద్య ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కళ్యాణదుర్గంలో శనివారం భక్త కనకదాసు రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న జయంతోత్సవాలు, విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. ఈసందర్భంగా భక్తకనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరించ >>2



# డిసెంబరు 1నుంచి శీతాకాల పార్లమెంటు

### 19 రోజులు సమావేశాలు

**న్యూఢిల్లీ, నవంబరు 8:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఈ తేదీలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా ప్రకటిస్తూ,ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేలా, ప్రజల ఆకాంక్షలకు >>2




# పోలవరం అథారిటీ కార్యాలయం అమరావతికే

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించనున్నారు. ఈ మేరకు అథారిటీ ప్రతిపాదనను రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు ఆహ్వానించారు. కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖతో చర్చించి ఓ నిర్ణయానికి వచ్చి కార్యాలయాన్ని తరలించవచ్చేనే అభిప్రాయానికి వచ్చారు. గతంలో ప్రాజెక్ట్ అథారిటీ కార్యాలయాన్ని రాజమహేంద్రవరం తరలించాలనే ప్రతి పాదన ఉంది. ఇప్పటికే పోలవరం అథారిటీ చీఫ్ ఇంజనీర్ (పీ అండ్ డీ) ఆయన సిబ్బందిని రాజమహేంద్రవరం తరలించారు. ఇతర పాలనాపరమైన వ్యవస్థలతో కూడిన అథారిటీ కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని >>2

# హైకోర్టులో కొత్తగా స్టాండింగ్ కౌన్సిళ్లు

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పలు ప్రభుత్వ రంగ సంస్థలు, విశ్వవిద్యాలయాల తరఫున వాదనలు వినిపించేందుకు ప్రభుత్వం కొత్తగా స్టాండింగ్ కౌన్సిళ్లను నియమించింది. ఈ మేరకు పలువురు న్యాయవాదులకు కీలక బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇకపై ఆయా సంస్థలకు సంబంధించిన న్యాయపరమైన వ్యవహారాలను వీరు పర్యవేక్షించనున్నారు. నియమితులైన వారి వివరాల్లోకి వెళితే.. ఏపీ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది బసు నాం >>2



# సోమవరంలో కారు బీభత్సం

### ముగ్గురు మృతి, ఏడుగురికి గాయాలు

### మృతుల కుటుంబానికి తక్షణ సాయం రూ.25 వేలు అందచేత

**గండేపల్లి(కిర్లంపూడి)నవంబరు 8 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం వద్ద జాతీయ రహదారిపై శనివారం ఉదయం కారు బీభత్సాన్ని సృష్టించింది.ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి.దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం అన్నవరం వైపు నుండి రాజమేంద్రవరం వైపుకు వెళ్తున్న పెళ్లి బృందం కారు టైరు ఫంక్చర్ అయ్యి హైవే బస్ స్టాప్ వద్ద బస్సు కోసం చూస్తున్న వారిపైకి దూసుకుపోయింది. అంతటితో ఆగకుండా హైవే పక్కన బైకు ను, మూడు చక్రాల రిక్షాను ఢీకొట్టింది. దీంతో సోమవరం గ్రామానికి చెందిన మోర్త ఆనందరావు (60) మోర్త కొండయ్య (30), ఏలేశ్వరం గ్రామానికి చెందిన బొప్పాయి కాయలు అమ్ముకునే కాకాడ రాజు (60) మృతి చెందారు. అలాగే బస్సుకోసం వేచి చూస్తున్న కొండ్రపు చైతన్య, చీపురుపల్లి స్రవంతి, బత్తిన భద్రరావు తీవ్రగాయాలు కాగా మరో నలుగురికి గాయాలయ్యాయి. ఘటన స్థలానికి ఎంఎల్ఏ జ్యోతుల నెహ్రూ చేరుకుని క్షతగాత్రులను ప్రత్తిపాడు,జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రులకి పంపించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవరం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో >>2

### కల్తీనెయ్యి నిందితుడు

# కటకటాల్లోకి

### ఢిల్లీకి చెందిన అజయ్‌ని అరెస్టు చేసిన సిట్



**తిరుమల,నవంబరు 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీలో గతంలో కల్తీనెయ్యి సరఫరాకు రసాయనాలు సరఫరాచేసి కల్తీచేసిన కీలకనిందితుడ్ని సిబిఐ సిట్ అధికారులు కటకటాల్లోకి పంపారు. ఢిల్లీకి చెందిన అజయ్‌కుమార్ సుగంధ్ ను సిట్ అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు పంపింది. ఈ కేసులో ఇదో కీలకంగా మారడంతో సిట్ మరో అడుగు ముందుకువేసింది. నాలుగేళ్ల ఢిల్లీనుండి ఉత్తరాఖండ్‌కు >>2



బీహార్ ఎన్నికల ప్రచారం సందర్భంగా మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

# బీహార్‌లో మరోసారి ఎన్డీయే ప్రభుత్వమే

## ఎన్నికల ప్రచారంలో మంత్రి లోకేష్

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వం తిరిగి ఘన విజయం సాధిస్తుందని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేసారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వంపై ప్రజలు అత్యంత విశ్వసనీయత్తో ఉన్నారని వ్యాఖ్యానించారు. శనివారం బీహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పాట్నాలో పర్యటించిన ఆయన, రాష్ట్రంలో ఎన్డీయే కూటమికి మళ్లీ అధికారం కట్టబెట్టాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్షాల హామీలపై విమర్శలు గుప్పించారు. 'నేను బీహార్ రావడం ఇదే మొదటిసారి. ఇక్కడికి నేను ఆంధ్రప్రదేశ్ మంత్రిగా రాలేదు, ఒక భారతీయుడిగా వచ్చాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వంపై నాకు పూర్తి విశ్వాసం ఉంది' అని లోకేశ్ అన్నారు. బీహార్ ప్రజలు మరోసారి ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసేందుకే తాను వచ్చానని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ఒక ఇంటికి ఒక పారిశ్రామికవేత్త అనే నినాదంతో ముందుకు వెళుతోందని లోకేశ్ పేర్కొన్నారు. కానీ, బీహార్‌లోని ప్రతిపక్షాలు ఒక ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగంఇస్తామని హామీ ఇస్తున్నాయన్నారు. అది నిజాయితీగా చెప్పాలంటే ఎప్పటికీ సాధ్యం కాదని విమర్శించారు. 'ప్రతిపక్షాలు ప్రజలను పరాధీనంగా మార్చాలని చూస్తున్నాయి. అందుకే ఒక ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం అంటున్నారు. మేము ఎన్డీయేలో సాధికారతను నమ్ముతాం. అందుకే మా నినాదం, ఒక ఇంటికి ఒక పారిశ్రామికవేత్త' అని లోకేశ్ వివరించారు. ఎన్నికల తొలి దశలో మాదిరిగానే, రాబోయే దశలోనూ ఎన్డీయే అద్భుతమైన ప్రదర్శన చేస్తుందని, బీహార్‌లో మళ్లీ ఎన్డీయే జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ ఏపీలో రూ.5,642 కోట్ల పెట్టుబడులు : మంత్రి లోకేష్ వెల్లడి

**విజయవాడ,నవంబరు 8,పభాతవార్త ప్రతినిధి:** తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ రూ.5,942 కోట్ల పెట్టుబడులతో 5 గిగావాట్ల సిలికాన్ ఇంగోట్,4 గిగావాట్ల టాప్‌కాన్ సోలార్ సెల్ యూనిట్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుందని మంత్రి లోకేష్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఆ సంస్థ నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏర్పాటు చేసే యూనిట్ ద్వారా సుమారు 3,500 మందికి ఉపాధి అవకాశాలు...సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన ఎకో సిస్టం అభివృద్ధి చెందుతుంది.ఆ సంస్థకు 269 ఎకరాల భూములను ఏపీఐఐసీ ద్వారా రికార్డు సమయంలో అందించాం. 2024 అక్టోబరులో సంస్థతో సంప్రదింపులు ప్రారంభించాం.2025 ఫిబ్రవరికి భూములు కేటాయించాం.ఆ ప్రాంతం పోర్టుకు సమీపంలో ఉండటంతో పాటు ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రోత్సాహకాల వల్ల ఈ యూనిట్ రాష్ట్రానికి వచ్చింది. రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధిని, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ప్లాంటు సామర్థ్యాన్ని 7 గిగావాట్లకు విస్తరించాలన్న ప్రణాళిక ఉంది. దేశంలోనే రెండో అతిపెద్ద సోలార్ సెల్.మాడ్యూళ్ళ తయారీ సంస్థ రాష్ట్రానికి రావడం గర్వకారణంగా ఉంది. ఆ సంస్థకు ఏపీ స్వాగతం పలుకుతోంది. రాష్ట్రం లోని యువతకు గ్రీన్ ఎనర్జీ రంగంలో ఉపాధి అవకాశాలను సంస్థ కల్పిస్తుంది'అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# ప్రతి ఎర్రచందనం దుంగకు ఇక బార్ కోడ్

>> శాఖల మంత్రి పవన్‌కళ్యాణ్ స్పష్టంచేశారు.ఎర్రచందనం దుంగలు పట్టుబడిన దగ్గర నుంచి అమ్మకం జరిపే వరకు అనుమతి లేకుండా ఒక్కదుంగ కూడా పక్కదారి పట్టడానికి వీల్లేదని అటవీశాఖ అధికారులకు ఆదేశించారు.లాట్లు,నంబర్లు ఇచ్చే పాత విధానాల స్థానంలో అధునాతన సాంకేతికతతో విలువైన ఎర్రచందనందుంగలకు భద్రత కల్పించనున్నట్లు తెలిపారు.శనివారం తిరుపతి జిల్లా, మంగళంలోని ఎర్రచందనం డిపోని పవన్ కల్యాణ్ సందర్శించారు.డిపోలో మొత్తం 8గోడౌన్లు ఉండగా,ప్రతి గోడౌన్‌ను ప్రతి దుంగను నిశితంగా పరిశీలించారు.

**దుంగల గ్రేడ్లు,స్టాక్ రిజిస్టర్ల పరిశీలన:** ఎర్రచందనం దుంగల గోడౌన్ పరిశీలనకు వెళ్లిన పవన్‌కళ్యాణ్ మొదటి గోడౌన్‌లో భారీ సంఖ్యలో ఉన్న దుంగలను చూసి ఆశ్చర్యం వ్యక్తంచేశారు.ఎర్రచందనం స్మగ్లింగ్ కోసం ఇంత పెద్ద ఎత్తున వృక్ష సంపద విధ్వంసం జరుగుతోందా? అని అంటూ అధికారులను ప్రశ్నించారు.అక్కడ సందర్శనకు ఉంచిన దుంగలను గ్రేడ్ల వారీగా పరిశీలించారు.ఎర్రచందనంతో తయారు చేసిన విగ్రహాలు,బ్రీడ్స్,చిన్న చిన్న వస్తువుల తయారీ కోసం కట్‌చేసి అమ్మకానికి ఉంచిన చిన్నచిన్న ముక్కలు,ఔషధాల తయారీలో వినియోగించే ఎర్రచందనం రంపపు పొట్టును పరిశీలించారు.అనంతరం అదే గోడౌన్‌లోని దుంగల రిజిస్టర్‌ను పరిశీలించారు.

**ప్రతి గోడౌన్ కలియదిరుగుతూ..ప్రతి దుంగని పరిశీలిస్తూ..** మంగళం ఎర్రచందనం డిపోలో ఉన్న మొత్తం 8గోడౌన్లలో పవన్ కలియదిరిగారు.దుంగలు పుచ్చు పట్టడం,పాడవడం లాంటివి జరిగే అవకాశం ఉందా అని అధికారులను అడగ్గా పుచ్చు పట్టకపోవడమే ప్రత్యేకత అని అధికారులు వివరించారు.

**జరుగుతున్న విధ్వంసం ప్రపంచానికి తెలియాలి:** డిపోలో పెద్దఎత్తున నిల్వ ఉంచిన దుంగలను చూసి అక్రమార్జన కోసంఅడవుల్లో ఇంత పెద్దఎత్తున విధ్వంసం జరుగుతుందా అని ఆవేదన వ్యక్తం చేశారు.కొన్ని లక్షల చెట్లను చందనస్మగ్లర్లు నరికి వేయడం కారణంగా డిపోల్లోకి ఇన్ని లక్షల దుంగలు చేరాయన్నారు.స మ్మగ్లర్లు ఎంతసంపద దోచుకోవడానికి ప్రయత్నించారో, ఎన్ని లక్షలచెట్లను నరికేశారో ప్రపంచం మొత్తానికి తెలియాలన్నదే తన తపన అనిఅన్నారు.డిపోలో కలియదిరుగుతూనే ఆ ప్రాంగణలో ఆటవీశాఖ ఆధ్వర్యంలో పెంచిన మొక్కలను పరిశీలించారు.టెరోమా జేరా అనే విదేశీ జాతి మొక్కను ఆసక్తిగా తిలకించివివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఏపుగా,ఎత్తుగా ఎదిగే స్వభావం ఉన్న ఈ మొక్క ఆకులు మొత్తం రాలిపోయాక పూలతో కనువిందు చేస్తుందని అధికారులు వివరించారు.

# సోమవరంలో కారు బీభత్సం

>>మరణించిన కుటుంబాలకు ప్రభుత్వ తక్షణ సహాయం రూ. 25 వేలు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అందచేత: జగంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం సోమవరం లో శనివారం ఉదయం కారు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్ర గాయాలు పాలైన నలుగురు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రమాద విషయం తెలిసిన వెంటనే జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఘటన స్థలానికి చేరుకుని సకాలంలో ఆసుపత్రికి తరలించే ఏర్పాటు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబుకు విషయం తెలియజేసిన వెంటనే చనిపోయిన కుటుంబాలకు మట్టి ఖర్చులు నిమిత్తం 25 వేల రూపాయలు తక్షణ సహాయంగా అందించాలని ఆదేశించడంతో జగ్గంపేట మార్చురీ వద్దకు చేరుకుని చనిపోయిన సోమవరం గ్రామానికి చెందిన మోర్త కొండయ్య కుటుంబానికి 25000 అందించారు.

అనంతరం ప్రత్తిపాడు మార్చురీ వద్దకు చేరుకుని చనిపోయిన సోమవరం గ్రామానికి చెందిన మోర్త ఆనందరావు కుటుంబానికి ఏలేశ్వరం గ్రామానికి చెందిన కాకాడ రాజు కుటుంబానికి 25 వేల రూపాయలు చొప్పున అందజేశారు. అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించి జి జి హెచ్ సూపరెంటెండెంట్‌ని కలుసుకుని బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

కిర్లంపూడి ఇంఛార్జ్ ఎస్ఐ రఘునందరావు కేసు నమోదు చేయగా జగ్గంపేట సిఐ వైఆర్. కె శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు.మృతుల కుటుంబాలను, కృతగాత్రులను మాజీ మంత్రి తోట నరసింహం,మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు లు పరామర్శించి మృతుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుని తగిన ఆర్థిక సహాయం అందించాలని, కృతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని కోరారు.



శనివారం ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో వందేభారత్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ. చిత్రంలో రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్

# భక్త కనకదాసుకు నివాళి అర్పించిన సిఎం చంద్రబాబు



శనివారం భక్త కనకదాసు చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 8,ప్రభాత వార్తప్రతినిధి:** భక్త కనక దాస జయంతి సందర్భంగా ఆయనకు ఏపీ సీఎం చంద్రబాబు నివాళిని అర్పించారు.తన కార్యాలయం లోని ఆయన చిత్రపటానికి పూల మాలతో అలం కరించి,అంజలి ఘటించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు భక్త కనకదాస జయంతి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా భక్త కనకదాస సమాజ చైతన్యానికి ఎంతో కృషి చేశారు. తన కీర్తనలు, రచనలతో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించారు. ఆ మహనీయుని జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలి

>> పేదల సేవలో భాగంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు కార్యకర్తల బీమా, చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. పార్టీ కార్యకర్తల బీమాకు సంబంధించిన లెటర్లు ఇంకా అందించని వారి వివరాలను సేకరించి తనకు అందజేయాలన్నారు."పేదలకు సేవలో" కార్యక్రమానికి క్రమం తప్పకుండా తాను హాజరవుతున్నానని, నాయకులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ప్రజా సేవలో నేతలు నిబద్ధతతో వ్యవహరించాలని, ప్రభుత్వ కార్యక్రమాలకు నాయకులు తప్పనిసరిగా హాజరై ఫీల్డ్‌లో ఉండాలని స్పష్టం చేస్తూ, ప్రజల్లోకి ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా తీసుకెళ్లాలని గుర్తుచేశారు.ప్రజల సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు. నిన్న రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి అనూహ్య స్పందన, విశేష ఆదరణ లభించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రతి నాయకుడు ప్రత్యేక సమయం కేటాయించాలని కోరారు. ఇక నుండి ప్రతి ప్రజాప్రతినిధి వారంలో ఒకరోజు ఖచ్చితంగా ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి ప్రత్యక్షంగా అర్జీలు స్వీకరించాలి. అర్జీల పరిష్కారాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాకు నియమించిన ఇంఛార్జి మంత్రులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎమ్మెల్యేలు నిర్వహిస్తున్న గ్రీవెన్స్ వివరాలను తెప్పించుకొని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని సమస్యల పరిష్కారం వేగవంతం చేయాలని, నియోజకవర్గ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయిలో, అక్కడా పరిష్కారం చూపకపోతే రాష్ట్ర స్థాయిలో పరిష్కారం చూపించే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని గుర్తు చేశారు. పార్టీ నేతలు జవాబుదారీతనంతో వ్యవహరిస్తే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం రెట్టింపు అవుతుందని ఆయన అన్నారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఉన్న పార్టీ శ్రేణులను పక్కనబెట్టి కొత్తగా వైసీపీ నుండి వచ్చిన వారికి కొందరు ఎమ్మెల్యేలు ప్రాధాన్యత ఇస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, క్షేత్రస్థాయి నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నానని, సీనియర్లను, పార్టీ శ్రేణులను పక్కనబెట్టి కొత్తగా బయట నుంచి వచ్చిన వారికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. ఎమ్మెల్యేలకు నచ్చిన కార్యకర్తలే కాకుండా పార్టీలోని సీనియర్స్‌ను కూడా కలుపుకొని పోవాలని సూచించారు. ప్రతి రోజు కార్యాచరణను అమలు చేసి, వారానికోసారి విశ్లేషించి, నెలకోసారి సమీక్షించి, ప్రజల అభిప్రాయాన్ని బట్టి నిర్ణయాలు తీసుకుంటున్నానని, ప్రతిఒక్కరి పనితీరుకు సంబంధించిన సమాచారం తన వద్ద ఉందని చంద్రబాబు తెలిపారు.వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ, వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. పిపిపి విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం వల్ల పేదలకు నాణ్యమైన వైద్యం అందడంతో పాటు పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందన్నారు. శరవేగంగా మెడికల్ కాలేజీలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే అసత్యాలతో అడ్డుకునేందుకు వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొంథా తుఫాను సమయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు, ప్రజలకు అండగా నిలబడితే జగన్మోహన్ రెడ్డి విషం చిమ్ముతున్నాడన్నారు.క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ శ్రేణులను చైతన్యం చేయడంపై నాయకులు దృష్టి సారించాలని కోరారు. కూటమి నాయకులతో సమన్వయం, పార్టీలో క్రమశిక్షణ, సేవా దృక్పథంతో వ్యవహరించడం ద్వారా ప్రజల్లో పార్టీపై నమ్మకాన్ని మరింత బలపరచాలని సూచించారు. కూటమిలోని పార్టీలతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అదే విధంగా ట్రస్ట్ బోర్డ్ కమిటీలను కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో పార్టీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# డబ్బుకోసమే జనార్దనరావు, సోదరునికి సాయం చేశా

## నకిలీ మద్యం కేసు విచారణలో నిందితుడు రవి వెల్లడి

**విజయవాడ,నవంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో ఆర్థిక ప్రయోజనాలను ఆశించే తాను అద్దేపల్లి జనార్దనరావు, అతని సోదరుడు జగన్మోహన్‌రావులకు సాయం చేసినట్లు నిందితుడు రవి విచారణలో వెల్లడించాడు. తనకు ఇద్దరితో పది ఏళ్ల నుంచి పరిచయం ఉందనీ, ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పుడు రుణం ఇప్పించి సాయం చేశారని చెప్పాడు. 5 రోజుల కస్టడీలో భాగంగా సిట్, ఎక్సైజ్ పోలీసులు నిందితుడిని విజయవాడలోని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌లో విచారించారు.రవితో పాటు మిగిలిన నిందితులు బాదల్ దాస్, ప్రదీప్ దాస్, శ్రీనివాస్‌రెడ్డి, కల్యాణ్, రమేష్ బాబు, అల్లాభక్షలను కస్టడీకి తీసుకున్నారు. నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉన్న రవిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించి నిన్న (శుక్రవారం) విజయవాడ తీసుకు వచ్చారు. మిగితా వారికి విజయవాడ జైలు నుంచి తీసుకుని ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించారు. అనంతరం వీరిని ఎక్సైజ్ స్టేషన్‌లో వేర్వేరుగా విచారించారు. తాము ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో నకిలీ మద్యం తయారీలో భాగంగా సీసాల్లోకి మద్యాన్ని నింపామని ఒడిశా కార్మికులు బాదల్ దాస్, ప్రదీప్ దాస్‌లు వెల్లడించారు. తమను జనార్ధనరావు రెండు చోట్ల ఉపయోగించుకున్నాడని చెప్పారు. విద్యాధరపురంలోని శ్రీనివాస వైన్స్ లో మేనేజ్‌మెంట్ బాధ్యతలను పర్యవేక్షి ంచిన కల్యాణ్ నకిలీ మద్యం సీసాలను విక్రయించాడు. నకిలీ మద్యం సీసాలను ఎవరు సరఫరా చేశారని పోలీసులు ప్రశ్నించగా ఏఎన్ఆర్ బార్ నుంచి జగన్మోహన్‌రావు ఆటోల్లో పంపించేవాడిని అని వివరించాడు. నకిలీ సరకు అమ్మగా వచ్చిన డబ్బులను వాటా పంచుకునే వారమన్నారు. జగ్గయ్యపేటలో తనకు గతంలో పేపర్ మిల్లు ఉందనీ, నష్టాల కారణంగా జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లినట్లు చెప్పాడు. 2023లో జనార్ధనరావుతో కలిసి తాను గోవా వెళ్లానని విచారణలో అంగీకరించాడు. ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ యూనిట్ల ఏర్పాట్లలో కీలకంగా వ్యవహరించానని చెప్పాడు.జనార్ధనరావుతో పాటు అంగోలా ఎందుకు వెళ్లావని పోలీసులు ప్రశ్నించగా డిస్టిలరీ ఏర్పాటు చేసేందుకు పరిశీలన కోసమే సెప్టెంబరు 25న వెళ్లినట్లు సమాధానమిచ్చాడు. ములకలచెరువు వ్యవహారం బయటకు రాగానే జనార్ధనరావు సూచనల మేరకు తాను అతని కంటే ముందే ఇండియాకు వచ్చినట్లు ఇంటరాగేషన్‌లో వివరించాడు. సీసాలకు అంటించే లేబుళ్లను హైదరాబాద్‌లో డిజైన్ చేయించడంలో తిరుమలశెట్టి శ్రీనివాసరావు సాయం తీసుకున్నామని అన్నాడు. లావాదేవీల వివరాలను నిందితుడి ముందుంచి వివరాలను రాబట్టారు. లేబుళ్ల తయారీ చేసిన వారికి చెల్లించినట్లు చెప్పాడు.

# ఆర్డీటి సంస్థకు అనుమతి సాధిస్తాం

>> దంతోపాటు కనకదాసు సర్కిల్‌గా నామకరణం చేశారు. అనంతరం ప్రజల ఉద్దేశించి ప్రసంగిస్తూ భక్త కనకదాసు సామాజిక తత్వవేత్తని, ఆయన స్ఫూర్తిని కొనియాడారు. శ్రీ భక్త కనకదాసు వారసులైన కురుబలను తెలుగుదేశం పార్టీల రాజకీయంగా అన్ని స్థాయిలలో పదవులు ఇచ్చి ప్రోత్సహించిందని ఆర్థిక పథకాలు కూడా అందించి కురుబల జీవితాలను చక్కదిద్దిందని అన్నారు. కురువలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికపరమైన పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గొర్రెలకు బీమా పథకాలు అమలు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. బీటీపీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది మేమే బీటీపీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది మేమే పూర్తి చేసేది కూడా పూర్తి చేసేది కూడా మనమే కళ్యాణదుర్గం నియోజకవర్గం బిటిపి కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా 114 చెరువులకు సాగునీరు అందించే పథకానికి శంకుస్థాపన చేసింది తెలుగుదేశమేనని, ఆ ప్రాజెక్టును పూర్తి చేసేది కూడా మనమేనని హర్షధ్వనాల మధ్య ప్రకటించారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు బిటిపి ప్రాజెక్టు పట్ల ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారని సొంత డబ్బులు కూడా వ్యయం చేసి ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తున్నారని అన్నారు. ఆర్డిటికీ అనుమతలు సాధిస్తాం కరువు జిల్లాలో సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తాం వెనుకబడిన అనంతపురం జిల్లాలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్ డి టి సంస్థకు ఎస్ సి ఆర్ ఏ రెన్యువల్ కోసం ఫైళ్ళని తానే తీసుకొని ఢిల్లీకి వెళ్లి మంజూరు చేయించేందుకు కృషి చేశామని, అనుమతులు సాధించడమే కాదు జిల్లాలో ఆర్డిటి సేవలను ప్రోత్సహిస్తామని అందుకు తాను బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. బహిరంగ సమావేశానికి అధ్యక్షత వహించిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువనేత భావితరాల భవిష్యత్తు నాయకుడు నారా లోకేష్ అకుంఠిత దీక్ష దక్షతలతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల ప్రతిపక్షం పాలనలో బిటిపి కుందుర్పి బ్రాంచ్ కెనాల్ పనులు పట్టించుకోలేదని గంపెడు మట్టిని కూడా తీయలేకపోయారని విమర్శించారు. కరువు పీడిత ప్రాంతంగా అత్యంత వెనుకబడిన కళ్యాణదుర్గం నియోజకవర్గం ప్రజల జీవనాడి రైతుల కలల ప్రాజెక్టు బిటిపి కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులకు సాగునీరు అందించే బృహత్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ బాబుతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, హిందూపురం ఎంపీ పార్థసారథి ప్రసంగిస్తూ తెలుగుదేశం పార్టీకి బీసీలే బలమని అందుకే బీసీ సామాజిక వర్గాలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి అభివృద్ధి బాటలో నడుపుతున్నారని అన్నారు. కురుబల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు కురుబలకు జీవనాధారమైన గొర్రెల పెంపకానికి రుణాలు గొర్రెలకు భీమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షులు వెంకట శివుడు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కందికుంట వెంకట ప్రసాద్, గుమ్మనూరు జయరాం, దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భక్త కనకదాస వేడుకల్లో పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# పోలవరం అథారిటీ కార్యాలయం అమరావతికే

>>అమరావతికి తరలి స్తామంటూ కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అథారిటీ సీఈవో,కార్యదర్శితో పాటు ఇతర సిబ్బంది, ఈ సంస్థ కార్యక లాపాలను అమరావతి నుంచి చేపట్టేందుకు సుముఖత వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం సీఈఓ అతుల్‌జైన్ అధ్యక్షతన పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ 17వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు పనుల పురోగతి,పునరావాసం,భూసేకరణతో పాటు అథారిటీకి రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఒప్పందం తదితర అంశాలు చర్చకు వచ్చాయి. ఏపీ నుంచి జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ ఛీఫ్ నర్సింహమూర్తి పునరా వాస కమిషనర్ ప్రశాంతి హాజరయ్యారు.

# కల్తీనెయ్యి నిందితుడు కటకటాల్లోకి

>> బోలేబాబా డెయిరీకి మోనోగ్రీజారాయిడ్స్, అసిటిక్‌యాసిడ్ వంటి రసాయనాలను డ్రమ్ముల్లో పంపాడనేది ఆధారాలు రాబట్టింది. 90శాతం కల్తీనెయ్యిలో పామాయిల్ కలిపాడనేది ఇప్పుడు సంచలనం. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన సూత్రధారిలో మాజీ టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు చిన్న అప్పన్నను సిట్ కటాకటాల్లోకి పంపింది. 2022వ సంవత్సరం నుండి 2024వరకు కల్తీనెయ్యి సరఫరా చేసిన కుట్రలో ఇంకా సిట్ దర్యాప్తు కొనసాగిస్తూనే ఉంది.

వేంకటేశ్వరస్వామి లడ్డూప్రసాదం తయారీలో కల్తీనెయ్యి వినియోగించారనే సంచలనంపై సిట్ అధికారులు మరింత లోతుగా విచారణ సాగిస్తూ నిందితులను అరెస్ట్‌చేస్తుండటం జరుగుతోంది. 2020 నుండి 2024వరకు గతంలో వైసిపి ప్రభుత్వంలోని పూర్వటిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, టిటిడి ఉన్నతాధికారి, కొనుగోలుకమిటీ ఏ మేరకు నిబంధనలు పాటించి నెయ్యి సరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్ల వివరాలు సేకరించిన సిట్ అధికారులు కల్తీనెయ్యికి అసలు సూత్రధారులు ఎవరని తేల్చేపనిలో మూలాలు కదిలిస్తున్నారు. ఈ విషయంలో ఇప్పటికే సిట్ టిటిడి మార్కెటింగ్, కొనుగోలు విభాగం, పోటు విభాగంలో కీలక అధికారులను విచారణ చేసింది. ఇప్పుడు గత టిటిడి బోర్డు పెద్దలకు, అధికారులకు నోటీసులు జారీ చేసే కోణంలో అవసరమైన కీలక సమాచారం రాబడుతున్నట్లు తెలుస్తోంది.

**మరింత లోతైన విచారణ దిశగా అడుగులు:** తిరుమల లడ్డూప్రసాదాల తయారీకి ఎంత కాలంగా కల్తీనెయ్యి వినియోగించారు?అసలు నెయ్యిసరఫరా చేయాల్సిన సంస్థలు, కాంట్రాక్టర్ల స్థానంలో మరొకరు సరఫరా చేశారనేది సిట్ కీలకంగా సేకరించిన సమాచారం. 2024 జులైనెలలోనే మూడుసార్లు కల్తీనెయ్యి సరఫరా జరిగిందని గుర్తించిన అప్పటి టిటిడి ఇఒ ఆ ట్యాంకర్లను తిరుమలలో నెయ్యి తీసుకోకుండా వెనక్కుపంపిన విషయం కూడా విదితమే. దీనివెనుక ఎవరి ప్రమేయం ఉంది.ఎందుకు కేసులునమోదు చేయించలేదనేది సూత్రధారుల నుండే రాబట్టేందుకు చూస్తున్నారు.

# డిసెంబరు 1నుంచి శీతాకాల పార్లమెంటు

>> అనుగుణంగా ఫలప్రదమైన, అర్థవంతమైన చర్చలు జరగాలని ఆశిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అత్యంత క్లుప్తమైన శీతాకాల సమావేశాల్లో ఇది ఒకటి కావడం గమనార్హం. గతేడాది శీతాకాల సమావేశాలు నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20న ముగిశాయి. 26 రోజుల వ్యవధిలో లోక్‌సభ 20 సార్లు, రాజ్యసభ 19 సార్లు సమావేశమయ్యాయి. ఆ సెషన్‌లో లోక్‌సభ ఉత్పాదకత 54.5 శాతంగా, రాజ్యసభ ఉత్పాదకత 40 శాతంగా నమోదైంది. అప్పుడు ఐదు బిల్లులను ప్రవేశపెట్టగా, 'భారతీయ వాయుయాన్ విధేయక్ 2024' బిల్లును ఉభయ సభలు ఆమోదించాయి. ఇటీవల జరిగిన వర్షాకాల సమావేశాలు జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు 21రోజుల పాటు జరిగాయి. ఆ సమావేశాల్లో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో ఉభయ సభల్లో ఉత్పాదకత గణనీయంగా తగ్గింది. లోక్‌సభ కేవలం 31 శాతం, రాజ్యసభ 38.8శాతం ఉత్పాదకతను మాత్రమే నమోదుచేశాయి. ఆసెషన్‌లో 15 బిల్లులు చట్టరూపం దాల్చాయి.

# హైకోర్టులో కొత్తగా స్టాండింగ్ కౌన్సిళ్లు

>> చారయ్య నాయుడును నియమించారు. ఏపీ స్పోర్ట్స్ అథారిటీ తరఫున జి. సాయి నారాయణ రావు, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) తరఫున ఎం. శివకుమార్ వాదనలు వినిపించనున్నారు. అలాగే, తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి స్టాండింగ్ కౌన్సిల్‌గా వల్లభనేని శాంతిశ్రీ నియమితులయ్యారు. రాయలసీమతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని ఏపీ గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ ఆశ్రమ పాఠశాలల సొసైటీలతో పాటు ఏపీ ఆశ్రమ పాఠశాలల సొసైటీకి కలిపి న్యాయవాది తర్లాడ వినోద్‌కుమార్‌ను స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి రానున్నాయి.

# యుపిలో నీట్ విద్యార్థి ఆత్మహత్య

**కాన్పూర్, నవంబరు 8:** నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ విద్యార్థి తీవ్ర ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో చోటుచేసుకుంది. ఆత్మహత్యకు ముందు తన తల్లిదండ్రులను క్షమించమని కోరుతూ విద్యార్థి రాసిన సూసైడ్ నోట్ కంటతడి పెట్టిస్తోంది. రాంపూర్‌కు చెందిన మహమ్మద్ ఆన్ (21) నీట్ కోచింగ్ కోసం కాన్పూర్‌లోని రావత్‌పూర్‌లో ఉన్న ఓ హాస్టల్‌లో నాలుగు రోజుల క్రితమే చేరాడు.అతని రూమ్‌మేట్ ఇమ్దాద్ హసన్ ప్రార్థనలకు వెళ్దామని పిలవగా,మహమ్మద్ నిరాకరించాడు. ఇమ్దాద్ తిరిగి వచ్చి చూసేసరికి గదికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది.

## వారం - వర్జ్యం

09-11-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
పంచమి రా.1.59
ఆరుద్ర రా.8.10, విశాఖ కార్తె
వర్జ్యం : ఉ.7.32 - 9.03
దు.సా.4.04-4.46
శుభసమయం : ఉ.6.30-7.15
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** రాజకీయ, పారి శ్రామిక కళారంగాల లోని వారికి కొంత అనుకూలం. అయోమయం, అస్పష్టత అనుమానాలకు దారితీస్తాయి.

**వృషభం:** జీవితభాగస్వామితో స్పర్థలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోండి. భాగస్వామ్య వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**మిథునం:** సుదూర ప్రాంత ప్రయణాలకు తాత్కాలిక విరామం ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**కర్కాటకం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది.పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**సింహం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. నూతన మిత్రులు పరిచయమై సహాయ సహకారాలు అందిస్తారు.

**కన్య :** ఆప్తుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. స్త్రీ మూలంగా ధనలాభం. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**తుల :** సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. ఉద్యోగులకు పదోన్నతులు. నూతన ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

**వృశ్చికం:** ఆకస్మిక ప్రయాణాలలో చేదు అనుభవాలు చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**ధనుస్సు:** స్వంత మనుషులు మీద ఆరోపణలను ఏకపక్షముగా నమ్మకండి. పెట్టుబడులలో తొందరపాటు వద్దు. వస్త్రలాభం పొందుతారు.

**మకరం:** శత్రు వర్గము నుండి పరోక్షముగా చికాకులు ఏర్పడినా సులువుగానే తప్పించు కుంటారు. ఇంటర్వ్యూలు, పోటీపరీక్షలకు హాజరుతారు.

**కుంభం:** సమయమును వృధాకానివ్వకుండా అంశాలను అనుకూలముగా మార్చుకుంటారు. కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకొంటారు.

**మీనం :** ఆర్థికంగా ఋణాలు తీర్చకపోయి కొత్త ఋణాలు చేయరు. గృహనిర్మాణ ఆలోచనలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## కార్తికమాసం శివదర్శనానికి
# పోటెత్తిన భక్తులు

**శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త** కార్తీక మాసం శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయం శివ రాత్రిని మరపించింది. ఎటు చూసినా భక్త జనమే. ఉదయం నుంచి ఆలయంలో శివ నామస్మరణతో మార్మోగింది. అయితే కార్తీక మాసంలో భక్తజనులకు సంబంధించి అవ గాహన ఉన్న ఇఒ డి.బాపిరెడ్డి చక్కటి ఏర్పాట్లు చేసారు. ఉదయం నుంచి ఆలయంలోని క్యూలైన్ల వద్ద భక్తులకు సత్వర దర్శనం-సుదర్శనం కల్పించుటకు చర్యలు తీసుకున్నారు. సాధారణంగా శని,ఆది, సోమవారాల్లో ఆలయానికి భక్తుల తాకిటి అధికంగా ఉంటుంది. అయితే కార్తీక మాసం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తమ సిబ్బందిని జాగృతపరచారు. ఎవ్వరికి ఇబ్బంది లేకుండా లఘుదర్శనంతో సుదర్శనం ఏర్పాటు చేసారు. కార్తిక మాసంలో శివదర్శనం శ్రేష్టమని చెబుతారు. అయితే దక్షిణ భారత దేశంలోని శైవ క్షేత్రాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిసున్నాడు. అయితే భక్తిభావంతో పంచభూత లింగాల్లో ఒకటైన వాయులింగేశ్వరుని దర్శనానికి వచ్చిన భక్తులకు సరైన సమాచారం లేదన్నారు.

# అమరావతి నుంచి జనవరిలో క్వాంటం కంప్యూటర్ ఆవిష్కరణ!

**- కుప్పంలో 7 పరిశ్రమలకు రూ. 2,203 కోట్లతో వర్చువల్ శంకుస్థాపన చేసిన సిఎం చంద్రబాబు**



అమరావతినుంచి కుప్పం ప్రజలు, రైతులతో వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

**కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త** పిల్లలకు ఆస్తికంటే మంచి చదువు, సంప్రదాయాలు ఇవ్వాలని తన తపన అంతా భావితరాల కోసమేనని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం అమరావతి నుంచి వర్చువల్ విధానంలో కుప్పంలో రూ2203కోట్లతో ఏర్పాటయ్యే ఆదిత్య బిర్లా, మదర్ డెయిరీ, శ్రీజ డెయిరీ, ఎస్‌విఎఫ్ సోయా, ఏస్ ఇ ంటర్నేషనల్, ఇ-రాయిస్, అలీప్ తదితర ఏడు పరిశ్రమలకు సిఎం శ ంకుస్థాపన చేశారు. అనంతరం పారిశ్రామికవేత్తలు, కుప్పం ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. కుప్పంలో ఇంకా 6339కోట్లతో మరో ఎనిమిది పరి శ్రమలు రానున్నాయని ప్రకటించారు. తమది సంక్షేమ ప్రభుత్వం అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్‌హిట్ చేశామని పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఈజ్‌ఆఫ్ డూయింగ్ విధానంలో ముందుకుసాగుతున్నామన్నారు. శు క్రవారం ఒక్కరోజే ఎస్‌ఎపిజి ద్వారా లక్ష కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. ఇంటికో పారిశ్రామికవేత్త ,ఇంటికో ఆర్టిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ)నిపుణుల ద్వారా చరిత్ర సృష్టిస్తామన్నారు. జనవరినెలలో రాజధాని అమరావతి నుంచి క్వాంటం కంప్యూటర్‌ను ఆవిష్కరిస్తామని ప్రకటించారు. రాష్ట్రానికి మున్ముందు భారీపరిశ్రమలు రానున్నట్లు చెప్పారు. వైజాగ్‌కు గూగుల్ డేటా సెంటర్ తెచ్చామని అలాగే వైజాగ్‌కు యాభై బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో సేఫ్‌సిటీ, ఏరోస్పేస్, క్వాంటంవా ్యలీ, డ్రోన్ సిటీలనుఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హై డ్రోజన్ హబ్‌గా మార్చుతున్నట్లు సిఎం ప్రస్తావించారు. గతంలో తాను హైదరాబాద్‌లో హైటెక్ సిటీ ప్రారంభించగా నేడు దేశంలోనే ప్రముఖ స్థానానికి వెళ్లిందన్నారు. గతంలో తీసుకువచ్చిన ఐ.టి.పాలసీతో నేడు విదేశాల్లో ఎంతోమంది తెలుగువారు స్థిరపడ్డారనే విషయం గుర్తు చేశారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం రైతులు 33వేల ఎకరాలు ల్యాండ్ పూలి ంగ్ విధానంలో ఇచ్చారన్నారు. వారికి భూములు అభివృద్ధి చేశాక కొంతమేర అప్పగించామని తద్వారా భూముల ధర అమాంతం పెరిగిందన్నారు. ప్రజలు పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తే ఆకాశమే హద్దుగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేస్తాం : రాష్ట్రంలో తొలిదఫా లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేస్తున్నట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇందుకై డ్వాక్రా సంఘాల మహిళలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. పాతికేళ్ల క్రితం మహిళల అభివృద్ధికి చర్యలుచేపట్టామన్నారు. నేడు మహిళల ఖాతాల్లో 25వేల కోట్ల కార్పస్ ఫండ్ ఉందన్నారు. ఇ ంటికో పారిశ్రామికవేత్త రావాలనేది తన ఆశయమన్నారు. విద్య అనేది సమస్య కాదని ఔత్సాహికులను పారిశ్రామికవేత్తలు ప్రోత్సహించాలని సూచించారు. స్థానిక ఉత్పత్తులు, స్థానిక వనరులను పారిశ్రామికవేత లు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు కూడా పరిశ్రమలకు సోలార్ రూఫ్‌టాప్‌లపై దృష్టి సారించాలని సూచించారు. కుప్పంలో ఏర్పాటయ్యే పరిశ్రమలకు నీటి ఇబ ్బంది లేకుండా కృష్ణాజలాలు తీసుకువచ్చామన్నారు. కుప్పం నుంచే బిందుసేద్యాన్ని దేశానికి పరిచయం చేశామని సిఎం గుర్తు చేశారు. కుప్పంలో పాల ఉత్పత్తి పది లక్షల లీటర్లకు చేరేలా చర్యలుచేపట్టామన్నారు. సంజీవని ప్రాజెక్ట్ గేమ్ ఛేంజర్ : కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన సంజీవని ప్రాజెక్ట్ దేశానికి గేమ్ ఛేంజర్ లాంటిదని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# తిరుమల సమాచారం

## కపిలేశ్వర సన్నిధిలో రుద్రహోమం



**తిరుమల,నవంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వర ఆలయంలో ప్రముఖ శైవాలయంలో కార్తీకమాస పూజల్లో భాగంగా శనివారం రుద్రహోమం ఆరంభమైంది. గతనెల నుండి పలు హోమాలు చేపడుతున్నారు. శనివారం రుద్రహోమంలోభక్తులు పాల్గొన్నారు. 500 రూపాయలు చెల్లించి గృహస్థ భక్తులు ఈ హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

## కల్యాణకట్ట, లడ్డూకౌంటర్‌ల వద్ద హెల్ప్‌డెస్క్‌లు

**- పరిశుభ్రత విషయంలో రాజీలేదు : అదనపు ఇఒ వెంకయ్యచౌదరి**



**తిరుమల,నవంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన సేవలందించేందుకు, సమాచారం కోసం కల్యాణకట్ట,లడ్డూవితరణకౌంటర్‌ల వద్ద హెల్ప్‌డెస్క్‌లు ప్రారంభిస్తున్నట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. లడ్డూకౌంటర్‌ల వద్ద, వైకుంఠం కంపార్టుమెంట్లలో పరిశుభ్రత విషయంలో రాజీలేదన్నారు. గోపార్క్‌టెక్నాలజీ ప్రైవేట్ లిమిటడ్ సంస్థ తిరుమలలో పార్కింగ్ సమస్య, స్మార్ట్‌ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ప్రీబుకింగ్ వంటివాటి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ తెలిపారు. అన్నప్రసాదం, క్యూలైన్లనిర్వహణ, లడ్డూకౌంటర్ విభాగాలపై భక్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించే సమయంలో చేతులకు గ్లౌజ్‌లు ధరించాలన్నారు. శనివారం తిరుమలలో జరిగిన సమావేశంలో సిపిఆర్‌ఒ డాక్టర్ తలారి రవి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్(ఆర్1),సోమన్నారాయణ(ఆరోగ్యం), రాజేంద్ర(అన్నదానం), ,క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, పిఆర్‌ఒ నీలిమ పాల్గొన్నారు.

## పరకామణి చోరీ కేసులో కీలక నిందితుడు సివి రవికుమార్, అతని కుటుంబసభ్యులను విచారించిన సిఐడి అధికారులు



**తిరుమల,నవంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో 2023లో జరిగిన అమెరికన్ డాలర్లు చోరీ కేసులో సిఐడి అధికారులు దర్యాప్తుపురోగతి సాధిస్తున్నారు. ఈ కేసులో కీలకనిందితుడు సివి రవికుమార్‌ను, అతని కుటుంబసభ్యులను శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు తిరుపతి పద్మావతి విశ్రాంతి గృహంలో అత్యంత భద్రతనడుమ విచారణ చేశారు. సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్, ఎస్పి,న్యాయసలహాఅధికారి అడిగిన చోరీకి సంబంధించిన ప్రశ్నలకు రవికుమార్ సమాధానాలు దాటవేశారని తెలుస్తోంది. పరకామణితోపాటు పెద్దజీయర్‌మఠంలో ఉద్యోగిగా 45వేల రూపాయలు జీతం తీసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న నీకు 14కోట్ల రూపాయలకుపైగా విలువైన ఆస్తులు ఎలా సంపాదించావు ?ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు స్టాంప్‌డ్యూటీ ఫీజుకు 42లక్షలు రూపాయలు ఎక్కడ నుండి ఎవరి నుండి తీసుకున్నావు అనే ప్రశ్నలు సంధించారు.అయితే వీటన్నిటికీ అతని నుండి సమాధానాలు పొంతనలేకుండా వినిపించాడని సమాచారం. కాగా ఇదే కేసులో 2023లో తిరుమలలో పనిచేసిన గత సిఐ జగన్మోహన్‌రెడ్డిని, సిఐ చంద్రశేఖర్‌ను, ఎస్ఐ లక్ష్మీరెడ్డిలను పోలీసు అధికారులు విఆర్‌కు పంపడం ఇప్పుడు సంచలనంగా మారింది. ఈ కేసులో వీరిని త్వరలోనే విచారణ చేపట్టే సూచనలు ఉన్నాయి. ఇంకా శనివారం పరకామణి డిప్యూటీ ఇఒ , కొందరు సిబ్బందిని సిఐడి విచారణ చేపట్టి అవసరమైన సమాచారం రాబట్టింది.

# పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడంపై సిఎం చంద్రబాబుకు శ్రద్ధ లేదు :పిసిసి అధ్యక్షురాలు షర్మిళ



**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబుకు నదుల అనుసంధానంపై ఉన్న శ్రద్ధ. పోలవరం పూర్తి చేయడంపై లేదని పీసీసీ అధ్యక్షురాలు వై.షర్మిళారెడ్డి వాఖ్యానించారు. ఈ మేరకు షర్మిళ పీసీసీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు.నిన్న బనకచర్ల, నేడు నల్లమల సాగర్.. పోలవరం లింక్ ప్రాజెక్టుకు అనుమతులు రాకున్నా చంద్రబాబు ఆశ మాత్రం చావలేదని షర్మిల వ్యాఖ్యానించారు. పనికి రాని ప్రాజెక్ట్ కు డీపీఆర్‌ల మీద , నిధుల సమీకరణ మీద పెట్టే దృష్టిని ఇతర ప్రాజెక్టులపై పెట్టడం లేదన్నారుజ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంపై పెట్టడం లేదన్నారు. పోలవరంతో పాటు 56 ప్రాజెక్టులు పెండింగ్ లో ఉంటే, వాటిని గాలికొదిలేసి లింక్ ప్రాజెక్ట్ జలయజ్ఞానికి నిధులు లేవు కానీ.. రూ.58 వేల కోట్లతో పోలవరం నల్లమల సాగర్ లింక్ కడతారట అని ఏద్దేవా చేసారు. ఇది భారీ అవినీతికి స్కెచ్ కాకపోతే మరేంటి అని ప్రశ్నించారు. లింక్ ప్రాజెక్ట్ తో ఉపయోగం లేదని నిపుణులు మొత్తుకుంటున్నా.. డీపీఆర్ పేరిట హడావిడి ఎందుకు ? అన్నారు. పోలవరం,పెండింగ్ జలయజ్ఞ ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వానికున్నది సవతి తల్లి ప్రేమ అన్నారు. ఎత్తు తగ్గించి కేంద్రం అన్యాయం చేసినా నోరు మెదపనిది ఇందుకే. పోలవరం ఎత్తు 45.72 మీటర్ల నుంచి 41.15 కు కుదించి జీవనాడిలో జీవం తీశారు. రూ.25వేల కోట్ల ఆర్ అండ్ ఆర్ మిగులు కోసం ప్రాజెక్టుని డ్యామ్ గా మార్చారు. 7 లక్షల ఎకరాలకు, 25 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు, 30 లక్షల మందికి మంచి నీరు అందించే పోలవరం ప్రాజెక్టు స్వరూపాన్ని మార్చి ప్రశ్నార్థకం చేశారన్నారు. బ్యారేజ్ గా తప్ప బహుళార్ధక సాధకంగా పనికి రాకుండా చేశారన్నారు.సర్వం కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం అందక తీరని ద్రోహం చేశారు.జాతీయ హోదా ప్రాజెక్టుకి కేంద్రం ఇంత అన్యాయం చేస్తుంటే, మిగులు బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రయోజనాలకు సమాధి కడుతున్నారన్నారు. కూటమిలో పెద్దన్న పాత్ర పోషించే చంద్రబాబు గారు నోరుమెదపకుండా ,. లింక్ పేరుతో హంగామా చేయడం దుర్మార్గం అన్నారు. బాబుకి ఏటీఎం గా పనికొచ్చేందుకే ఈ కొత్త ప్రాజెక్టు అన్నారు.జరాష్ట్రంలో జలయజ్ఞ పెండింగ్ ప్రాజెక్ట్ ల సంఖ్య 56 అన్నారు.

ఇవ్వాల్టి అంచనాల ప్రకారం పూర్తి చేయాలంటే కావాల్సి న నిధులు రూ. 60 వేల కోట్లు అవుతుందన్నారు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే అందుబాటులోకి వచ్చే సాగునీటి లభ్యత 581 టీఎంసీలు అన్నారు. సాగుబడి జరిగే అదనపు విస్తీర్ణం అక్షరాల 54 లక్షల ఎకరాలు అన్నారు. గోదావరి లింక్ ప్రాజెక్టుకు పెట్టే 80 వేల కోట్ల నిధులతో జలయజ్ఞ పూర్తి చేస్తే అదనంగా 30 లక్షల ఎకరాలకు ప్రయోజనం అన్నారు. ఇంత తెలిసి చంద్రబాబు గారు పెండింగ్ ప్రాజెక్ట్ లపై కన్నెత్తి చూడటం లేదంటే.. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఎంతుందో అర్థమవుతుందన్నారు.

## న్యాయవాదుల కుటుంబాలకు ఆర్థిక సాయం కోసం రూ. 46 కోట్లు విడుదల

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు అండగా నిలుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మృతి చెందిన 1,150 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు రూ. 46 కోట్లను విడుదల చేసింది. ప్రతి కుటుంబానికి రూ. 4 లక్షల చొప్పున ఈ సాయం అందనుంది. ఈ మేరకు అర్హులైన న్యాయవాదుల జాబితాను ఖరారు చేస్తూ ప్రభుత్వం రెండు వేర్వేరు జీవోలను జారీ చేసింది. "ఏపీ అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ మ్యాచింగ్ గ్రాంట్" కింద ఈ నిధులను విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. మరణించిన న్యాయవాదికి సంబంధించిన నామినీకి ఈ ఆర్థిక సహాయాన్ని అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిధుల పంపిణీకి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఏపీ బార్ కౌన్సిల్ కార్యదర్శిని ప్రభుత్వం ఆదేశించింది. న్యాయశాఖ కార్యదర్శి గొట్టపు ప్రతిభా దేవి ఈ ఉత్తర్వులను జారీ చేశారు. వృత్తిలో కొనసాగుతూ దురదృష్టవశాత్తు మరణించిన న్యాయవాదుల ఆదుకోవాలనే లక్ష ్యంతో ప్రభుత్వం నిర్ణయం

## జగన్ పేటియం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

**శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ**

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పెంచి పోషిస్తున్న పేటీఎం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ హెచ్చరించారు. తల్లి, చెల్లిని కూడా వదలకుండా వ్యక్తిత్వ హననం చేయించిన దుర్మార్గుడు జగన్ రెడ్డి అని విమర్శించారు. కల్తీమద్యంతో 30 వేల మంది ప్రాణాలు తీసి ఎందరో తల్లులకు గుండెకోత మిగిల్చారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టించి వారిని జైలుకు పంపుతూ.. తల్లిదండ్రులకు ఆవేదన మిగుల్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పిల్లలతో జగన్ చేయిస్తున్న వికృత చేష్టల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అనురాధ సూచించారు. భాస్కర్ రెడ్డి లాంటి చెంచాలను జగన్ ఎందరిని ప్రయోగించినా.. వారంతా కటకటాల వెనక్కి వెళ్లక తప్పదని తెలిపారు. పనికిమాలిన పేటీఎం బ్యాచ్‌తో ఇంకెంత కాలం విషప్రచారం సాగిస్తారు అని ప్రశ్నించారు. తలా తోక లేకుండా అర్థం లేని వ్యాఖ్యలతో మహిళల్ని కించపరిచే మీరు అసలు మనుషులేనా అని నిలదీశారు. ప్రజలు 11 సీట్లు ఇచ్చినా ఇంకా బుద్ధి రాలేదా అని ఆక్షేపించారు.

# ప్రపంచ వ్యాప్తంగా సోషలిజం వైపు ఆకర్షణ పెరుగుతోంది

**- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు**



**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతి నిధి:** ప్రపంచవ్యాప్తంగా సోషలిజం పట్ల ఆకర్షణ పెరుగుతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. తొలి సోషలిస్టు విప్లవ దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఎన్‌టిఆర్ జిల్లా సిపిఎం కమిటీ ఆధ్వర్యాన రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు జరిగింది. అనంతరం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సోషలిజం ఔన్నత్యం సామ్రాజ్యవాద ప్రమాదం అనే అంశంపై శుక్రవారం రాత్రి బాగా పొద్దుపోయేంత వరకు జరిగిన సభలో బి.వి రాఘవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా ఆర్థిక రాజధాని న్యూయార్కులో సోషలిస్టు జోహ్రాన్ మమ్దాని సాధించిన ఘన విజయాన్ని ప్రస్తావించారు. ప్రపంచ వ్యాప్త పెత్తనం కోసం, సామ్రాజ్యవాద విధానాల అమలుకోసం ఒత్తిడి చేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో న్యూయార్క్ ప్రజానీకం సోషలిస్టు మమ్దాని వైపు నిలిచారని చెప్పారు. ఇదొక్కటే కాదని, ఇటీవల అమెరికాలో యువతపై నిర్వహించిన ఒక సర్వేలో 60 శాతం మంది సోషలిజం కావాలని కోరుకుంటున్నారని తేలిందని చెప్పారు. రాజరికపాలన సాగిస్తున్న ట్రంప్ విధానాలపై అమెరికాలోని 200 పట్టణాల్లో నిరసన ప్రదర్శనలు భారీ ఎత్తున జరిగాయని తెలిపారు. పపంచ సంపదను దోచుకుని అమెరికాలో పెట్టడం తప్ప అక్కడ ప్రజలకు పెట్టుబడిదారీ విధానం చేస్తున్నదేమీ లేదని అర్థం అయిందన్నారు. దీంతో అక్కడి యువతలో సోషలిజం వైపు మొగ్గు పెరుగుతోందని తేలిందన్నారు. గత 40 రోజుల నుండి అమెరికాలో పాలన నిలిచిపోయిందని, వేతనాలు చెల్లించకపోవడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు. అమెరికాలో ఇటీవల జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ట్రంప్ ఓడిపోతున్నారని, రాజరికం వద్దనే ప్రదర్శనలు అందులో భాగమేనని తెలిపారు. రష్యాలో సోషలిజం పాలన కూలిపోయిన తరువాత పెట్టుబడిదారీ విధానాన్ని భరించాల్సి ం దేనని ప్రజలు భావించారని అన్నారు. ఇప్పుడు వారే సోషలిజం వైపు మళ్లుతున్నారని అన్నారు. ప్రపంచంలో వ్యాపారం 40 శాతం తగ్గిందని, పెట్టుబడిదారీ విధానం క్షీ ణిస్తోందని చెప్పడానికి ఇదే ప్రత్యక్ష ఉదాహరణని అన్నారు. ఆ విధానం ప్రజలకు ఉపాధి కల్పించ లేకపోతోందని చెప్పారు. కష్టాల పాల్జేస్తున్న పెట్టుబడిదారీ విధానాన్ని తొల గించుకోవాలనే నిర్ణయానికి ప్రజానీకం వస్తోందని, ఈ పరిణామాలన్ని సోషలిజానిదే భవిష్యత్తు అని స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. డాలర్ విలువ తగ్గుతోందని, అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింత

## అక్షరాలు పొందికగా రాయటం నేర్పిస్తున్న టీచర్ ఫిరోజ్‌బాషాకు అభినందన: మంత్రి లోకేష్




తరగతి గదిలో ఉపాధ్యాయుడు షేక్ ఫిరోజ్‌బాషా

**అమరావతి, నవంబర్ 8, ప్రభాతవార్త ప్రతినిధి:** పిల్లల తలరాత మార్చే విద్యను అందిస్తూ, అందమైన అక్షరాలు పొందికగా రాయడం నేర్పిస్తూ, ఆదర్శంగా నిలుస్తున్న పిడుగురాళ్ల మండలం, తుమ్మలచెరువు మెయిన్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్న షేక్ ఫిరోజ్ భాషాకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా...అంటూ రాష్ట్ర ఐటి, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మేరకు శుక్రవారం సాయంత్రం ప్రకటన చేశారు. ప్రతి రోజూ ఉదయం ముందుగా స్కూలుకు వెళ్లి, సాయంత్రం అదనపు సమయం స్కూలులోనే ఉంటూ విద్యార్థులకు క్లాసులు తీసుకునే మీ కమిట్మెంట్‌కు హ్యాట్సాఫ్ అని పేర్కొన్నారు.. మీరు పిల్లలకు నేర్పిన తెలుగు, ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ డిజిటల్ ప్రింటింగ్‌లా అందంగా ఉంది. పిల్లలకు వివిధ సబ్జెక్టుల్లో ఉన్న భయాలను పోగొట్టేందుకు, వారిలో ఒకరిగా కలిసిపోతూ ఆటపాటలతో విద్యా బోధన చేస్తున్న షేక్ ఫిరోజ్ భాషా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. స్కూల్లో ప్రస్తుతం 200 మంది పిల్లలు చదువుతుండడం గొప్ప విషయం అని, ఇదే ప్రభుత్వ పాఠశాలల్లో నేను కోరుకుంటున్న మార్పు అని పేర్కొన్నారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దేందుకు తన శక్తి మేర కృషి చేస్తున్న షేక్ ఫిరోజ్ బాషాకు, సహకరిస్తున్న తోటి టీచర్లు, సిబ్బందికి ధన్యవాదాలు అంటూ మంత్రి లోకేష్ అభినందనలు తెలిపారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన వారిపై సత్వరం చర్యలు తీసుకోవాలి

**- 17న ఛలో ఢిల్లీకి పిలుపునిచ్చిన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ**



**చిత్తూరు, నవంబర్ 8 ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసిన వారిపై సత్వరం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీన ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిరసనతో పాటు ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగ అన్నారు. చిత్తూరు అంబేద్కర్ భవన్‌లో శనివారం ఎంఆర్‌పిఎస్ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగ విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగి నెల రోజులు కావస్తున్న ఇప్పటి వరకు పోలీసు శాఖ దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. దాడికి గురైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దళితుడు కావడంతోనే ఇతర శాఖలు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. అలాగే రౌడీషీటర్లు ఎన్‌కౌంటర్లకు గురైతే స్పందించి సుమోటోగా కేసులు తీసుకునే మానవ హక్కుల కమీషన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని సుమోటోగా తీసుకోకపోవడం దళితులకు జరుగుతున్న అన్యాయాలకు నిదర్శ నంగా నిలుస్తోం దన్నారు. ఇటు పోలీసులతో పాటు న్యాయ విభా గాలు ఈ విషయంను పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించి అనంతరం సొంత రాష్ట్రానికి వెళ్ళిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి అక్కడ సైతం ఆయనకు అధికారులు సరైన గౌరవం ఇవ్వలేదన్నారు. ఈ విషయాలపై దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమం నిర్వహించడానికి ఈ నెల 17వ తేదీన ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వ హిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా వున్న మాదిగ సోదరులు ఛలో ఢిల్లీ కార్యక్రమంకు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కుటుంబ కలహాలతో భార్యపై హత్యాయత్నం

**- భర్త ఆత్మహత్య, కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, నవంబరు 8 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామంలో దంపతుల మధ్య తలెత్తిన కుటుంబ కలహాల కారణంగా ఏర్పడ్డ వివాదం చివరకు భార్యపై హత్యాయత్నం చేసి ఆపై భర్త ఆత్మహత్య చేసుకోవడంతో హృదయ విధరకంగా సంఘటనగా మారింది . దీంతో వారిద్దరికీ చెందిన కుమారుడు, కుమార్తె అనాథలుగా మిగిలారు. ఒకపక్క కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం డ్రైవర్స్ కాలనీలో చోటు చేసుకోగా.. మరోపక్క కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ పోలీసు సర్కిల్ కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. భార్య డ్రైవర్స్ కాలనీలో హత్యాయత్నానికి గురికాగా.. భర్త తాళ్లరేవు మండలం పటవల గ్రామ శివారులో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి కాకినాడ రూరల్ సర్కిల్ పరిధిలోని ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు, కోరంగి ఎస్సై పి సత్యనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం ఈ ఘటనలో భార్య చీపురుపల్లి దేవి తీవ్ర గాయాల పాలై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆమె భర్త చీపురుపల్లి రాజేష్ (38) ఆత్మహత్యకు పాల్పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కోరంగి ఎస్సై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. బార్బర్ వృత్తి చేసుకుంటున్న రాజేష్ భార్యాపిల్లలతో కర్ణాటకలో ఉంటున్నాడు. అయితే ఇటీవల దీపావళి సందర్భంగా రాజేష్ స్వగ్రామమైన కాజులూరు మండలం శీల గ్రామానికి వచ్చారు. రాజేష్ భార్య దేవి కాకినాడ రూరల్ మండలం డ్రైవర్స్ కాలనీకి వాళ్ల పుట్టింటికి వెళ్ళగా శుక్రవారం సాయంత్రం వీరిద్దరి మధ్య కుటుంబ కలహాలు ఎక్కువ అవ్వడంతో న్యాయవాది ద్వారా సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నించి అనంతరం చాకుతో భార్య దేవిని భర్త రాజేష్ తీవ్రంగా గాయపరిచి వారి ఇద్దరి పిల్లలను తీసుకుని రాజేష్ స్వగ్రామమైన శీల వెళుతూ.. పటవల గ్రామపంచాయతీ పరిధిలోని మంజేరు రోడ్డు సమీపంలో తనతో పాటు తెచ్చుకున్న పాయిజన్ తీసుకుని, భార్యపై దాడి చేసిన కత్తితో అతను పీక కోసుకుని పిల్లలను అక్కడే వదిలేసి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం కోరంగి ఎస్ఐ పి సత్యనారాయణకు సమాచారం రాగా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చరికి తరలించారు. దీనిపై కోరింగ ఎస్సై సత్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామపంచాయతీ పరిధిలోని డ్రైవర్స్ కాలనీ వద్ద హత్యాయత్నానికి గురైన దేవి తీవ్ర గాయాల పాలవడంతో ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నది.

రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ సమీపంలోని మీర్జాగూడలో కంకర లారీ, ఆర్టీసి బస్సు ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదంలో 20 మంది మృతిచెందిన సంఘటనతో తెలంగాణ ప్రజలు ఉలిక్కిపడి నిద్రలేచి ఉక్కిరి బిక్కిరి అవుతుండగా సోమవారం రోజునే యాధృచికంగా జాతీయ హరిత ట్రిబ్యునల్ ప్రమాద భరితమైన రోడ్డు విస్తరణకు ఆమోదముద్ర వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయరహదారి 163రంగారెడ్డి జిల్లాలోనిమొయినాబాద్ నుంచి వికారాబాద్ జిల్లాలోని మన్నెగూడ మధ్య విస్తరణకు అనుమతి ఇచ్చింది. జాతీయ రహదారి 163 రెండు వరుసల నుంచి ఆరు వరుసలుగా విస్తరణచేయడానికి ఎనిమిది ఏళ్ల క్రితం సిద్దంకాగాహైదరాబాద్‌కు చెందినకొంత మంది పర్యావరణ ప్రియులు జాతీయ



హరిత ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా రోడ్డు విస్తరణలో భాగంగా900 మర్రి చెట్లను నరికి వేసేందుకు సిద్దం కాగా వాటిని సంరక్షించేందుకు నగరంకు చెందిన పర్యావరణ వేత్తలు అడ్డుచెప్పారు. దీనితో రోడ్డునిర్మాణం విస్తరణ పనులు హరితట్రిబ్యునల్‌లో ఎటు తేలకపోవడంతో సంవత్సరాలుగా నిలిచిపోయాయి. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పట్టు వదలకుండా రోడ్డువిస్తరణకు కేసు ఉపసంహరణకు అనేకమార్గాలు ప్రత్యామ్నయగా చూపినాఎన్‌జిటి మాత్రం పర్యావరణ, అటవీవాతావరణమార్పుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని పర్యావరణ మదింపు కమిటీమార్చి 2025లో మర్రి చెట్లను కాపాడేందుకు సమగ్ర అధ్యయనం చేయాలని సిఫార్సునుఅనుసరించి ఎన్‌జిటి రోడ్డువిస్తరణను అబయన్స్‌లో పెట్టింది.

# మరణమృదంగం మోగిస్తున్న రహదారులు

**భాగ్యనగర్ భాస్కర్ కుమార్**

జాతీయ రహదారి 163పై చెవెళ్ళ సమీపంలో మీర్జాగూడలో కంకర లారీ, ఆర్టీసి బస్సు ఢీకొన్నసోమవారం నాటి రోడ్డు ప్రమాదం దేశంలో జరిగే అనేక ప్రమాదల తరహాలో బాధిత కుటుంబాలలో విషాదం నింపి ప్రభుత్వం నమోద చేసే ప్రమాదాల చిట్టాలలో చేరుకొంది. రోడ్ల నిర్మాణాలలో లోపాలు, అతివేగం, లైసెన్స్‌ల జారీలో అక్రమాలు, డ్రైవర్ల బాధ్యతారాహిత్యం భద్రతా ప్రమాణాలు అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి రహదారులు రక్తంతో తడుస్తునాయి. చెవెళ్ళ సంఘటనలు ఎన్ని జరిగినా భారతదేశంలో ప్రతినిత్యం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన హేతువైన రోడ్ల స్థితిగతులను సంస్కరించబడవు. దేశంలో రోడ్డు ప్రమాదాలు ఏటేటా పెరుగుతూ యుద్ధం ఉగ్రదాడులకు మించి మరణమృదంగం మ్రోగిస్తున్నాయి. భారత దేశంలో గత సంవత్సరం 4,79,753 ప్రమాదాలు సంభవిచాయి. ఒకలక్షా 73వేల మంది మృతి చెందగా, ఐదులక్షల మంది తీవ్రగాయాలపాలైనారు ఇందులో లక్షా పదివేల మంది జీవచ్ఛవాలుగా బ్రతుకుతున్నారు. ప్రతి గంటకు 55ప్రమాదాలు, 20 మరణాలు సంభవిస్తున్నాయి. అమెరికా, కెనడావంటి అభివృద్ధిచెందిన దేశాలలో వంద ప్రమాదాలలో కనిష్ఠంగా ఒకరు గరిష్ఠంగా ఇద్దరు చనిపోతుంటే భారతదేశంలో వంద ప్రమాదాలకు32నుంచి 33మంది వరకు చనిపోతున్నారట. అంతర్జాతీయ రహదారి సమాఖ్య ప్రకారం, ఒక ప్రాణం కోల్పోతే రూ.4కోట్ల నష్టం జరుగుతుంది. భారత దేశవ్యాప్తంగా రహదారి ప్రమాదంలో రోజుకు పాదాచారులు, బస్సులు, లారీలు నడిపేవారు, కార్లు, జీపులు ద్విచక్రవాహన దారులు సగటున నాలుగు వందల మందికిపైగా చనిపోతున్నారు. అరుదుగా జరిగే ఒక ఖండాంతర విమాన ప్రమాదంలో చినిపోయే ప్రయాణీకుల సంఖ్యకంటే ఇది అధికం. విమాన ప్రమాదాలు సంభవిస్తే ప్రభుత్వాలు వెంటనేపూనుకొని అలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకొంటాయి. అనేక సంస్థలతో భద్రతపై విచారణలు జరిపి వాటిని నియంత్రిస్తాయి. రోడ్డు ప్రమాదాలకు కాలం చెల్లిన, సరైన ఫిట్‌నెస్ వాహనాలు, రోడ్లు, మానవ తప్పిదాలు వంటి ప్రధాన కారణాలున్నప్పటికి మన పాలకులు అంత వేగంగా స్పందించరు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయేవారు అత్యధికంగా పేదలు ఉంటారు. అందుకే ఏలాంటి విచారణలు ఉండవు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 15లక్షల కంటే ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. తెలుగురాష్ట్రాలను ఇటీవల కర్నూలు జిల్లా చిన్నటేకూరులో బస్సు దగ్ధం సంఘటన కుదిపివేసింది. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా దారులు వెతకడం కంటే యాజమాన్యంను రక్షించడానికి మన ప్రభు



త్వాలు శ్రద్ధవహించాయి. ఓబైకును ట్రావెల్స్ బస్సు ఢీకొన్నది. అనంతరం 300మీటర్ల వరకు బైక్‌ను లాక్కొని వెళ్లిపోయింది. బైక్ బస్సు కిందిభాగంలో చిక్కుకోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈక్రమంలో బస్సుమొత్తానికి మంటలు వ్యాపించడంతో క్షణాల్లోనే కాలి బూడిదైంది. అయితే బస్సులో ఉన్న ప్రయాణికుల్లో 19మంది ఎమర్జెన్సీ డోర్ పగులగొట్టుకుని నుంచి బయటకు వచ్చారు. మిగిలినవారు కాలిబూడిదయ్యారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 41మంది ప్రయాణికులున్నారు. వారిలో 11మంది సజీవ దహనమయ్యారు. మరణించిన 19మంది మృతదేహాలను వెలికితీసిన అధికారులు అక్కడే పోస్టుమార్టం పూర్తి చేశారు. మృతదేహాల గుర్తింపు కోసం డీఎన్‌ఏ పరీక్షలు చేసి వారి బంధువులకు అప్పగించారు. బస్సు ఫిటెన్స్ పై అనేక అనుమానాలు అటువైపు ప్రజల దృష్టి మళ్ళించకుండా బైకర్‌దే పూర్తిగా తప్పనే రీతిలో కేసును తప్పుదారి పట్టించడానికి మాత్రమే పూర్తిశక్తి యుక్తులను మన పాలకులు కేంద్రీకరించారు. ప్రైవేటు బస్సులు ప్రమాదానికి గురైనప్పుడు డ్రైవర్లతో పాటు యజమానులను కూడా బాధ్యులను చేసే అంశంపై కూడా ప్రభుత్వం ఉదాసీనత ఉంటుంది. ప్రాణాంతక ప్రమాదాలను తగ్గించడానికి రవాణా శాఖ ప్రత్యేక దృష్టి సారించడంలేదు. కార్తీకపౌర్ణమి రోజు జగిత్యాల డిపో బస్సులో 170మంది ప్రయాణిస్తుంటే దాని రెండు చక్రాలు వూడిపోయి ప్రమాదం సంభవించింది. అదృష్టవశాత్తు ఎవరికి ఏం నష్టం జరగలేదు. 2014 నుండి తెలంగాణలో 2.57 లక్షల ఘటనలు జరిగాయి. ఈ ఘటనలలో 83 వేల మందికి పైగా మరణించారు. పేద మధ్యతరగతి వర్గాలకు చెందిన యువత, నడివయస్సు వ్యక్తులు ఎక్కువగా బలవుతున్నారు. ప్రమాదం నింపిన శోకం ఎన్నో కుటుంబాలను ఆర్థికంగా కూడా కుంగదీస్తున్నది. వాహనాల తయరీలో అధునాత భద్రత అంశాలు జోడిస్తున్నప్పటికి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆధునిక బ్రేకింగ్ వ్యవస్థలు, ఎయిర్ బెలూన్లు అందుబాటులోకి వచ్చినా సీట్‌బెల్ట్ వంటివి పెట్టుకోకపోవడంతో అవి సకాలంలో తెరుచుకోని పరిస్థితి నెలకొంది. మనదేశంలోపాదాచారుల భద్రత విషయంలో ఏమాత్రం శ్రద్ధతీసుకోవడంలేదు. అభివృద్ధి చెందిన దేశాలలో పాదాచారులకు ప్రత్యేకంగా విలువ ఇవ్వడంతోపాటు వారి ఫుట్‌పాత్‌లుంటాయి. మోటారువాహనాలకు సైకిళ్ళకు ద్విచక్రవాహనాలకు వేర్వేరు మార్గలు ఉండేలా మనం శ్రద్ధ తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రాణాంతకంగా అంబులెన్స్ ఆలస్యం ప్రమాదాల బారినపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలిస్తే బాధితుల ప్రాణాలను కాపాడుకోవచ్చు కానీ మనం 108కి ఫోన్ చేసి చేతులు దులుపుకొంటున్నాం. అంబులెన్స్ ఆలస్యంగా రావడంతో అనేక మంది ప్రాణాలు వదులుతున్నారు. ఆసుపత్రికి రోడ్డు ప్రమాదబాధితుడి తరలించడం వల్ల ఏదైనా చట్టపరమైన ఇబ్బందులు ఎదరువుతాయే శంకతో కూడా అనేక మందికి బాధితుడికి సహాయం చేయాలే తపన ఉన్నప్పటికి సాహనం చేయలేకపోతున్నారు. చట్టం ప్రకారం ఎటువంటి ఇబ్బందులు ఉండవు కానీ మనపోలీసుల అత్యుత్సాహ ప్రవర్తన కూడాసాయం చేసే చేతులను కట్టడిచేసేలా చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. రోడ్డుప్రమాద బాధితులకు సహాయం చేసేందుకు జనంలో చైతన్యం నింపేందుకు అవగాహన పెంచాలి. ప్రమాదాల కారణంగా ప్రాణాలు మాత్రమే పోవడంలేదు మన జిడిపిపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది. రాష్ట్రరోడ్డు భద్రత నిధికి సుప్రీంకోర్టు భద్రతా కమిటి సిఫార్సు చేవెళ్ల రోడ్డు ప్రమాదం పైదృష్టి సారించిన సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటి రాష్ట్ర ప్రభుత్వం రోడ్డుభద్రత నిధినిఏర్పాటుచేయా లని సూచించింది. సుప్రీంకోర్టు నియమించిన రోడ్డు భద్రతా కమిటీ ఛైర్మన్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహార్ సప్రే తనసభ్యులు సంజయ్ బందోపాధ్యాయ ఇవాళ హైదరాబాద్‌కు గురువారం వచ్చి చేవెళ్ల రోడ్డు ప్రమాదంపై సంబంధిత శాఖల అధికారుల తో సమీక్ష నిర్వహించారు. చేవెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి గల కారణాలను కమిటీ అడిగి తెలుసుకుంది. సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి ప్రమాదం జరగడానికిగల కారణాలను కమిటీకి తెలియ జేశారు. ఆర్టీసీబస్సుల ఫిట్‌నెస్ మరోసారి తనిఖీ చేయాలని, వాటితో పాటు ఇతర బస్సులు, కమర్షియల్ వాహానాలను తనిఖీ చేసి ఫిట్‌నెస్ లేని వాహానాలను సీజ్‌చేయాలని అధికారులను కమిటీఆదేశించింది. ప్రతివాహనం ఇన్సూరెన్స్, పర్మిట్, ఫిట్నెస్ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి విస్తరణ పనులను తొందరగా చేపట్టి పూర్తి చేయాలని ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులకు సూచించారు. మైనింగ్ క్వారీల నుంచి పరిమితికి మించి లోడ్ వెళ్లకుండా చూడాలని మైనింగ్, రవాణా శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. భారతదేశంలో డ్రైవింగ్ లైసెన్స్ జారీచేయడంలో కూడా అలసత్వం నెలకొంది. ట్రాఫిక్ నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఫోటోగ్రాఫర్లుగా మారికేవలంచాలానాలు వేయ డమే తమ ప్రాథమిక విధిఅన్నట్లు వ్యవహారిస్తున్నారు. డ్రైవింగ్ చేసేవ్యక్తి ఆ వాహనం నిర్వహించే శక్తి యుక్తి ఉందా ఆయనలో రక్షణాత్మక డ్రైవింగ్ విధానం ఉందా డ్రైవింగ్ నైపుణ్యం, రోడ్డుచిహ్నాం అర్థం చేసుకొనే పరిజ్ఞానం ఉందా అనేవిషయం ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా నిర్లక్ష్యంగా లైసెన్స్ జారీచేస్తున్నారు. ఇప్పుడు ఎంతోమంది డ్రైవింగ్‌తోఉపాధి పొందుతున్నా వారికి సరైన శిక్షణ లేదు. డ్రైవింగ్ నిర్లక్ష్యంతో చేయకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలి. ●

# ఆ 'పది' ఎవరిది?

బీహార్

**ఎ.వి.వి ప్రసాద్**

యుద్ధంలో మొదటి అంకం పూర్తయింది. అధికార, విపక్ష శిబిరాలలోని క్షతగాత్రులు తమకు తగిలిన గాయాలకు లేపనం రాసుకొంటూ మలివిడతపోరాటానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఎవరి శిబిరాలలో వారు అంచనాలు వేసుకోవడం సాధారణమే అయినా, ఈసారి ఒక అసాధారణ దృశ్యం బీహార్ పోలింగ్‌లో కనిపించింది. అది పోలింగ్ దాదాపు పది శాతం పెరగడం. ఈ పెరుగుదల పట్ల పరిశీలకులే కాదు, రాజకీయ పార్టీల నేతలు కూడా ఆశ్చర్యపోతున్నారు. ఇసి అనుసరించిన 'సర్' వల్ల గత గురువారం (6, నవంబరు) మొదటి విడత జరిగిన 121 నియోజకవర్గాలలో దాదాపు 15 లక్షల ఓట్లు తగ్గడంతో ఓటింగ్ శాతం కూడా తగ్గవచ్చనే అంతా భావించారు. కానీ ఊహించనంతగా పెరగడమే ఈ ఆశ్చర్యానికి కారణం. అయితే ఈ పెరిగిన ఓట్లు ఏ పార్టీకి లభించి ఉంటాయన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. అధికార ఎన్డీయే కూటమికే ఆ అదనపు శాతం లభిస్తుందని ప్రధాని మోడీ, అమిత్ షాలు అంటుండగా, ఓటింగ్ పెరిగితే అది ఎప్పుడూ విపక్షానికే అనుకూలమని మహాగఠ్ బంధన్ నేతలు లాలూ, తేజస్వియాదవ్ అంటున్నారు. రాహుల్ గాంధీ సరేసరి. ఆయన చాలా ఉత్సాహంతో కనిపిస్తున్నారు. ఎన్నికల సంఘం సర్ విధానం వల్ల బీహార్‌కు ఏదో అన్యాయం జరిగిపోతోందని కాలికి బలపం కట్టుకుని ఊరూ వాడా ప్రచారం చేసిన రాహుల్ గాంధీ మొదటి విడత పోలింగ్ తర్వాత ఆ ఊసే ఎత్తకుండా ఓటింగ్ పెరుగుదల ప్రజాస్వామ్య విజయమని వ్యాఖ్యానించడం గమనించవలసిన అంశం. పెరిగిన పదిశాతం ఓట్లలో మహిళలు, యువత ఎక్కువగా ఉన్నట్లు ఎన్నికల అధికారులు చెబుతున్నారు. వారు ఆ మాట అనగానే ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఒక ప్రకటన చేస్తూ మహిళా సంక్షేమానికి తాము అహరహం శ్రమిస్తున్నామనీ, గెలుపొందితే వారికి మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తామనీ హామీఇచ్చారు. రాష్ట్రంలోని దాదాపు 1.21 కోట్ల మంది మహిళలకు ప్రతినెలా పదివేల రూపాయలు 'సంక్షేమం' పేరుతో వారిఖాతాల్లో ఇప్పటికే జమ చేస్తుంటే వారు వచ్చి ఓటు వేయకుండా ఎలా ఉంటారు! తాము అధికారంలోకి వస్తే వచ్చే సంక్రాంతి నాటికిఒక్కో మహిళకు 30 వేలు ఇస్తామని మహాగఠ్ బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి అయిన తేజస్వి యాదవ్ ఆశచూపినప్పుడు ఆ మహిళలు మొత్తం కదిలి వచ్చారనే అనుకోవాలి. పట్టపగలే అనేకానేక నేరాలు, ఘోరాలతో అట్టుడుకుతూ 'జంగిల్ రాజ్' గా పేరు మోసిన బీహార్‌లో, 50 శాతం ఓట్లు రావడమే అబ్బురమనుకున్న బీహార్‌లో పరిస్థితి ఎంత మారిందో ఈ ఎన్నికలను బట్టే అర్థమవుతోంది. ఇప్పుడదే రెండు



పోలింగ్ క్యూ

ప్రధాన రాజకీయ శిబిరాల్లో ఆశలను కూడా పెంచుతోంది. రెండు కూటములు వాగ్దానాల వర్షం భారీగానే కురిపించాయి. ముఖ్యంగా యువత, మహిళలు, రైతుల కోసమే తాముపుట్టినట్లుగా రెండు కూటములు విరివిగానే వాగ్దానాలు చేశాయి. ప్రశాంత్ కిశోర్ నాయకత్వంలోని జన్ సురాజ్ కూడా ఎన్నికలపై పెద్ద ఆశలే పెట్టుకుంది. విద్య, వైద్యం వంటి పలు అభివృద్ధి అంశాలపై ప్రశాంత్ కిశోర్ ( పికె) ముమ్మరంగా చేసిన ప్రచారం ఓటర్లలో కొంత మేర 'కదలిక' తెచ్చిందనే భావిస్తున్నారు. పోలింగ్ జరిగిన 121నియోజకవర్గాలలో 60శాతం దాకా గత ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సాధిం చింది. మిథిల, కోసి వంటి కొన్ని ప్రాంతాలలో స్పష్టత లేకపోయినా, దాదాపు 90 నియోజక వర్గాలలో గత ఎన్నికల ఫలితాలే లభించగల వన్నది పరిశీలకుల అంచనా. తమకు కనీసం 15సీట్లు అదనంగా లభించగలవని ఎన్డీయే నేతలు అంటుండగా, తమబలం కనీసం పదిశాతం పెరుగుతుందని ఇండియా కూటమి నేతలు ఆశాభావంతో కనిపిస్తున్నారు. వారి అంచనాలు ఎలాఉన్నా, యువతను ఆకట్టుకొనడానికితేజస్వి యాదవ్ చేసినయత్నాలకు తగిన ఫలితం లభించగలదనే తెలుస్తోంది. ప్రభుత్వం అందిస్తున్నఉచితవిద్యుత్, ఉపాధి కల్పనల ప్రభావం కూడా ఎక్కువే ఉంది. ఓటింగ్ పెరగడానికి అవికూడా కారణాలే. చిరాగ్ పాశ్వాన్ తిరిగి ఎన్డీయేకు చేర డంతో ఎస్సీల్లోని పాశ్వాన్ ఓట్లు తమకు కలిసి వస్తాయని బిజెపి భావిస్తుండగా, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ అధినేత ముఖేష్ సహనీ మద్దతు లభించడంతో తమకు అదనపు సీట్లు లభిస్తాయని ఆర్జేడీ భావిస్తోంది. ముస్లిం యాదవ్ సమీకరణం తమకు కలిసి వస్తుందనీ, ఇబిసిలు, దళితులు తమవెంటే ఉంటారనీ ఇండియా కూటమి లెక్కలు వేసుకొంటోంది. 1951నుంచి 2020దాకా జరిగిన అసెంబ్లీ ఎన్నికలను పరిశీలిస్తే 42నుంచి 57దాకా మాత్రమే ఓటింగ్ శాతాలుకనిపిస్తాయి. వాటిలో తొలుత కాంగ్రెస్, తర్వాత ఆర్జేడీ, ఆతర్వాత బిజెపిజెడియు కూటమి విజయాలు సాధించి బీహార్ అభివృద్ధికి దారిచూపాయి. ఈసారి ఓటింగ్‌శాతం బాగా పెరగడానికి అభివృద్ధి కంటే పార్టీలు ప్రకటించిన సంక్షేమ కార్యక్రమాలే ఎక్కువ ప్రభావం చూపాయని అంటున్నారు. తాము తిరిగి అధికారంలోకి వస్తే వచ్చే అయిదేళ్లలో కోటి ప్రభుత్వఉద్యోగాలు కల్పిస్తామని ఎన్డీయే అంటుండగా, తాముపస్తే ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మహాగఠ్ బంధన్ నేతలు హామీలు గుప్పిస్తున్నారు. యువత అధికంగా పోలింగ్ బూత్‌ల వద్దకు రావడానికి ఇదొక కారణంగా కనిపిస్తోంది. అయితే వారిద్దరూ ఇచ్చిన హామీలు నెరవేర్చడం అంత తేలికేనా? అన్నది ఫలితాల తర్వాత, ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తెలుస్తుంది. కోటిప్రభుత్వ ఉద్యోగాలు, లేదా ఇంటికో సర్కారీ కొలువు అందమైన ఊహ మాత్రమే అని తేలితే ఆ తర్వాత ఎన్నికలకు ఇక చెప్పడానికి ఏమీ ఉండదని కూడా తెలుస్తుంది. ఏదిఏమైనా మొదటి విడతలో పెరిగిన పదిశాతం ఓట్ల పైనే ఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఆ పది శాతం ఎన్డీయేకు లభిస్తుందా, గఠ్ బంధన్ కా అన్నది 14 వ తేదీన ఫలితాల్లో తేలిపోతుంది. మరో విడతలో 122 స్థానాలకు 11న పోలింగ్ జరుగుతుంది. దానిలో కూడా ఇదే విధమైన ట్రెండ్ కనిపిస్తుందో లేదో చూడాలి. ●

# ట్రిలియన్ డాలర్ 'మస్క్'!

అమెరికా

**గన్ని మోహాన్**

ఎలాన్ మస్క్. ఇప్పుడు ప్రపంచం మొత్తం ఈ పేరు మారుమోగిపోతోంది. నిజానికి డొనాల్డ్ ట్రంప్ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నప్పుటి నుంచీ మస్క్‌పేరు వార్తల్లోకి వచ్చింది. అవన్నీ ఒక ఎత్తు. ఇప్పుడు మస్క్ పేరు వాణిజ్యరంగంలో మారుమోగుతోంది. ఇందుకు ప్రధాన కారణం లక్షకోట్ల డాలర్ల వేతన ప్యాకేజి. ఎలాన్ మస్క్ మానస పుత్రికగా భావించే టెస్లా బోర్డు ఆయనకు వేతన ప్యాకేజి లక్షకోట్ల డాలర్లు అంటే వాణిజ్య భాషలో ట్రిలియన్ డాలర్లు అన్న మాట. భారతీయ కరెన్సీలో రూ.84 లక్షల కోట్ల రూపాయలు. ఈ రికార్డు వేతన ప్యాకేజికి షేర్ హోల్డర్లు ఆమోదం తెలిపారు. 75శాతం మంది వాటాదారులు కూడా ఆమోదం తెలిపారు. వాణిజ్య ప్రపంచంలో ఇంతటి భారీస్థాయి వేతన ప్యాకేజి పొందిన మొదటి సిఇఒ బహుశా మస్క్ ఒక్కరే అవుతారు. ఇందుకు వాటాదారుల్లో పెరిగిన విశ్వాసంతోపాటు ఆయన ముందు పెద్ద లక్ష్యాలు కూడా పెట్టారు. టెస్లా విద్యుత్ కార్ల మార్కెట్ విలువలు పదేళ్లలో రెట్టింపుచేయాల్సిన బాధ్యతను ఆయన భుజాలపై ఉంచింది. టెస్లా వాహానాల సేల్స్, ఉత్పత్తి రెట్టింపు చేయడంతో పాటు పది లక్షల రోబోల ఉత్పత్తి, పంపిణీ ఆయన పర్యవేక్షించాలి. వాణిజ్య వినియోగావసరాల కోసం పది లక్షల రోబో ట్యాక్సీ వాహానాలు కూడా ప్రవేశపెట్టాలి. ప్రస్తుతం ఉన్నటెస్లా మార్కెట్ విలువలు 1.4లక్షల ట్రిలియన్ డాలర్లను 8.5లక్షలకోట్ల డాలర్లకు పెంచాల్సిఉంటుంది. ఈ లక్ష్యాలన్నీ అధిగమిస్తే ఆయనకు 400 మిలియన్ డాలర్లఅదనపు టెస్లాషేర్లు కూడా వస్తాయి. కంపెనీ మార్కెట్ విలువలు పెరిగితే వీటివిలువ లక్షకోట్ల డాలర్లు అవు తుంది. అన్నింటి కంటే ముందు టెస్లా అధినేత 2022లో ప్రోటోటైప్ ఆప్టిమస్ అనే స్వయం చాలిత హ్యుమనాయిడ్ రోబోను రూపొందించారు. టెస్లాకార్లకు అమర్చిన కృత్రిమ మేధవ్యవస్థలే ఇందులోను ఉపయోగించారు. భవిష్యత్తులో ఆప్టిమస్ రోబోలే కీలకం అవుతాయని కూడా ఎలాన్‌మస్క్ ప్రకటించారు. అదే విధంగా స్వయంచాలిత డ్రైవింగ్ వ్యవస్థతో కూడిన టెస్లా కార్లను కూడా అమలులోకి తెచ్చే యోచన ఉంది. సెల్ఫ్‌డ్రైవింగ్ వ్యవస్థ డ్రైవర్లు ఫోన్‌లో సందేశాలు పంపినా ప్రమాదం లేని స్థాయికి చేరుకుందని ఆయనే ధీమాగా ఉన్నారు. నిజానికి ఇటీవలికాలంలో మస్క్ వ్యాపార విలువలు మార్కెట్లలో దెబ్బతిన్న సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌తో ఆయనకు విభేదాలు పొడసూపడం బహిరంగంగానే ఆయన్ను విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలతో టెస్లా షేర్లు దెబ్బతిన్నాయి. అమెరికా ప్రభుత్వం నుంచి ఆయనకు వచ్చే సబ్సి డీలను వాయిదా వేస్తూ రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయినా మస్క్ తట్టుకోగలిగారు. నిజానికి ట్రంప్‌నకు వెన్నుదన్నుగా నిలిచి 250 మిలియన్ డాలర్ల వరకూ ట్రంప్ విజయం కోసం ప్రచారంలో వ్యయంచేసారు. అలాగే ట్రంప్ పర్యటించిన ప్రతిచోటా కూడా ఆయన్ను వెన్నంటి నడిచి వెళ్లారు. అనూహ్య మెజార్టీతో ట్రంప్ గెలిచిన తర్వాత ఆయన చేపట్టిన గ్రేట్ అమెరికా మేక్ అగైన్ బిల్లుపై మస్క్ అభ్యంతరాలు తెలపడంతో ఇద్దరి మధ్య ఉన్న భేదాలు తారస్థాయికి చేరాయి. అక్కడితే ఆగలేదు ట్రంప్‌తో కటీఫ్ చెప్పేంతవరకూ వెళ్లాయి. అక్కడి నుంచే టెస్లా షేర్ల విలువలు మాత్రం క్షీణిస్తూ వచ్చాయి. ఇకమస్క్ చెపుతున్నట్లుగా హ్యుమనాయిడ్ రోబోలకు భారీ డిమాండ్ ఉంటుందన్న అంశంపై స్పష్టతరాలేదు. ఆటోమొబైల్ రంగంలో ఇతర పెద్ద కంపెనీల నుంచి రోబో ట్యాక్సీ పరిశ్రమలో టెస్లాకు గట్టి పోటీ కూడా ఎదురవుతుందనడంలో ఎలాంటి సందేహంలేదు. ఇక మస్క్‌కు సొంతంగా 13 శాతం టెస్లాషేర్లు ఉన్నాయి. ఇదికాకుండా మార్కెట్ విలువలు పదిరెట్లు పెరిగితే ప్యాకేజి మళ్లీ అందుకునే అవకాశం ఉంది. గతంలో కూడా రెండుస్లారు వాటాదారుల ఆమోదంతో మస్క్ లక్షల కోట్ల ప్యాకేజిని అందుకున్నారు. అయితే న్యాయపరమైన చిక్కులతో డెలావేర్ న్యాయమూర్తి ఈ వేతన ప్యాకేజి ఒప్పందం తిరస్కరించారు. ప్రస్తుతం ఈ ఒప్పందం సుప్రీం పరిశీలనలో ఉంది. మస్క్ ప్యాకేజిని వ్యతిరేకిస్తున్న వారిలో నేషనల్ వెల్త్‌ఫండ్స్‌లో ఒకటైన నార్వే సావరిన్ వెల్త్‌ఫండ్, కాలిఫోర్నియా పబ్లిక్ ఎంప్లాయీస్ రిటైర్‌మెంట్ సిస్టమ్ వంటిసంస్థలు టెస్లాలో వాటాలు కలిగి ఉండటంతో ఈకొత్త ప్యాకేజి వ్యతిరేకిస్తున్నాయి. దీనితో ఇప్పుడు రిటైల్ ఇన్వెస్టర్లవైపు ఫోకస్ పెంచి ఆమోదం పొందగలిగారు. మస్క్ కొత్తప్యాకేజికోసం టెస్లా బోర్డు డైరెక్టర్లు ఒక మార్కెటింగ్ సంస్థతో లాబీయింగ్ చేరారన్న సమాచారంతో కార్పొరేట్ గవర్నెన్స్ నిపుణులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్యాకేజికి విముఖత వ్యక్తంచేసారు. అయితే వోట్‌టెస్లా డాట్‌కామ్‌లో పోస్టుచేసిన ఒక విడియోలో బోర్డు ఛైర్మన్ డెన్‌హోమ్, డైరెక్టర్ కథ్లీన్ విల్సన్ థాంప్సన్‌లు మస్క్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ కొత్త పేప్యాకేజితో టెస్లాకు కంపెనీలో ఓటింగ్ పవర్‌ను పెంచుతుందని కూడా నిపుణులు చెపుతున్నారు. యూరోప్ ఇతర ఆసియా దేశాల్లో కూడా తనమార్కు బిజినెస్‌వ్యూహాలుఅమలుచేస్తున్న ట్రంప్ ఇప్పుడు ఈ భారీవేతన ప్యాకేజితో కంపెనీ బోర్డు తనముందుంచిన సవాళ్లను అధిగమించే వ్యూహాలు విధిగా సిద్ధంచేసుకోవాల్సిందే. మొత్తంగా చూస్తే ప్రపంచంలోనే ఎవ్వరూ అందుకోని విధంగా మస్క్ అన్నిచోట్లా రికార్డులు నెలకొల్పిన విధంగానే ఇప్పుడు తన వేతన ప్యాకేజిని నిర్ధారించుకోవడంలో కూడా తన రికార్డు సాధించారు. అయితే తనముందు న్న వాణిజ్య సవాళ్లను ఎలా అధిగమిస్తారన్నది మాత్రం కాలమేచెప్పాలి. కేవలం టెస్లా మాత్రమే కాకుండా స్టార్‌లింక్ శాటిలైట్ సర్వీసులు కూడా ఆయనకు ఉన్నాయి. విభిన్న రంగాల్లోకి విస్తరించిన మస్క్‌కు ఈ వేతన ప్యాకేజి ఒక పెద్ద అంశంగానే భావించడంలేదు. అయితే టెస్లాను వరల్డ్ నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర ఎలా ఉంటుందన్నది మాత్రం మిలియన్ డాలర్ల ప్రశ్న అనే చెప్పాలి. ●



ఎలాన్ మస్క్

# చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహకాలేవి?

**డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు**

దేశం అభివృద్ధి చెందాలంటే పెద్ద ప్రాజెక్టు మాత్రమే కాదు చిన్నపరిశ్రమలు కూడా బలపడాలి కానీ ప్రభుత్వ దృష్టి అంతా లార్జ్ మెగా ఇండస్ట్రీస్ వైపుకే పోతోంది. పెద్ద పరిశ్రమలకు అంతర్జాతీయ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకటి ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, భూములు, టారిఫ్ రాయితీలు లభిస్తున్నాయి. అదే సమయంలో కోట్లాది ఉద్యోగాలు కల్పించే ఎంఎస్‌ఎంఈలు నిశ్శబ్దంగా మూత పడుతున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉద్యోగ కల్పనలో ఎంత నిబద్ధత కలిగి ఉన్నదో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐనీ ప్రవేశపెట్టడమే తెలియ జేస్తోంది. టెక్నాలజీ అనేది మనిషి శ్రమను తగ్గించడానికి దోహదం చేయాలి కానీ మనిషికి జీవనాధార అవకాశాలను దూరం చేయడానికి దారి తీయకూడదు. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో అదే జరుగుతోంది. ఇదే సోషలిజంలోనైతే ఇటువంటి కొత్త టెక్నాలజీ ప్రవేశం వలన కార్మికులు ఉపాధి కోల్పోరు. అదే కొత్త టెక్నాలజీని పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రవేశపెట్టినప్పుడు కార్మికులు ఉపాధి అవకాశాలు తగ్గి నిరుద్యోగానికి దారితీస్తుంది. దీనివలన ఆర్థిక వ్యవస్థలో ఆదాయ అసమానతలు పెరగడం, ఇది కొంతమంది పెట్టుబడిదారుల చేతుల్లోకి పోవడం అశేష ప్రజానీకం వినియోగస్థాయి పడిపోవడం, డిమాండ్ తగ్గిపోవడం ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి దిగజారిపోతుంది. ఇటీవలనే అమెజాన్ కంపెనీలో ఆర్టిఫిషియల్ఇంటలిజెన్స్ ఏఐ వినియోగం వలన 14 వేల ఉద్యోగాలు పోతున్నాయని తెలియజేసింది. ఇలా ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులు ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టకుండా ఆదాయాలను పెంపొందించుకునే దిశగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. ఇప్పటికే అమెజాన్ నుంచి మైక్రోసాఫ్ట్ కంపెనీ వరకు ఉద్యోగం కోల్పోయే వారి సంఖ్య 80000 వరకు ఉంటుందని ఒక అంచనా. ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ప్రభావం వలన మొత్తం మీద 81 వేల 416ఉద్యోగాలు పోతున్నాయని ఒకఅంచనా. రాబోయే ఐదేళ్లలో 2026-2030 సుమారు లక్ష 30 వేల కోట్లతో దేశంలో మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్బును విశాఖపట్నంలో గూగుల్ ఏర్పాటు చేస్తోంది. ఏఐ అభివృద్ధికి కేంద్రంగా పనిచేయడంతో పాటు విశాఖపట్నం ఒక ప్రధాన కనెక్టివిటీ హబ్‌గా మారబోతోంది అని మన పాలకులు అంటున్నారు. ఎందుకంటే గూగుల్ దాని సముద్రం అడుగున కేబుల్ మౌలిక సదుపాయాలను అక్కడకు తీసుకువచ్చి వాటిని ప్రపంచవ్యాప్త నెట్వర్క్‌తో అనుసంధానం చేయబోతోంది అంటే గూగుల్ ఏఐ టెక్నాలజీని తీసుకురావడమే కాకుండా దాని సబ్సి కేబుల్ నెట్వర్క్ కనెక్టివిటీ హబ్ తద్వారా డిజిటల్ మౌలిక సదుపాయాలను కూడా నిర్మిస్తుంది. దీనితో ఆసియా పసిఫిక్ ప్రాంతాలకు ప్రత్యక్ష సంబంధం ఏర్పడడమే కాకుండా దానితో వచ్చే హై స్పీడ్ ఇంటర్నెట్ ఇతర కంపెనీల డేటా సెంటర్లో విశాఖపట్నం రావడానికి అవకాశం ఏర్పడుతుంది. దీని ద్వారా రెండు లక్షల ఉద్యోగాలు వస్తాయని పాలకులు చెబుతున్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా ఉన్న గూగుల్ కంపెనీలో ఉద్యోగాల సంఖ్య 1,82,000 మాత్రమే. రాబోయే రోజుల్లో ఏఐ కారణంగా మనదేశంలో 20 లక్షల సంప్రదాయ ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని కానీ సరైన అనుకూల వాతావరణాన్ని ముందు నుంచే ఏర్పాటు చేయగలిగితే కొత్తగా 80 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించవచ్చని కేంద్రం భావిస్తోంది అందుకోసమే మూడో తరగతి నుంచి విద్యను అనుసంధానం చేసే పనిలో దిగింది. ఏఐ సాంకేతిక పరిజ్ఞానంలో మన దేశం 25 దేశాల కన్నా తక్కువ స్థాయిలో ఉన్నదని సర్వే తెలియజేసింది. 14 శాతం భారతీయులకు మాత్రమే ఈ పరిజ్ఞానం గురించి ఇంతో అంతో తెలుసు. ముఖ్యంగా 18-34 వయసు మధ్య ఉన్న వారిలో 19 శాతం మందికి మాత్రమే మన దేశంలో ఏఐ గురించి తెలుసు. ఏఐ పరిజ్ఞానం లేని మనదేశంలో ప్రస్తుతం ఏఐ ప్రవేశపెట్టడం ద్వారా నిరుద్యోగం ఏర్పడే ప్రమా



దం ఎక్కువగా ఉంటుంది మన పాలకులు ఏమో ఏఐ క్వాంటం కంప్యూటింగ్ యుగం కోసం పరుగులు తీయాలని తాపత్రయపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ప్రైజెస్లో ఆర్థిక అభివృద్ధి పరంగా మొత్తం పారిశ్రామిక రంగాన్ని ఇంజన్ లాగా పనిచేస్తున్నాయని ఆర్థికవేత్తలు గుర్తించారు. 145 కోట్ల మంది జనాభా గల మన దేశంలో పేదరికం పోవాలన్న ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదాయ అసమానతలు తగ్గాలన్న సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఎంఎస్ఎంఏ అభివృద్ధితోనే సాధ్యం. చైనాలో ఇంటింటికి ఒక కుటీర పరిశ్రమ ఉంటూ చైనా ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా చలామణి అవుతున్నాయి అంటే అక్కడి ప్రభుత్వ పెద్దల నిబద్ధత ఉంది. అందుకే చైనా నేడు ప్రపంచ కర్మాగారంగా ఉంది. మన దేశంలో పాలకులు లాగా ప్రభుత్వం వ్యాపార సంస్థ కాదని చైనా పాలకులు అనుకోవడం లేదు. చైనాలో స్థానికంగా పరిశ్రమలు స్థాపించి అభివృద్ధి పరిచింది. అందువలన అక్కడి పేదరికం పోయింది. దీనికిగానో ప్రజలకు రుణాల రూపంలో పెట్టుబడులు సమకూర్చడం వారికి తగిన శిక్షణ ఇవ్వడం, పరిశ్రమలకు కావలసిన సాంకేతిక సామాగ్రిని అందించడం, మార్కెట్లను చూపించడం, ఇలాంటి పనుల్లో ప్రభుత్వం ఒక వైపు ప్రైవేట్ పారిశ్రామిక రంగం మరొక వైపు భాగస్వాములు అవుతున్నాయి. ప్రజల ఆదాయాలు పెరుగుతున్నాయి. అనేక పారిశ్రామిక యూనిట్లను ఎక్కడికక్కడ నెలకొల్పుతున్నారు. వీటి ఆధారంగా చైనాలో 1.3 కోట్ల మందికి గ్రామీణ ఉపాధి లభించింది. ఇళ్లలోనే పెట్టే చిన్న చిన్న ఉత్పత్తి యూనిట్లద్వారా ప్రజల ఆదాయాలు గణనీయంగా పెరిగాయి దీనికి టూరిజం పర్యావరణ ఆర్థిక కార్యకలాపాలు తోడు చేయడం వలన ఈ చిన్న తరహా పరిశ్రమలో మరింతగా పేదరిక నిర్మూలనకు ఉద్యోగ కల్పనకు తోడ్పడ్డాయి. మన దేశంలో ఎప్పటి నుంచో 1905 స్వదేశీ ఉద్యమం ద్వారా చేపట్టిన కుటీర పరిశ్రమల స్వదేశీ ఉత్పత్తులను అభివృద్ధి పరచుకునేందుకు ఆనాడు స్వాతంత్ర సంగ్రామాన్నే నడిపించడం జరిగింది. ఈ ఎమ్ఎస్ఎమ్ఈల ద్వారా నేడు మనదేశంలో 97శాతం ఉద్యోగ కల్పన జరుగుతున్నది. భారీ పరిశ్రమల ద్వారా కేవలం 3 శాతం మాత్రమే ఉద్యోగిత ప్రజలకు లభిస్తున్నది. ఇవి ప్రస్తుతం దేశంలో 6.3కోట్ల సంస్థలు ఎనిమిది వేల రకాల ఉత్పత్తులను చేస్తూ మన స్థూల జాతీయఉత్పత్తికి 30 శాతం కల్పించుచున్నది. దేశ పారిశ్రామిక ఉత్పత్తిలో 33శాతంగా ఉంది. ఈ పరిశ్రమలన్నీ అసంఘటిత రంగంలో ఉన్నాయి. వీటిని సంఘటితపరచి ఆర్థికపరమైన సాంకేతికపరమైన తదితర సబ్సిడీలు కల్పిస్తే చిన్నతరహా పరిశ్రమలు ఉపాధి కల్పనలో ఆదాయాలు పెంపొందించడంలో దేశంలో ప్రధానమైన పాత్ర పోషిస్తాయి. నేటి ఆర్థిక విధానాలన్నీ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో జరిగి ఉత్పత్తులు గణనీయంగా పెరిగినప్పటికీమానవ శ్రేయస్సు పెంపొందించలేకపోవడం శోచనీయం. అందుకే ఆనాడు గాంధీజీ అన్నారు భారీ ఉత్పత్తులు కాదు ముఖ్యం భారీ సంఖ్యలో ప్రజలు ఉత్పత్తిలో పాల్గొనాలి. తద్వారా ఉపాధి ఆదాయం ఉండి ప్రజలు సౌభాగ్యంతో ఉంటారు. ధానాలకు ఎంత దూరం అవుతున్నారో గమనించాలి. సత్య నాదేల్లా వేతనం సంవత్సరానికి 850 కోట్ల రూపాయలు. అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈఓ గా ఉన్నారు. ఆ కంపెనీలో పనిచేసే ఉద్యోగస్తులు ప్రపంచవ్యాప్తంగా రెండు లక్షల ఇరవై ఎనిమిది వేలు మాత్రమే. అదే తరహా పెద్ద కంపెనీఅయిన గూగుల్‌లో పనిచేసే వారిసంఖ్య1,82,000 మాత్రమే. పెద్ద పరిశ్రమలలో కోటి రూపాయలు పెట్టుబడికి ఒకరికి ఉద్యోగం వచ్చేదే కష్టం అదే కోటి రూపాయలను చిన్న తరహా కుటీర పరిశ్రమంలో పెడితే పదిమందికిపైగానే ఉద్యోగాలు కల్పించవచ్చు. దేశం అభివృద్ధి చెందాలంటేపెద్ద ప్రాజెక్టులు మాత్రమే కాదు చిన్న పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందాలి. కానీ ప్రభుత్వాలు దృష్టిఅంతా మెగా ఇండస్ట్రీస్ వైపునే పోతుంది. పెద్ద పరిశ్రమలకు అంతర్జాతీయ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకదానికి ప్రోత్సాహకాలుసబ్సిడీలు భూములు టారిఫ్ల రాయితీలు లభిస్తున్నాయి. అదే సమయంలో కోట్లాది ఉద్యోగాలు కల్పించే ఎంఎస్ఎంఈలు చిన్న మధ్య తరహా కుటీర పరిశ్రమలు ప్రోత్సాహాలు లేక మూతపడుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద ప్రాజెక్టులకు ప్రభుత్వం అందిస్తున్న అనేకప్రోత్సాహకాలు ఈ చిన్న పరిశ్రమలకు కూడా ఇవ్వవలసి అవసరం ఉంది. ●

# మునిగేందుకు అది ప్రాక్టీస్..

## రాహుల్ గాంధీపై ప్రధాని మోడీ సెటైర్లు!




**పాట్నా, నవంబరు 8:** బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార, విపక్ష పార్టీలు పదునైన వ్యాఖ్యలతో విమర్శలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఇటీవల చేపల వేట కోసం మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగారు. దానిని ఉద్దేశించి ప్రధాని మోడీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. బీహార్ చేపలను చూడటానికి పెద్దపెద్దవాళ్లు వస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో మునిగిపోయేందుకు ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. కొన్నిరోజుల క్రితం బెగుసరాయ్ జిల్లాలో మత్స్యకారులతో కలిసి రాహుల్ చేపలు పట్టేందుకు వెళ్లారు. అప్పుడు ఆయన వెంట మాజీ మంత్రి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వ్యవస్థాపకుడు, విపక్ష కూటమి డిప్యూటీ సిఎం అభ్యర్థి ముకేశ్ సాహ్నీ కూడా ఉన్నారు. చేపలు పట్టేందుకు గాను సాహ్నీ నీళ్లలోకి దిగి వలవేశారు. కాసేపటికి రాహుల్‌గాంధీ సైతం నీళ్లలోకి దూకారు. మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. ఈత కొట్టారు. ఆ సందర్భంగా జాలర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వేట నిషేధిత కాలంలో మత్స్యకారుల కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం, బీమా సదుపాయం, చేపట మార్కెట్‌ల ఏర్పాటు, మత్స్యసంపద కోసం జలవనరుల పునరుద్ధరణ వంటి హామీలు ఇచ్చారని కాంగ్రెస్ వెల్లడించింది. రూ.10వేలు ఇచ్చి, ఓట్లు కొల్లగొట్టవచ్చని బిజెపి భావిస్తోందని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు మహాత్మాగాంధీ చేసిన పోరాటమే కాంగ్రెస్ చేస్తోంది. ప్రధాని మోడీ ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ స్నేహితులకు అప్పగిస్తున్నారు. ఆయన కట్టా వంటి పదాలను ఉపయోగించి ప్రజలను రెచ్చిగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

## రూ.200 కోట్ల భూమి మూడు కోట్లకే కొనుగోలు!

### మహారాష్ట్రలో మరో మంత్రి నిర్వాకం



**ముంబయి, నవంబరు 8:** మహారాష్ట్రలో రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ రూ. 200 కోట్ల విలువైన భూమిని రూ.3కోట్లకే దక్కించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ భూకుంభకోణం కేసు ఇప్పటికే రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతుండగా, తాజాగా రాష్ట్ర మంత్రిపై వచ్చిన ఆరోపణలు సంచలనంగా మారాయి. కాంగ్రెస్ పార్టీ నాయకుడు విజయ్ వడెట్టివార్ విలేకరులతో మాట్లాడుతూ, ప్రతాప్ సర్‌నాయక్ మీరా భయాందర్‌లో దాదాపు రూ. 200 కోట్ల విలువైన నాలుగు ఎకరాల భూమిని రూ. 3 కోట్లకే కొనుగోలు చేశారని ఆరోపించారు. ఆ స్థలలోనే ఆయన ఓ విద్యా సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆరోపణలపై మహారాష్ట్ర రెవెన్యూమంత్రి చంద్రశేఖర్ బవాంకులే స్పందించారు. ఈ విషయం గురించి తాను కూడా విన్నానని, కానీ దీనిపై ఎవరి దగ్గరి నుంచి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ప్రతిపక్షాలు తమకు ఫిర్యాదు చేయడం మానేసి, మీడియా ముందుకు వచ్చిఆరోపణలు చేసేందుకే సమయం కేటాయిస్తున్నాయని విమర్శించారు. ఈ భూమికి సంబంధించి ఏదైనా ఫిర్యాదు అందితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, రూ. 18వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌కు చెందిన సంస్థకు రూ. 300 కోట్లకే విక్రయించినట్లు కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై దర్యాప్తునకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసింది. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మంత్రిపై కూడా ఆరోపణలు రావడం గమనార్హం.



## భారత్‌పై మరోసారి అగ్గిరాజేసిన యూనస్ సర్కార్


### భారత్ ఈశాన్యప్రాంత మ్యాప్ ఉన్న బుక్ విదేశీ ప్రతినిధులకు అందచేత

**ఢాకా, నవంబరు 8:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాని ముహమ్మద్ యూనస్ మరోసారి మ్యాప్ వివాదాన్ని రాజేశారు. గత నెలలో పాకిస్తాన్ జనరల్‌కు బహుమతిగా ఇచ్చి ఆర్ట్ ఆఫ్ ట్రయాంప్ అనే పుసక్తాన్ని ఈసారి తుర్కియే పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి బహుకరించి మరోసారి వివాదాన్ని రాజేశారు. ఇంతకు ఆ పుసక్తంలో ఏం ఉంది అంటే ఇది ప్రధానంగా గ్రేటర్ బంగ్లాదేశ్ ఉద్దేశాన్ని తెలుపుతుంది. అంటే బంగ్లాదేశ్‌లో భారతదేశం ఈశాన్య ప్రాంతాలు మరీ ముఖ్యంగా అస్సాంను కలుపుకుని గ్రేటర్ బంగ్లాదేశ్‌గా అవతరించబోతున్నామనే సంకేతాలను ఇస్తోంది. ఇది యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఉద్దేశ్యాలపై కొత్త ఆందోళనలను రేకెత్తిస్తోంది. బంగ్లాదేశ్ మీడియా ప్రకారం, నవంబర్ 3న ఢాకాను సందర్శించిన మెహ్మెట్ అకిఫ్ యిల్మాజ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల తుర్కియే పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి యూనస్ ఆర్ట్ ఆఫ్ ట్రయంఫ్ అనే పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు. ఈ పుస్తకంలో గత ఆగస్టులో షేక్ హాసీనా ప్రభుత్వాన్ని కూలదోసిన నిరసనల సమయంలో చోటు చేసుకున్న ఘటనలు, ఆ తర్వాత విద్యార్థులు, యువత గీసిన గ్రాఫిటీ గురించి రచించినట్లు సమాచారం. ఈ పుస్తకంలోని మ్యాప్ భారతదేశ ఈశాన్య రాష్ట్రాలను, ముఖ్యంగా అస్సాంను బంగ్లాదేశ్ ఊహాజనిత భవిష్యత్తులో కలుపుకునే గ్రేటర్ బంగ్లాదేశ్ ప్రణాళికను వివరిస్తుంది అని సమాచారం. ఇంటిలిజెన్స్ విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఆ పుస్తకంలో యుద్ధ ప్రణాళికలు, విజయానంతర నిర్వహణ ఫ్రేమ్ వర్క్‌లు ఉన్నాయని తెలుస్తోంది. అలానే అస్సాంను ఢాకా నియంత్రణలో ఉత్పాదక , లాభదాయక ప్రాంతంగా మార్చే ప్రస్తావనలు కూడా ఉన్నాయని సమాచారం. యూనస్ తాత్కాలిక ప్రభుత్వ ఈ చర్యలు యాదృచ్ఛికంగా రెచ్చగొట్టడం కన్నా ఉద్దేశపూర్వక సైద్ధాంతిక సంకేతంగా కనిపించిందని ఇంటిలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. పైగా ఇది కళా ప్రదర్శన ఎంత మాత్రం కాదని ఇది బంగ్లాదేశ్ భారతదేశానికి ఇస్తోన్న సందేశం అని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో కొలువుదీరిన తాత్కాలిక ప్రభుత్వం విస్తృత వ్యూహాత్మక ధోరణులను ఇది స్పష్టం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ మ్యాప్ బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం ప్రాదేశిక ఆశయాలకు మొదటి స్పష్టమైన సంకేతం అంటున్నారు.


## పాక్ అణ్వాయుధ కార్యాచరణ ధ్వంసానికి ఇందిరాగాంధీయే తిరస్కరించారు

**అమెరికా సిఐఎ మాజీ డైరెక్టర్ రిచర్డ్ బార్లో**

**వాషింగ్టన్, నవంబరు 8:** పాకిస్థాన్ అణ్వాయుధ కార్యాచరణను అడ్డుకునేందుకు భారత్- ఇజ్రాయెల్ కలిసి చేసిన రహస్య ప్రణాళికను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తిరస్కరించారని అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి రిచర్డ్ బార్లో వెల్లడించారు. అప్పటి ప్రభుత్వం ఈ ఆపరేషన్‌ను తిరస్కరించడాన్ని ఆయన సిగ్గుచేటుగా అభివర్ణించారు. పాక్‌లోని కహూతా అణుకేంద్రాన్ని బాంబులతో ధ్వంసం చేసేందుకు రూపొందించిన ఈ ఆపరేషన్‌కు ఇందిర ఆమోదం తెలిపి ఉంటే ప్రపంచానికి ఎన్నో సమస్యలు తప్పి ఉండేవని ఆయన అభిప్రాయపడ్డారు. 1980లో పాక్ రహస్య అణు కార్యకలాపాలను అభివృద్ధి చేస్తున్న సమయంలో అమెరికన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలో బార్లో పని చేశారు. ఆసమయంలో ఈ ప్రణాళిక గురించి తాను విన్నట్లు ఓ ఇంటర్వ్యూలో బార్లో తెలిపారు. 'ఆసమయంలో నేను ప్రభుత్వ సర్వీసులో లేను. కానీ ఇంటెలిజెన్స్ వర్గాల్లో ఈ ఆపరేషన్ గురించి విన్నాను. అది కార్యరూపం దాల్చలేదు. ఇందిరా గాంధీ ఈ ప్రణాళికను అడ్డుకున్నారు. అలా చేయడం సిగ్గుచేటు. ఆ ఆపరేషన్‌ను ఆమోదించి ఉంటే చాలా సమస్యలు పరిష్కారమయ్యేవి' అని ఆయన వివరించారు. నివేదికల ప్రకారం పాక్‌లోని కహూతా అణుకేంద్రాన్ని బాంబులతో ధ్వంసం చేసేందుకు ఇజ్రాయెల్, భారత్ ప్లాన్ చేశాయి. అణ్వాయుధాలను పాక్ అభివృద్ధి చేయకుండా, వాటిని ఇతర దేశాలకు అందించకుండా నిరోధించేందుకు దాడి చేయాలని ప్రణాళిక రచించాయి.



## నెతన్యాహు, మంత్రులకు తుర్కియే అరెస్టు వారంట్లు



**ఇస్తాంబుల్, నవంబరు 8:** ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు సహా ఆయన ప్రభుత్వంలోని సీనియర్ అధికారులపై.. మారణహోమం సృష్టించారనే ఆరోపణలతో తుర్కియే అరెస్ట్ వారెంట్లను జారీ చేసింది. గాజాలో ఇజ్రాయెల్ పద్ధతి ప్రకారం పాల్పడిన మారణహోమం, మానవత్వానికి వ్యతిరేకమైన నేరాలపై తుర్కియే చట్టపరమైన చర్యకు పూనుకుంది. ఇస్తాంబుల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఈ కేసులో మొత్తం 37 మంది అనుమానితుల జాబితాను రూపొందించింది. ఈ జాబితాలో నెతన్యాహుతో పాటు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్, జాతీయ భద్రతా మంత్రి ఇతమార్ బెన్ గ్విర్, ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఎయాల్ జమీర్ వంటి కీలక అధికారులు ఉన్నారు. అయితే పూర్తి జాబితాను మాత్రం ప్రాసిక్యూటర్ కార్యాలయం వెల్లడించలేదు. టర్కీ ఆసుపత్రిని లక్ష్యంగా చేసుకోవడంపై ఫిర్యాదు వచ్చింది. ఈ అరెస్ట్ వారెంట్ల జారీకి సంబంధించిన ఫిర్యాదులో గాజా స్ట్రిప్‌లో టర్కీ సర్కారు నిర్మించిన టర్కిష్‌పాలస్తీనియన్ ఫ్రెండ్‌షిప్ హాస్పిటల్ అంశాన్ని కూడా ప్రస్తావించింది. మానవతా సేవలకు అంకితమైన ఈ ఆసుపత్రిని ఇజ్రాయెల్ సైన్యం మార్చి నెలలో బాంబు దాడి చేసి ధ్వంసం చేసిందని ఫిర్యాదులో తెలిపింది. ఇలాంటి చర్యలు అంతర్జాతీయ మానవతా చట్టాల ఉల్లంఘన కిందకు వస్తాయని టర్కీ బలంగా వాదిస్తోంది.

## లాలూ కుటుంబంపై ప్రజలను రెచ్చగొడుతున్న మోడీ

### జన్‌సురాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్‌కిశోర్ ధ్వజం



**పాట్నా, నవంబరు 8:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బీహార్ ఎన్నికల్లో ఓట్లు దక్కించుకోవడం కోసం, లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) పాలన గురించి ప్రజల్లో భయాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈసారి బీహార్ ప్రజలు ఓటు వేయడానికి జన్ సురాజ్ రూపంలో ఒక కొత్త ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని ఆయన అన్నారు. ఆర్జేడీ భయాన్ని చూపించి ఓట్లు రాబట్టాలని మోదీ ప్రయత్నిస్తున్నారు, ఎందుకంటే ఆయన చెప్పడానికి మరేమీ లేదు. దశాబ్దాలుగా ఎన్డీయే, బీజేపీ, నితీశ్ కుమార్ ఓట్లు పొందడానికి లాలూ భయాన్ని చూపడమే ఉత్తమ మార్గంగా ఎంచుకున్నారు. పనులు జరిగాయా? లేదా? అన్నది పక్కనపెడితే, కనీసం జంగిల్ రాజ్ తిరిగి రాలేదు కదా అని ప్రజలు అనుకునేలా చేశారు. కానీ ఈసారి పరిస్థితి మారింది. జంగిల్ రాజ్ తిరిగి రాకూడదంటే, మరి మీకెందుకు ఓటేయాలి? జన్‌సురాజ్ ఒక కొత్త ప్రత్యామ్నాయంగా ఉందని కిశోర్ వివరించారు. ఆర్జేడీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ పాలన కాలాన్ని జంగిల్ రాజ్‌గా బీజేపీ అభివర్ణిస్తుంటుంది. లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉన్న నేపథ్యంలో బీజేపీ ఈ పదాన్ని విపక్షాలపై విమర్శలకు అస్త్రంగా వాడుతోంది. గత వారం ప్రధాని మోదీ మాట్లాడుతూ బీహార్‌లోని జంగిల్‌రాజ్‌ను మరో 100 ఏళ్లయినా మర్చిపోలేరని అన్నారు. ఆనాటి పరిస్థితులను యువతరానికి వివరించాలని రాష్ట్రంలోని బీజేపీ కార్యకర్తలకు, వృద్ధులకు ఆయన పిలుపునిచ్చారు. విపక్ష కూటమిని ఘట్‌బంధన్ (కూటమి) కాదని, లఠ్‌బంధన్ (నేరగాళ్ల గుంపు) అని అభివర్ణించారు. ఢిల్లీ నుంచి బీహార్ వరకు ఉన్న విపక్ష నేతలంతా బెయిల్‌పై బయట ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశలో రికార్డుస్థాయిలో 64.66శాతం ఓటింగ్ నమోదైంది. రాష్ట్ర చరిత్రలోనే ఇది అత్యధికం. రెండో దశ పోలింగ్ నవంబర్ 11న జరగనుండగా, ఓట్ల లెక్కింపు నవంబర్ 14న చేపడతారు.

## తీవ్రస్థాయికి చేరిన ఢిల్లీ వాయుకాలుష్యం

**న్యూఢిల్లీ, నవంబరు 8:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయిలో ఉంది. తాజాగా శనివారం ఉదయం కూడా ఢిల్లీలో కాలుష్యం వెరీపూర్ కేటరిగీలో నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం శనివారం ఉదయంఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 355 గా నమోదైంది. ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 332గా, అలీపూర్ వద్ద 316, అశోక్ విహార్‌లో 332,ఇండిగా గేట్ వద్ద ఏక్యూ 322గా, పాలెం ప్రాంతంలో 320, ధౌలా కువాన్‌లో 269, అశోక్ విహార్ ప్రాంతంలో 332, బవానాలో 366, బురారి క్రాసింగ్ వద్ద 345, ఛాందిని చౌక్ ప్రాంతంలో 354, ద్వారకా సెక్టార్8లో 310,ఐటీఓ ప్రాంతంలో 337, జహంగీర్‌పురిలో 342, ముండ్కా ప్రాంతంలో 335, నరేలా వద్ద 335, ఓఖ్లా ఫేజ్2లో 307, పట్పర్‌గంజ్ వద్ద 314,పంజాబీ బాగ్ 343, ఆర్‌కే పురంలో 321, రోహిణి ప్రాంతంలో 336, సోనియా విహార్ వద్ద 326గా ఏక్యూఐ వెరీ పూర్ కేటగిరీలో నమోదైంది.

## పోలీసు విభాగంలో 'గీతా'పఠనం

### మధ్యప్రదేశ్‌లో 4వేల మంది సిబ్బందికి ఆదేశాలు




**భోపాల్, నవంబరు 8:** మధ్యప్రదేశ్ పోలీస్ ట్రెనింగ్ విభాగం ఇటీవల తీసుకున్న నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. భగవద్గీత పఠనాన్ని తప్పనిసరి చేయాలంటూ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీపీ) ట్రెనింగ్ రాజా బాబు సింగ్ జారీ చేసిన ఆదేశాలు వివాదానికి తెర తీశాయి. దాదాపు 4 వేల మంది కానిస్టేబుల్ అభ్యర్థులు ఈ ఆదేశాల పరిధిలోకి వస్తారు. ఈ నిర్ణయాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ విరుద్ధమంటూ తీవ్రంగా విమర్శించింది. ప్రతి ఒక్కరూ తమ మతాన్ని అనుసరించే స్వేచ్ఛ ఉండాలని.. పోలీసు బలగాలను కాషాయీకరణ చేసి రాడికలైజ్ చేసే ప్రయత్నం మధ్యప్రదేశ్‌లో మొదలైందని ఇది రాజ్యాంగ వ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న చర్య అని హస్తం పార్టీ ఆరోపించింది. ఇలాంటి ఆదేశాలు జారీ చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై అధికార బీజేపీ ఘాటుగా స్పందించింది. భారత్ వంటి దేశంలో భగవద్గీతను మతపరమైనదిగా ఎవరైనా భావిస్తే వారి భారతీయతపై అనుమానం ఉందని ఇది తన స్పష్టమైన ఆరోపణ అని బీజేపీ అధికార ప్రతినిధి పంకజ్ చతుర్వేది పేర్కొన్నారు. భగవద్గీత కేవలం మతం గురించి కాదని తత్వశాస్త్రం గురించి చెబుతుందని దాని సారాంశాన్ని అర్థం చేసుకుంటే పోలీసుల పనితీరు మెరుగుపడుతుందని వెల్లడించారు. దాని వల్ల సమాజం మెరుగుపడుతుందని పంకజ్ చతుర్వేది సమర్థించారు. అప్పుడే భారత్ విశ్వగురువుగా ఎదుగుతుందని.. దీన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని వ్యాఖ్యానించారు. ఇక ఈ భగవద్గీత పఠనం నిర్ణయాన్ని సమర్థించుకున్న ఏడీజీపీ రాజా బాబు సింగ్ మార్గశిర మాసం ప్రారంభమైందని.. ఇది శ్రీకృష్ణుడి మాసమని పేర్కొన్నారు. ఈ పవిత్ర మాసంలో ధ్యానానికి ముందు భగవద్గీతలోని ఒక అధ్యాయాన్ని ట్రైనీ కానిస్టేబుల్‌లు చదివితే వారికి ధర్మబద్ధమైన జీవితానికి మార్గనిర్దేశం లభిస్తుందని వివరించారు. భగవద్గీత పఠనంతో పాటు.. గతంలో కూడా ఈ పోలీస్ ట్రెనింగ్ సంస్థల్లో తులసీదాస్ రచించిన రామచరితమానస్ పద్యాలను పఠించేలా రాజా బాబు సింగ్ ప్రోత్సహించారు. ప్రస్తుతం శిక్షణార్థులు భగవద్గీత, రామచరితమానస్ పఠనం, అరగంట ధ్యానంతో కూడిన దినచర్యను అనుసరిస్తున్నారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. డిసెంబర్ 21వ తేదీన ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సెషన్‌లను నిర్వహించాలని కూడా మధ్యప్రదేశ్ పోలీసులు నిర్ణయించారు. భోపాల్‌లోని అప్పర్ లేక్, ఉజ్జయినిలోని మహాకాళేశ్వర ఆలయం వంటి ముఖ్యమైన చారిత్రక ప్రదేశాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఏడు జన్మలెత్తినా లాలూ తరహా కుంభకోణాలు మోడీకి చేతకావు

### తేజస్వి కామెంట్‌కు అమిత్‌షా కౌంటర్



**పాట్నా, నవంబరు 8:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆర్జేడీనేత తేజస్వీ యాదవ్‌లు సీమాంచల్‌ను చొరబాటుదారుల అడ్డాగా మార్చేందుకు కంకణం కట్టుకున్నారని కేంద్రమంత్రి అమిత్ షా ఆరోపించారు. పూర్ణియాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ ప్రతి అక్రమ వలసదారుడిని గుర్తించి దేశం నుంచి బహిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా తేజస్వి ఇటీవల చేసిన వ్యాఖ్యలకు బదులిస్తూ ఏడు జన్మలెత్తినా లాలూ మాదిరిగా మోడీ కుంభకోణాలు చేయలేరని చురకలంటించారు. బీహార్‌లో 160స్థానాల్లో విజయం సాధించి ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే సగం రాష్ట్రం కాంగ్రెస్, ఆర్జేడీ కూటమికి తలుపులు మూసివేసింది. రాహుల్, తేజస్విలు కలిసి సీమాంచల్ ప్రాంతాన్ని చొరబాటుదారుల అడ్డాగా మార్చేందుకు కంకణం కట్టుకున్నారు. ప్రతి చొరబాటుదారుడిని గుర్తించి, ఎన్నికల జాబితా నుంచి వారి పేర్లను తొలగిస్తాం. వారి దేశానికి పంపిస్తాం అని అమిత్ షా పేర్కొన్నారు. రైల్వేలో లాలూప్రసాద్ యాదవ్ తీసుకొచ్చిన లాభాలను ప్రధాని మోడీ ఏడు జన్మలెత్తినా తీసుకురాలేరంటూ ఇటీవల తేజస్వి యాదవ్ చేసిన విమర్శలకు గట్టిగా బదులిచ్చారు. ఏడు జన్మలెత్తినా లాలూ మాదిరిగా మోడీ కుంభకోణాలు చేయలేరంటూ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఓట్ల చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేస్తున్న వ్యాఖ్యలు నిరాధారమైనవి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఉద్ఘాటించారు. అందుకు సంబంధించి ఏమైనా ఆధారాలు ఉంటే ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని సూచించారు. రోహ్‌తాస్‌లో ఎన్నికల ప్రచారసభలో రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీ అనేక సవాళ్లను మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. సాయుధ బలగాలను రాజకీయాల్లోకి లాగొద్దని ఈ సందర్భంగా రాహుల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

### స్కూల్ పిల్లలకు న్యూస్‌పేపర్‌లో

## భోజనం పెడతారా! నా హృదయం ముక్కలైంది..

### రాహుల్ తీవ్ర ఆవేదన



**భోపాల్, నవంబరు 8:** మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు న్యూస్‌పేపర్‌లో మధ్యాహ్న భోజనం వడ్డించినట్లు కనిపిస్తున్న దృశ్యాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఇది చూసి హృదయం తల్లడిల్లిందన్నారు. ఇంత దయనీయస్థితిలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లో కొంత మంది చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని న్యూస్‌పేపర్‌లో వడ్డిస్తున్నట్లు తెలుసుకుని నా హృదయం ముక్కలైంది. ఈ పిల్లలపైనే మన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. కానీ, వారికి కనీస గౌరవం దక్కడం లేదు. అక్కడ అభివృద్ధి అంతా భ్రమే. వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అధికారంలోకి వస్తున్నారు. ఇటువంటి దుర్భర స్థితిలో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలి అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. శ్యోపుర్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఈ వీడియో తీసినట్లు సమాచారం. ఈ వ్యవహారం కాస్త నెట్టింట వైరల్‌గా మారడంతో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది. స్వయం సహాయక సిబ్బంది సేవలను నిలిపివేశారు. నెటిజన్లు దీన్ని ఖండించారు. మధ్యాహ్న భోజనం అనేది పిల్లల హక్కు అని పేర్కొన్నారు. పోషకాహారం పేరిట అనారోగ్యాన్ని వడ్డిస్తున్నారంటూ విమర్శించారు.


## సంక్షిప్తంగా..

### మాలిలో ఐదుగురు భారతీయులు కిడ్నాప్



**బమాకో, నవంబరు 8:** మాలిలో ఐదుగురు భారతీయులు కిడ్నాప్‌నకు గురయ్యారు. కోబ్రి ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని భద్రతా వర్గాలు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. విద్యుద్దీకరణ ప్రాజెక్టులకు సంబంధించి ఆ భారతీయులు స్థానికంగా ఓ కంపెనీలో పని చేస్తున్నారని మాలి భద్రతా వర్గాలు తెలిపాయి. గురువారం కొందరు దుండగులు ఈ ఉద్యోగులపై అకస్మాత్తుగా దాడులు జరిపారని పేర్కొన్నాయి. అనంతరం ఐదుగురు భారతీయులను అపహరించుకుని వెళ్లిపోయారని తెలిపాయి. ఘటన నేపథ్యంలో ఈ కంపెనీలో పనిచేసే మిగతా భారతీయులను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు అధికారిక వర్గాలు వివరించాయి. ఈ కిడ్నాప్‌ను కంపెనీ ప్రతినిధులు కూడా ధ్రువీకరించారు. అయితే బాధితుల వివరాలను మాత్రం వారు వెల్లడించలేదు.

### డిఎన్ఎ ఆవిష్కర్త జేమ్స్ వాట్సన్ కన్నుమూత



**న్యూయార్కు, నవంబరు 8:** ఆధునిక విజ్ఞాన శాస్త్ర గతిని మార్చేసిన డీఎన్ఏ డబుల్ హెలిక్స్ నిర్మాణ ఆవిష్కర్తల్లో ఒకరైన, నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ జేమ్స్ డి.వాట్సన్ (97) కన్నుమూశారు. న్యూయార్క్‌లోని ఈస్ట్ నార్త్‌పోర్ట్‌లో ఆయన తుదిశ్వాస విడిచారు. ఇన్ఫెక్షన్ కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన్ను ఈ వారం ప్రారంభంలో హాస్పైస్ కేర్‌కు తరలించగా, అక్కడ ప్రశాం తంగా మరణించినట్లు ఆయన కుమారుడు డంకన్ వాట్సన్ ధ్రువీకరించారని ఆంగ్లపత్రిక ఒకటి పేర్కొంది. 1928 ఏప్రిల్ 6న షికాగోలో జన్మించిన వాట్సన్, కేవలం 24 ఏళ్ల వయసులోనే కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఫ్రాన్సిస్ క్రిక్‌తో కలిసి డీఎన్ఏ నిర్మాణంపై పరిశోధనలు చేశారు. 1953లో వారు ప్రతిపాదించిన డబుల్ హెలిక్స్ నమూనా, జీవులలో అనువంశిక సమాచారం ఒక తరం నుంచి మరో తరానికి ఎలా వెళ్తుందో వివరించి, సైన్స్ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది. ఈ ఆవిష్కరణకు గాను వాట్సన్, క్రిక్‌లతో పాటు మరో శాస్త్రవేత్త మారిస్ విల్కిన్స్‌కు 1962లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.

### దక్షిణాఫ్రికా జి20 సమావేశాలు బాయ్‌కాట్: ట్రంప్



**వాషింగ్టన్, నవంబరు 8:** దక్షిణాఫ్రికాలో జరుగ నున్న జీ20 శిఖరాగ్ర సమావేశానికి అమెరికా అధికారులెవరూ హాజరుకాబోరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. శ్వేత జాతి రైతులతో క్రూరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన జీ20 శిఖరాగ్ర సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల చివర్లో జరిగే జీ20 శిఖరాగ్ర సమావేశానికి తాను హాజరు కాబోనని ట్రంప్ గతంలోనూ ప్రకటించారు. నవంబర్ 22,23 తేదీల్లో జరిగే ప్రపంచంలోని ప్రముఖ, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల దేశాధినేతల వార్షిక శిఖరాగ్ర సమావేశానికి తాను హాజరు కాబోనని ట్రంప్ గతంలో తెలిపారు. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ తనస్థానంలో హాజరవుతారని భావించారు. వాన్స్ కూడా ఈ సమావేశానికి వెళ్లరని ట్రంప్ పేర్కొన్నారు. జీ20శిఖరాగ్ర సమావేశం దక్షిణాఫ్రికాలో జరగడం పూర్తిగా అవమానకరమని ట్రంప్ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు.

### వివేక్ రామస్వామికి ట్రంప్ ప్రశంసలు



**ఒహాయో, నవంబరు 8:** భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. ఆయనను ప్రత్యేకమైన వ్యక్తి (సమ్‌థింగ్ స్పెషల్) అంటూ ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. వివేక్ రామస్వామి ఒహాయో గవర్నర్ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. వచ్చే ఏడాది జరగనున్న ఈ ఎన్నికల్లో ఆయనకు మద్దతుగా ట్రంప్ ఈ పోస్టు పెట్టారు. ఒహాయో రాష్ట్రాన్ని గ్రేట్ స్టేట్‌గా అభివర్ణిస్తూ, వివేక్ రామస్వామి ఎన్నికైతే గొప్ప గవర్నర్ అవుతారని ట్రంప్ పేర్కొన్నారు. ది గ్రేట్ ఒహాయో రాష్ట్రానికి వివేక్ రామస్వామి పోటీ చేస్తున్నారు. నాకు ఆ ప్రాంతం అంటే ఎంతో ఇష్టం. 2016, 2020, 2024 ఎన్నికల్లో నేను భారీ విజయం సాధిం చాను. వివేక్ నాకు బాగా తెలుసు. అధ్యక్ష ఎన్నికల్లో నాతోనే పోటీకి వచ్చాడు. అతడు ప్రత్యేకమైన వ్యక్తి. వివేక్ యువకుడు, తెలివైనవాడు, చాలా మంచి వ్యక్తి. అతనికి మన దేశం అంటే ఎంతో ఇష్టం అని ట్రంప్ తన ట్రూత్ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు మద్దతు ధర పొందాలి

## మంత్రి కొలుసు పార్థసారథి

**ముసునూరు, నవంబరు 08: ప్రభాతవార్త** ముసునూరు మండలం కొర్లగుంట గ్రామం కో ఆపరేటివ్ సొసైటీ నందు నూజివీడు నియోజకవర్గంలో తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని లక్ష్యంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా కొనుగోళ్లను ప్రారంభించడం జరిగిందన్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధరకే వారి ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. రైతులు తమ పంటను కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. దళారులు లేక మధ్యవర్తులు మరియు మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకూడదని స్పష్టం చేశారు. ఈపంట నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతులు వద్ద మాత్రమే ధాన్యము కొనుగోలు చేయడం జరుగు తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులు ధాన్యం అమ్ముకోవడానికి పడేకష్టాలు తీరాయని అన్నారు. గతంలో ప్రభుత్వం సూచించిన సుదూర ప్రాంతంలో ఉన్న మిల్లులకే ధాన్యాన్ని తోలవలసి వచ్చేదని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. పంట కోతకు వచ్చిన అన్ని ప్రదేశాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి యం.పి. యల్.సుందరి, వ్యవసాయ సహాయ సంచాలకులు వై.సుబ్బారావు, తహాశీల్దారు డి.ప్రశాంతి, యంపిడివో పి.ఏసుబాబు, వివిధ శాఖల అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ.చాముండేశ్వరి, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, కూటమి

## వైఎస్సార్సీ సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి భాస్కర్‌రెడ్డికి 21 వరకు రిమాండ్

**విజయవాడ,నవంబరు 8,ప్రభాత వార్తప్రతినిధి:** సీఎం, డిప్యూటీ సీఎం సహా వారి కుటుంబ సభ్యులు, మహిళలు, కూటమి ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన నిందితుడు భాస్కర్‌రెడ్డికి కోర్టు రిమాండ్ విధించింది. విజయవాడలోని రెండో ఏసీఎంఎం కోర్టు ఈ నెల 21 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. నిందితుడు, వైఎస్సార్సీపీ సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి భాస్కర్‌రెడ్డి విదేశాల్లో ఉండి సామాజిక మాధ్యమాల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన నేతలు, మహిళలపై అసభ్యకరంగా, నీచంగా పోస్టులు పెడుతున్నాడు. అతడ్ని పెనమలూరు పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అరెస్ట్ సమయంలో పోలీసులపై దాడి చేసిన అతని సోదరుడు ఓబుల్‌రెడ్డిని కూడా అరెస్ట్ చేశారు. ఇద్దరినీ వేర్వేరుగా కోర్టుల్లో హాజరుపర్చగా న్యాయాధికారులు వారికి రిమాండ్ విధించారు. అనారోగ్యంతో విజయవాడ పోరంకిలోని కామినేని ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన అతన్ని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. పోలీసు విచారణలో తనను కొట్టారని నిందితుడు కోర్టులో చెప్పడంతో సీఐ, ఎస్సైలు వివరణ ఇవ్వాలని న్యాయాధికారి ఆదేశించారు. రిమాండ్‌కు తరలించేటప్పుడు ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించి నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాల మేరకు భాస్కర్‌రెడ్డిని నెల్లూరు జైలుకు, అతని అన్న ఓబుల్‌రెడ్డిని అవనిగడ్డ జైలుకు తరలించారు.

## పరిశ్రమలు, మౌలిక వనరుల సంస్థకు కొత్తగా 15 మంది డైరెక్టర్లుగా నియామకం

**విజయవాడ,నవంబరు 8,ప్రభాత వార్తప్రతి నిధి:** రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వనరుల సంస్థకు కొత్తగా 15 మందిని డైరెక్టర్లుగా నియమిస్తూ పరిశ్రమలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొరడా భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, చల్లా లక్ష్మీ ప్రసాద్, చెన్నమల్ల చంద్రశేఖర్, దోమా జగదీష్‌గుప్తా, గొల్లపూడి పెద్దిరాజు, కద్లి గోపాలరావు, జి ప్రేమ్‌కుమార్, కంచర్ల మాధవి, కనికళ్ల చిరంజీవి, మండలి రాజేష్, పాతూరి నారా యణస్వామి మహేష్, ప్రసాద్‌రెడ్డి, వంగూరు సంతోష్‌కుమార్, మార్గాని సత్యనారాయణ్‌ను నియమించారు.

## 1,150 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఆర్థిక సాయానికి నిధులను విడుదల

**విజయవాడ,నవంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** మరణించిన న్యాయవాదుల కుటుంబాలను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాదాపు 1,150 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఆర్థిక సాయానికి నిధులను విడుదల చేసింది. రూ.46 కోట్ల మా ్యచింగ్ గ్రాంటీగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. మరణించిన న్యాయవాది కుటుంబానికి రూ.4 లక్షల చొప్పు ఒపన ఆర్థిక సాయం అందించనుంది. ఈ మేరకు అర్హత కల్గిన వారి జాబితాతో ప్రభుత్వం 2 జిఒలను విడుదల చేసింది. భాధిత న్యాయవాదికి సంబంధించి నామినీకి ఆర్థిక సాయం అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఏపీ అడ్వకేట్ ్స వెల్ఫేర్ ఫండ్ మ్యాచింగ్ గ్రాంట్ పేరుతో నిధులు జారీ చేయాలని పేర్కొంది. తదుపరి చర్యలు తీసుకోవాలని ఏపీ బార్ కౌన్సిల్ కార్యదర్శిని ప్రభుత్వ ఆదేశించింది. ఈ మేరకు లా విభాగం కార్యదర్శి గొట్టపు ప్రతిభా దేవి ఉత్తర్వులు జారీ చేశారు.

## పట్టణాభివృద్ధి స్మార్ట్‌సిటీలు పురపాలనలో నూతన సంస్కరణలు



న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ అర్బన్ కాన్‌క్లేవ్-2025లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

**జగ్గయ్యపేట, నవంబర్ 8, ప్రభాతవార్త :** భారత ప్రభుత్వ గృహ నిర్మాణ, పట్టణ ప్రణాళిక వ్యవహారాల మంత్రిత్వశాఖ గ్రాంట్ల వినియోగంపై నేషనల్ అర్బన్ కాన్‌క్లేవ్-2025 శనివారం నిర్వహించిన తొలిరోజు కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొని సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమెరికాలో ఐదేండ్లపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగంచేసి సొంత ఊరైన ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి తిరిగివచ్చి రాజకీయ రంగ ప్రవేశం చేసిన రాఘవేంద్ర మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి చైర్మన్‌గా గత మూడున్నరేండ్లుగా పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే అనర్గళంగా ఆంగ్ల సంభాషణ, పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్స్‌తో పలు సదస్సులో తన ప్రతిభను ప్రదర్శించారు. పట్టణాభివృద్ధి స్మార్ట్‌సిటీలు పురపాలనలో నూతన సంస్కరణలపై ఆయన ఇచ్చిన సూచనలు సభికులను ఆకట్టుకున్నాయి. న్యూఢిల్లీలోని యశ్భూమి, ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ ద్వారకాలో సూటబుల్ అర్బన్ డెవలప్‌మెంట్ అండ్ గవర్నెన్స్ అనే ప్రధాన అంశంపై రెండు రోజుల సదస్సులు ప్రారంభమయ్యాయి. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొని సదస్సును ప్రారంభించారు. దేశ వ్యాప్తంగాగల మేయర్లు, చైర్మన్లు, ఉన్నతాధికారుల మధ్య చర్చలు, సమీక్షలు నిర్వహించనున్న ఈ కాన్‌క్లేవ్‌లో విశాఖపట్నం, గుంటూరు మేయర్లతోపాటు ఆంధ్ర రాష్ట్రం నుండి ఏకైక మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర ఒక స్పీకర్‌గా ప్రత్యేక ఆహ్వానం అందుకుని పాల్గొన్నారు. ఏపి సిడిఎంఏ సంపత్‌కుమార్ కూడా పాల్గొన్నారు. భారతదేశ అభివృద్ధిలో కీలకపాత్రను పట్టణాలు పోషిస్తున్నాయని, ప్రతి నగరంలో పరిపాలన పారదర్శకత, సాంకేతికత, ప్రజాభాగస్వామ్యాలను పెంపొందించుకోవాలని మంత్రి సభలో సూచించినట్లు చైర్మన్ రాఘవేంద్ర మీడియాకు తెలియపర్చారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవటం, సౌరశక్తి వినియోగం, వ్యర్థాల నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పట్టణాభివృద్ధి వంటి పలు అంశాలపై చర్చ జరిపినట్లు ఆయన తెలిపారు. పురపాలనలో సరికొత్త ఆలోచనలు ఆవిష్కృతం అయ్యాయని సంతోషం వ్యక్తంచేశారు. జగ్గయ్యపేట ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది, పట్టణ ప్రజల సహకారం, విశ్వాసాలపట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఇద్దరు పిల్లలు సహా బావిలో దూకి తల్లిఆత్మహత్య

### ఉగ్గుముడిలో విషాదం

**సూళ్లూరుపేట, నవంబర్ 8 ప్రభాతవార్త** ఆ తల్లికి ఏం కష్టం వచ్చిందో ఏమో తెలియదు గాని కన్న బిడ్డలతో సహా బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండల పరిధిలోని ఉగ్గుమడి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఉగ్గుముడి వరలక్ష్మి (24) ఆమె కుమారులు వర్షిత్ (4), ప్రశాంత్ (2)లను తీసుకొని గ్రామ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఉగ్గుముడి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉగ్గుముడి గ్రామానికి చెందిన మాధవయ్యతో వరలక్ష్మి ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. ఇద్దరు మగ బిడ్డలకు జన్మనిచ్చారు. గత కొద్దిరోజులుగా కుటుంబంలో కలహాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఇంట్లో అందరూ పనులకు వెళ్లిన సమయంలో వరలక్ష్మి తన ఇద్దరు పిల్లలను తీసుకుని బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. విగతజీవులైన తల్లి బిడ్డలను చూసి ఉగ్గుముడి గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఎస్సై బ్రహ్మానాయుడు సంఘటన ప్రదేశానికి వెళ్లి బావి నుండి మృతదేహాలను వెలికితీసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కే శాట్ శాటిలైట్ సర్వీస్ స్టేషన్ ను సందర్శించిన ఎంపి పుట్టా మహేష్ కుమార్ బృందం

**ఏలూరుట్రోంసోనార్వే, నవంబర్ 08:** ప్రభాతవార్త నార్వే పర్యటనలో ఉన్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఇతర ఎంపీల బృందం పలు సమావేశాలు, పలు సంస్థల సందర్శనలో బిజీగా గడిపింది. ఉదయం ట్రోంసో నగరంలో స్థానిక వ్యాపారవేత్తలు, పలు పరిశ్రమల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో భారత ఎంపీలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో భారత్ నార్వే దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెంపునకు సంబంధించి చర్చలో పాల్గొన్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్.. భారత్ సందర్శించవలసిందిగా నార్వే పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. అనంతరం ప్రెస్ట్‌వానెట్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఇక్కడ అమలు చేస్తున్న విద్యా విధానం గురించి అకాడమీ డైరెక్టర్, ప్రిన్సిపాల్ భారత ఎంపీలకు వివరించారు. శుక్రవారం మధ్యాహ్నం ఎంపీల బృందం వాతావరణ, నిఘా సమాచారాన్ని అందించే ప్రఖ్యాత "కే శాట్" శాటిలైట్ సర్వీస్ స్టేషన్ ను సందర్శించారు.

రాడార్ మరియు ఆప్టికల్ వనరుల నుండి డేటాను ఉపయోగించి సముద్ర పర్యవేక్షణ మరియు నిఘా సేవలందించడంలో ప్రపంచంలోనే అగ్రగామి సంస్థ అయిన కే సాట్ సందర్శించడం ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఈ సందర్భంగా చెప్పారు. "నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్" ప్రోగ్రాంలో భాగంగా నార్వేలో గత ఆరు రోజులుగా కొనసాగుతున్న భారత ఎంపీల పర్యటన శనివారంతో ముగుస్తుంది.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

**రాపూరు (నెల్లూరు), నవంబర్ 8, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ



నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయిస్వామి తదితరులు నిర్వహించారు.



కుప్పంలో పలు ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

## సంజీవిని పథకం కుప్పంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు

- కుప్పం నియోజకవర్గాన్ని ఓ మోడల్ గా తీర్చిదిద్దుతాం
- కుప్పాన్ని విద్యా కేంద్రంగా రూపొందించాలే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.
- ఈ ఏడాది చివరికల్లా ఎల్పీజీ క్రిమటోరియం, కుప్పం సెంట్రల్ పార్క్...
- మోడల్ బస్ స్టేషన్, ఎన్టీఆర్ స్పోర్ట్ కాంప్లెక్స్ సిద్ధం
- కుప్పంలో ఏడు ప్రాజెక్టులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** కుప్పంలో ఏడు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. శనివారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ఏడు ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం కుప్పంలో పరిశ్రమలు స్థాపించనున్న ప్రతినిధులతో మాట్లాడారు. అనుకున్న సమయానికి పరిశ్రమలు ప్రారంభించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. తాము పరిశ్రమలను స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన అనుమతులు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయా సంస్థల ప్రతినిధులు ధన్యవాదాలు తెలియజేశారు.కుప్పంలో ఏర్పాటు చేయనున్న తమ పరిశ్రమలకు సంబంధించిన నిర్మాణ ప్రణాళికలను సీఎంకు పారిశ్రామికవేత్తలు వివరించారు. మొత్తం రూ.2,203 కోట్లతో కుప్పంలో ఏడు సంస్థలు పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ ఏడు సంస్థలకు కుప్పంలో 241 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. డెయిరీ, ల్యాప్ టాప్, మొబైల్ ఎక్సెసరీస్, వంట నూనెల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి వంటి పరిశ్రమలు కుప్పంలో ఏర్పాటు కానున్నాయి.హిందాల్కో, శ్రీజా డైరీ, ఏస్ ఇంటర్నేషనల్, ఎస్వీఎఫ్ సోయా, మదర్ డైరీ,ఈ రోజీ ఇవి, ఎల్ఎల్ఇఎపి మహిళా పార్కులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ 23 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉంది. కుప్పంలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.సంజీవని పైలెట్ ప్రాజెక్టను కుప్పంలోనే అమలు చేస్తున్నామన్నారు.కుప్పం నియోజకవర్గాన్ని ఓ మోడల్ గా తీర్చిదిద్దుతామన్నారు.కుప్పాన్ని విద్యా కేంద్రంగా రూపొందించాలే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.కడా ద్వారా 400 ఇసైకిళ్లు స్వయం సహాయక సంఘు సభ్యులకు అందించాం.స్వచ్ఛస్వర్ణ కుప్పం సాధనలో భాగంగా చెత్త సేకరణకు 130 ఎలక్ట్రిక్‌దివిబి ఆటోలు వినియోగంలోకి తెచ్చామన్నారు.వచ్చే ఏడాది మార్చి కల్లా రాష్ట్రంలోనే తొలి జీరో ల్యాండ్‌ఫిల్ నియోజకవర్గంగా కుప్పం నిలుస్తుందన్నారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధించాం. ఈ ఏడాది చివరికల్లా ఎల్పీజీ క్రిమటోరియం, కుప్పం సెంట్రల్ పార్క్... వచ్చే ఏడాదిలో డీకే పల్లి పార్క్, మోడల్ బస్ స్టేషన్, ఎన్టీఆర్ స్పోర్ట్ కాంప్లెక్స్ సిద్ధం అవుతున్నాయన్నారు.కుప్పానికి ఇన్ని పరిశ్రమలు వచ్చాయంటే లిటిగేషన్లు లేకుండా భూములిచ్చి సహకరించారు. అమరావతి రైతులు రాజధాని నిర్మాణానికి 33 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకున్నామన్నారు.కుప్పంలో జరుగుతున్న అభివృద్ధిపై ఇంటింట చర్చ జరగాలి అన్నారు.పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాది... సద్వినియోగం చేసుకునే బాధ్యత ప్రజలది అన్నారు.ప్రజలు సహకరిస్తే... ఆకాశమే హద్దుగా అభివృద్ధి చేసుకోవచ్చు.ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు స్థాపించాలి... దీని వల్ల రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు.పారిశ్రామిక వేత్తలు కూడా లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలను పూర్తి చే య ాలి . . . ఉ త ్ప త ్త ు ల ు ప్రారంభించాలన్నారు.లక్ష్యాలు నిర్దేశించుకుని పని చేయాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాను అన్నారు.కుప్పం అభివృద్ధి అధికారులూ చక్కగా పని చేస్తున్నారు.8 సార్లు ఓట్లేసిన గెలిపించిన ప్రజలకు మేలు జరిగేలా పరిశ్రమలు తీసుకురావడం నాకు చాలా సంతోషాన్నిస్తోందన్నారు.నా జీవితంలో ఇది మరిచిపోలేని రోజు అన్నారు. పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తున్నాం అన్నారు.ఎస్ఐబీపీల ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన ఆమోదం తెలుపుతున్నాం అన్నారు.స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఎరో స్పేస్ సిటీలను ఏర్పాటు చేయబోతున్నాంఅన్నారు. డ్వాక్రా వ్యవస్థను ప్రారంభించాం.

## పెరిగిన అమరావతి బ్రాండ్ ఇమేజ్

### రాజధానికి మరో రూ.9వేల కోట్ల రుణం మంజూరు - మీడియాతో సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 22ఏ నిషేధిక జాబితా భూములపైనా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు.శనివారం మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో సీఎం మాట్లాడుతూ అమరావతి ఇప్పుడు అత్యంత గుర్తింపు హైదరాబాద్ స్థాయిలో ఇక్కడా భారీ ఈవెంట్లు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం కూడా ఆ స్థాయిలో భారీ ఈవెంట్లను ప్రోత్సహిస్తోందన్నారు. థమన్ మ్యూజికల్ నైట్, విజయవాడ ఉత్సవ్, ప్రస్తుతం జరుగుతున్న ఇళయరాజా మ్యూజికల్ నైట్ వంటివి అమరావతికి ప్రత్యేక గుర్తింపు తెస్తున్నాయని పేర్కొన్నారు. ఓ వైపు భారీ ఈవెంట్లు, మరోవైపు భారీ పెట్టుబడులతో ఆంధ్రప్రదేశ్ దూసుకెళ్తోందన్నారు. తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్.. నెల్లూరు జిల్లా నాయుడుపేటలో దాదాపు 6 వేల కోట్ల పెట్టుబడి పెడుతుండటం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కమిటీలను వీలైనంత వరకు నెలాఖరులోగా పూర్తి చేస్తామని... పార్లమెంట్ కమిటీల మీద కసరత్తు ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. డిసెంబర్ చివరి నాటికి అన్ని కమిటీలు పూర్తి చేసి పార్టీని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు విధిగా ప్రజాదర్బార్‌లు నిర్వహించాల్సిందే అని... ప్రజా సమస్యలు పట్టించుకోమంటే కుదరదని స్పష్టం చేశారు. లోకేష్ ఆదేశాల తర్వాత ఎమ్మెల్యేల్లో కదలిక వచ్చి అన్ని నియోజకవర్గాల్లో ప్రజా దర్బార్‌లు నిన్న జరిగాయన్నారు. సమస్య తన వద్దకు వస్తేనే పరిష్కారమవుతుందనే భావన ఉండకూడదని అన్నారు. ప్రతీ సమస్య ఎక్కడికక్కడ పరిష్కారమయ్యే వ్యవస్థను ఏర్పాటు చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. భారీ పెట్టుబడులతో ఆంధ్రప్రదేశ్ దూసుకెళ్తోందని వ్యాఖ్యానించారు. తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ నెల్లూరు జిల్లా నాయుడుపేటలో దాదాపు 6,000 కోట్ల పెట్టుబడి పెడుతుండటం శుభపరిణామమన్నారు. పార్టీ కమిటీలు వీలైనన్ని నెలాఖరులోగా పూర్తి చేస్తామని, పార్లమెంట్ కమిటీల మీద కసరత్తు ముమ్మరంగా సాగుతోందని అన్నారు. డిసెంబర్ చివరి నాటికి అన్ని కమిటీలు పూర్తి చేసి పార్టీని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్తామన్నారు. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే పెట్టుబడుల సదస్సు ఈసారి నిర్మాణాత్మకంగా జరగనుందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రెజెంటేషన్, ఎగ్జిక్యూషన్, ఎగ్జిబిషన్, ఒప్పందాలు ఇలా వివిధ రూపాల్లో రెండు రోజుల పాటు సదస్సు సాగనుందన్నారు. ప్రజలకు అధునాతన అవసరాలు, అత్యాధునిక సాంకేతిక అంశాలపై అధ్యయనం కూడా ఉంటుందని తెలిపారు.ఇప్పుడు జరుగుతున్న ఒప్పందాలు, పెట్టుబడుల సదస్సుకు సంబంధం లేకుండా దేనికదే విడివిడిగా నడుస్తాయని తెలిపారు. పెట్టుబడుల సాధనలో లోకేశ్ క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వచ్చే ప్రముఖులు, పెట్టుబడిదారులకు విశాఖ సదస్సు కొత్త అనుభూతినిస్తుందని అన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు స్పందిస్తున్నాం. తర్వాత వదిలేస్తున్నాం అని చంద్రబాబు అసంతృప్తి వెలిబుచ్చారు. ఒక ఘటన జరిగాక దానిపై మేధోమథనం చేయాలి. సమగ్ర నిర్వహణ విధానాలు రూపొందించి అమలుచేయాలి. ఎవరు చనిపోయినా పర్వాలేదని వదిలిపెడితే అదే పెద్ద నేరం. మరో రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసిన బస్సు హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తోంది. కర్నూలులో దగ్ధమైంది. కొన్ని రాష్ట్రాల్లో తక్కువ రుసుముకే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. వాటిపై ఆయా రాష్ట్రాల పర్యవేక్షణ లేదు. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి



పుట్టపర్తిలో మంత్రి నారా లోకేష్‌ను కలసి వినతి పత్రం సమర్పిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు, హిందూపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తదితరులు


## బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా చొరవ చూపండి

### - మంత్రి నారాలోకేష్‌కు వాల్మీకి ప్రజాప్రతినిధుల విన్నపం

**అనంతపురం, నవంబర్ 8 ప్రభాతవార్త బ్యూరో** వెనకబడ్డ వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రక్రియ వేగవంతమయ్యేలా చూడాలని మంత్రి నారా లోకేష్ బాబుకు వాల్మీకి ప్రజాప్రతినిధులు విన్నవించారు. ఈ మేరకు పుట్టపర్తిలో శనివారం ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంలు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడిన ఈ సమయంలో రాష్ట్రంలోని వాల్మీకి, బోయ సమాజం తమ న్యాయమైన హక్కులు పొందుతామని ఎంతో ఆశ, ఆతృతతో ఎదురు చూస్తోందని విజ్ఞప్తి చేశారు. 2016లో నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ సత్యపాల్‌ను ఏకసభ్య కమిషన్‌గా నియమించి ఈ సమస్యపై సమగ్ర అధ్యయనం చేయమని ఆదేశించారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి వాల్మీకి, బోయాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని సిఫార్సు చేసిందని తెలిపారు. 2017లో చంద్రబాబు నాయకత్వం లో అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు. తదనంతరం భారత జనగణన కమిషన్ ఉప డైరెక్టర్ జనరల్ ఆరు ప్రశ్నలతో రాష్ట్రాన్ని వివరణ కోరారని వెల్లడించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ ప్రభుత్వం తగిన సమాధానం ఇవ్వకపోగా మరో కమిషన్‌ను నియమించి రాయలసీమ ప్రాంతానికి చెందిన వాల్మీకులను మాత్రమే ఎస్టీ జాబితాలో చేర్చే నిర్ణయం తీసుకుందని తెలిపారు. దాంతో రాజకీయ పరంగా సమాజంలో విభేదాలు సృష్టించే చర్యగా మారిందని వివరించారు. దశాబ్దాల కాలంగా వాల్మీకి, బోయ సమాజం వేట, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి అత్యంత దారిద్ర్యంలో జీవిస్తోందని పేర్కొన్నారు. భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు ఒకే విధంగా ఉన్నందున పొరుగు నున్న కర్ణాటక రాష్ట్రంలో వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తిస్తున్నారని వివరించారు. వాల్మీకి బోయ సమాజ పరిస్థితి పట్ల సానుకూల దృక్పథంతో ఆలోచించి కేంద్రం వ్యక్తపరిచిన ఆరు అంశాలపై త్వరితగతిన అధికారుల ద్వారా కేంద్రానికి నివేదిక అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సహృదయ చర్యకు తామే కాకుండా వాల్మీకి, బోయ కృతజ్ఞతతో ఉంటుందన్నారు.

## ఆసియా కప్ అర్చరీ పోటీలకు అర్హత సాధించిన యుక్తశ్రీ

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** విలు క్రీడ(అర్చరీ)లో రాష్ట్రీయంగాను. జాతీయంగాను,అంతర్జాతీయంగా పతకాల పంటను పండిస్తుంది కృష్ణాజిల్లాకు చెందిన యువతి.విలు క్రీడల్లో రాణించడమంటే అంత సాదాసీదా విషయం కాదు.గురిపై లక్ష్యంతో కూడిన సాధన ఈ విద్యను అవసరం. అటువంటిది ఏకంగా పతకాలకు గురిపెట్టి విజయాల పరపరం కొనసాగిస్తుంది కృష్ణా జిల్లా కొండపావులూరి యుక్తశ్రీ ,ఆమె ఆసియా కప్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఇక్కడితో ఆగకుండా ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుని తాను అనుకున్న లక్ష్యాన్ని కచ్చితంగా సాధిస్తా అంటుంది.యుక్తశ్రీది కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మడిచర్ల అనే గ్రామం. చిన్నప్పటి నుంచీ ఆటలంటే ఇష్టమున్న ఆమె 2018లో వేసవి సెలవుల్లో ఆర్చరీ నేర్చుకోవాలనని నిర్ణయించుకుంది. దాంతో ఆమెను తల్లిదండ్రులు విజయవాడలోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో చేర్చారు. ఆ తర్వాత రోజుల వ్యవధిలోనే ఈ క్రీడపై తను ఇష్టాన్ని పెంచుకుంది. దాన్నే కెరియర్‌గా మలుచుకుని ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. కుమార్తె ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ఝాన్సీ లక్ష్మి, సాయి వెంకటగిరి తనను ప్రోత్సహిస్తూ అందుకు



కావలసిన అవసరాలను చేకూరుస్తూ విజయవాడకు మకాం మార్చేశారు. యుక్త ఓ పక్క చదువుకుంటూనే విలు విద్యలో నైపుణ్యాలను ఒంటబట్టించుకోవడం ఆరంభించింది. 14 ఏళ్ల వయసులోనే సబ్ జూనియర్ విభాగంలో జాతీయ ఛాంపియన్‌గా నిలిచింది యుక్తశ్రీ. దాదాపు 20 ఏళ్ల విరామం తర్వాత ఈ ఘనత సాధించిన తెలుగు అమ్మాయి యుక్తనే కావడం విశేషం. దీంతో ఈమెలోని ప్రతిభను గుర్తించిన జంషెడ్‌పూర్‌లోని ఖిటాటాఖి ఆర్చరీ అకాడమీ శిక్షణకు ఆహ్వానించింది. ఆ తర్వాత అనేక టోర్నీల్లో సత్తా చాటిన యుక్త వచ్చే నెల సౌదీ అరేబియాలో జరగనున్న ఆసియా కప్ (స్టేజ్3)లో పాల్గొనేందుకు సిద్ధమైంది.

హరియాణాలోని సోనిపట్‌లో ఈ నెల 3 నుంచి 6 వరకు నిర్వహించిన ఎంపిక పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. అలా తొలిసారిగా అంతర్జాతీయ వేదికపై బరిలోకి దిగే అవకాశం

# డ్వాక్రా మహిళల ఉపాధికి పెద్దపీట

## - మూడు క్లస్టర్లను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
## - మరో ఆరింటికి సూత్రప్రాయ అంగీకారం

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** డ్వాక్రా మహిళల ఉపాధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి కల్పనకు అవకాశమున్న కీలక రంగాలను గుర్తించి వారికి చేయూత అందిస్తోంది. ఇప్పటికే 9 ప్రాంతాలను ఎంపిక చేసి కేంద్రానికి నివేదించింది. గుంటూరు జిల్లాలో పచ్చళ్ళ తయారీ, బాప్ట, కర్నూలు జిల్లాల్లో చేనేత క్లస్టర్లను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. మరో ఆరు క్లస్టర్ల ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. వారం,పది రోజుల్లో వీటిని గ్రీన్ సిగ్నల్ లభించనుంది. తమ ఆమోదంతో సంబంధం లేకుండా పనులు ప్రారంభించాలని ఇప్పటికే కేంద్ర అధికారులు రాష్ట్రానికి సమాచారమిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,475 మందికి లబ్ధి చేకూరనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నాయి. 9 క్లస్టర్ల ఏర్పాటుకు గాను రూ.100 కోట్ల వ్యయం కానుంది. ఈ మేరకు ఇప్పటికే నివేదికలను సిద్ధం చేసి సెర్ప్ అధికారులు కేంద్రానికి నివేదించారు. పచ్చళ్ళ తయారీ క్లస్టర్‌కు రూ.22 కోట్లు,చేనేత క్లస్టర్లకు రూ.5 కోట్ల చొప్పున ఇప్పటికే కేటాయించింది. పచ్చళ్ళ తయారీ క్లస్టర్‌తో గుంటూరు జిల్లాలో 2,500 మంది డ్వాక్రా మహిళలకు లబ్ధి చేకూరనుంది. అంపశయ్యపై ఉన్న చేనేతకు ఆధునికత జోడించేందుకు క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లాలో చీరాల నేత చీరెల తయారీకి ప్రసిద్ధి. వీటితో పాటు తిరుపతి, విజయనగరం లోనూ మరో రెండు చేనేత క్లస్టర్లు రానున్నాయి. ఒక్కో చోట 200 మంది చేనేతలను ఒక సమూహాంగా చేసి క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నారు. విజయనగరం జిల్లాలో ప్రత్యేకంగా మిల్లెట్ క్లస్టర్ ఏర్పాటు కానుంది. దీంతో 1000 మందికి లబ్ధి చేకూరుతుంది.

ప్రకాశం జిల్లా,కొత్తపట్నం కేంద్రంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఇక్కడ 1500 మందికి ఉపాధి లభించనుంది. ఎన్టీఆర్ జిల్లా జక్కంపూడి పరిధిలో సాంకేతిక క్లస్టర్‌ను ఏర్పాటు చేయనుంది.

దీనికి రూ.41 కోట్ల వ్యయం కానుంది. 5025 మందికి లబ్ధి చేకూరుతుంది. ప్రకాశం జిల్లా సింగరాయకొండ కేంద్రంగా ఆహార ఉత్పత్తుల క్లస్టర్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ 700 మందికి ఉపాధి లభిస్తుంది.

# డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టిన ఇన్నోవా.. హైవేపై దగ్ధం

**చిట్యాల రూరల్, నవంబరు 8, ప్రభాతవార్త :** నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామశివారులో జాతీయ రహదారిపై శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాదుకు చెందిన ప్రకాష్ పటేల్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇన్నోవా కారులో హైదరాబాదు నుంచి చైన్నై కు బయలుదేరారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారుకు రాగానే యూటర్న్ వద్ద తెల్లవారుజామున డివైడర్ ను ఢీ కొట్టి పల్టీ కొట్టి అవతలి వైపు రోడ్డుపై అడ్డుగా పడింది. దీంతో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ఉన్నవారు గమనించి వెంటనే బయటకి వచ్చారు. ప్రమాదం చోటు చేసుకున్న కారులో 8 మంది ఉండగా ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. స్థానికంగా ఉన్నటువంటి వాహనదారులు కారు పల్టీ పడిన వెంటనే కారులో ఉన్నవారికి సహాయం అందించడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే కారులో మంటలు చెలరేగుతున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శకటం వచ్చేలోగా కారు పూర్తిగా దగ్ధమైంది. ఈప్రమాదంతో విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై అడ్డంగా పడడంతో అక్కడ కొద్దిసేపు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది.

వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు, ఎన్ హెచ్‌ఏఐ, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వాహనాన్ని పక్కకు తరలించి, ట్రాఫిక్ ను నియంత్రించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక వాహనదారులు వారికి సహాయం అందించడంతో స్థానిక ఎస్సై మామిడి రవికుమార్ వారిని అభినందించారు.



విరాళమిచ్చిన దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

# దుర్గమ్మ ఆలయంలో సంకటవార చతుర్థి పూజలు

**ఇంద్రకీలాద్రి, నవంబర్ 8, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో శనివారం సంకటహరచతుర్థి పూజాదికాలు వేదమంత్ర పఠనాలతో నిర్వహించారు. శ్రీ స్వామివారికి అభిషేకం నిర్వహించి హోమాది క్రతువులు పూర్తి చేశారు. కార్యక్రమంలో ఇఒ వికె శీనా నాయక్ పాల్గొన్నారు.

**- దుర్గమ్మవారి ఆలయాభివృద్ధి పనులకు రు.10లక్షల విరాళం:**
దుర్గమ్మవారి ఆలయంలో జరిగే పలు అభివృద్ధి పనులకు విజయవాడకు చెందిన ప్రకాష్ ఆర్ట్స్ అధినేత సిడివి సుబ్బారావు, పుష్పలత దంపతులు, వారి కుమార్తె మణి లక్ష్మి రషిత, తల్లి రామమణి, లతె కలిసి శనివారం రు.10 లక్షల విరాళాన్ని అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, మెమంటో లను ఇఒ చైర్మన్లు అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలందించారు.

**- సౌకర్యాలకల్పనలో రాజీ లేదు :**
దుర్గమ్మవారిని దర్శించుకునే భక్తులకందించే సౌకర్యాల కల్పనలో రాజీ లేదని ఇఒ వికె శీనా నాయక్ పేర్కొన్నారు. శనివారం ఆయన నూతనంగా ఏర్పాటు చేయనున్న అన్నదాన భవనం, లడ్డూపోటు, లను పరిశీలించి ఇంజనీర్లనడిగి వివరాలు తెలుసుకున్న అనంతరం మాట్లాడుతూ త్వరితంగా నిర్మాణాలు భక్తులకు అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**- వేదోక్తంగా కార్తీకమాస పూజలు**
దుర్గమ్మవారి ఆలయంలో శనివారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఒ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఒ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవారు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు.

**- దాతల విరాళాలు:**
దుర్గమ్మ ఆలయంలో జరిగే ఉచిత ప్రసాద వితరణ పథకానికి మంగళగిరికి చెందిన పోలవరపు వెంకట సాయి, మనోజ్ చౌదరి, నీరజ వారి కుటుంబీకులు రు.1,00,501ల విరాళాన్ని శనివారం అందించారు. అలాగే విజయవాడకు చెందిన కొడాలి సుబ్బారావు, వారి కుటుంబసభ్యులు రు.1,01,116ల విరాళం ను వారి కుమార్డు కొడాలి నగేష్‌బాబు పేరిట అందించారు.

దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, మెమంటో అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలందించారు.

# ఎపిఎస్ ఆర్టీసి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడుగా గుడిసె దేవానంద్

## ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎవి రాజు



నూతనంగా ఎన్నికయిన పీఎస్ఆర్టీసీ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం,సభ్యులు


**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె దేవానంద్ ను ఎన్నుకున్నట్లు ఆ సంస్థ జనరల్ సెక్రటరీ ఏవీ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం స్థానిక రైల్వే ఎస్సీ, ఎస్టీ అసోషియేషన్ హాలులో జనరల్ సెక్రటరీ ఏవీ రాజు అధ్యక్షన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జనరల్ సెక్రటరీ ఏవీ రాజు మాట్లాడుతూ రాష్ట్ర సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా గౌరవ అధ్యక్షులుగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె దేవానంద్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. 09 జనవరి 2026 న ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 36 వ వార్షిక సమావేశాన్ని విజయవాడలో నిర్వహిస్తున్నట్లు సమావేశం తీర్మానించిందన్నారు. అంతేకాకుండా జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా ను ఆ సమావేశానికి అతిధిగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 36 వ వార్షికోత్స వానికి రాష్ట్రంలోని ఎస్సీ,

ఎస్టీ ఉద్యోగులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆహ్వానిస్తున్నా మన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి. రాజ్యలక్ష్మి ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ జేవీ రావు మరియు పీపీ రావు, విజయలక్ష్మి ్మ, టీకే రాజా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పోలవరం - బనకచర్ల నిర్మాణంపై వెనక్కి తగ్గిన ప్రభుత్వం!

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల మధ్య వివాదానికి కారణమైన పోలవరం బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టుకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) రూపకల్పన కోసం పిలిచిన టెండర్లను రద్దు చేసింది. ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలపై స్పష్టత రానప్పటికీ, ఒకవైపు రాష్ట్రంలో ఈ ప్రాజెక్టును సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్షాలు, ప్రజా సంఘాలు, రైతు సంఘాలు వ్యతిరేకిస్తుండటం, మరోవైపు తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వివరాల్లోకి వెళితే.. బనకచర్ల ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని భావించిన ఏపీ ప్రభుత్వం, డీపీఆర్ తయారీ కోసం అక్టోబర్ 11వ తేదీన టెండర్లను ఆహ్వానించింది. టెండర్లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 31వ తేదీని ఆఖరి గడువుగా నిర్ణయించింది. అయితే, తాజాగా ఆ టెండర్లను పూర్తిగా రద్దు చేసింది. ఈ విషయం ఏపీ ప్రభుత్వ ఈప్రొక్యూర్మెంట్ పోర్టల్ టెండర్ స్థితిలో ఖిక్యాన్సి ల్ఖి అని పేర్కొంది. అయితే, ప్రభుత్వం ఇంత వరకు దీనిపై అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణంపై తెలంగాణ ప్రభుత్వం మొదటి నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. తమకు నష్టం వాటిల్లుతుందని వాదిస్తూ కేంద్రం దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లింది. మరోవైపు రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం వామపక్షాలు, ప్రజా సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకించాయి. అయినప్పటికీ ఏపీ ప్రభుత్వం ముందుకే వెళ్లి టెండర్లను పిలిచింది. ఇప్పుడు అకస్మాత్తుగా టెండర్లను రద్దు చేయడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ టెండర్ల రద్దుకు అసలు కారణం ఏమిటనే దానిపై సందిగ్ధత నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలు, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ప్రభుత్వం వెనక్కి తగ్గిందా? లేక డీపీఆర్ తయారీకి ఏ సంస్థ కూడా ఆసక్తి చూపలేదా అనే విషయం తెలియాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి న అవసరం ఉంది. ఇక పోలవరం- బనకచర్ల ప్రాజెక్టు స్థానంలో పోలవరం -నల్లమలసాగర్ అనుసంధానం చేపట్టేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం .ఇందులో భాగంగా తొలుత బొల్లాపల్లి జలాశయానికి నీళ్లు తీసుకెళ్లి అక్కడి నుంచి వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న నల్లమలసాగర్ జలాశయానికి గోదావరి నీళ్ల తరలించాలనేది తాజా ప్రణాళికను ప్రభుత్వం సిద్దం చేసినట్లు సమాచారం.

# రాత్రికిరాత్రి రూ 240 కోట్లకు అధిపతి అయిన భీమవరం వాసి!



**సత్తుపల్లి, నవంబరు 8, ప్రభాతవార్త:** సామాన్య రైతు కుటుంబంలో జన్మించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువకుడు లాటరీ టికెట్ ద్వారా రాత్రికి రాత్రి కోట్లకు అధిపతి అయిన బృహత్తర సంఘ టన వెలుగు చూ సింది. వివరాల్లో కెళితే.. సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూర్ మండలం భీమవరంలో గొల్ల మాధవరావు, తల్లి గొల్ల భూలక్ష్మి ్మ దంపతుల కుటుంబంలో జన్మించిన గొల్ల అనిల్ కుమార్ యేడాదిన్నరగా యూఏఈలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల తన తల్లి పుట్టినరోజు 11 అనే సంఖ్యతో టిక్కెట్టు కొనుగోలు చేసి దుబాయిలో నిర్వహించే లాటరీ దక్కించుకున్నాడు. ఆ దుబాయ్ లాటరీ టికెట్ పేరుతో రాత్రికిరాత్రే 240 కోట్ల రూపాయలు విలువగల లాటరీ టికెట్ తగల డంతో అనిల్‌కుమార్ రాత్రికి రాత్రి జీవితం మారి కోట్లకు అధిపతి అయ్యాడు. యువకుడు ఉద్యోగరీత్యా కొంతకాలంగా యూఏఈలో జీవిస్తున్నట్లు గ్రామ వాసులు తెలిపారు. గ్రామానికి చెందిన యువకుడికి అన్ని కోట్ల రూపాయల విలువైన లాటరీ తగలటంతో గ్రామంలో పలువురు ఆ కుటుంబానికి అభినందనలు తెలిపారు.

# కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో జియోకు 2 ఎకరాలు కేటాయింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 8:** కవ్వాల్ రిజర్వు ఫారెస్ట్‌లో రిలయన్స్ కంపెనీ జియో డిజిటల్ ఫైబర్ ప్రైవేట్ లిమిటెడ్ దాదాపు 2 ఎకరాల అటవీ భూమిని ప్రభుత్వం కేటాయించింది. మంచిర్యాల జిల్లా జిన్నారం అటవీ డివిజన్‌లో ఈ భూమిని ఇచ్చారు. ఆ సంస్థ ఆ భూమిలో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ చేయనుంది. ప్రభుత్వం కొన్ని షరతులతో జీఓ విడుదల చేసింది. కేంద్ర అటవీ నిబంధనలకు లోబడి ఈ భూమిని కేటాయిస్తున్నట్లు వెల్లడించింది.

## చేవెళ్ల రోడ్డుప్రమాద కారకుడు టిప్పర్ డ్రైవర్ ఆకాష్‌కామ్లే

# మద్యం తాగలేదని ఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మిర్జాగూడలో ఈ నెల మూడవ తేదీ ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం అనేక కుటుంబాలను ఛిద్రం చేయడం తెలిసిందే. తాండూరు నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సును చేవెళ్ల నుంచి వికారాబాద్ వైపు ఓవర్ లోడ్ కంకరతో ఓవర్ స్పీడ్‌లో వెళుతున్న టిప్పర్ ఢీకొనడం వల్ల జరిగిన ఈ ఘటనలో మొత్తం 19 మంది మరణించడం విదితమే. మృతుల్లో టిప్పర్ డ్రైవర్ మహారాష్ట్రకు చెందిర ఆకాష్ కామ్లే కూడా వున్నాడు. వాహనం నడిపే సమయంలో అతను మద్యం తాగివున్నట్లు అనుమానాలు రావడంతో అతని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన సమయంలో అతని శరీరంలో ఏమైనా మద్యం ఆనవాళ్లు వున్నాయేమోనని పరీక్షించారు. అనంతరం ఎఫ్‌ఎస్‌ఎల్ నిపుణులను కూడా సంప్రదించారు. నిపుణుల పరీక్షలో కామ్లే మద్యం తాగినట్లు నిర్ధారణ కాలేదు. ఇదే విషయాన్ని సైబరాబాద్ ఉన్నతాధికారులు శనివారం మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. అయినప్పటికీ దీనిపై తుది నివేదిక వచ్చాకే అధికారికంగా ప్రకటిస్తామని వారు వెల్లడించారు.

# సైబర్ నేరగాళ్లు కొట్టేసిన డబ్బులో రూ.5 లక్షలు జప్తు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** ఎపికె ఫైల్ ద్వారా ఓ విశ్రాంత ఉద్యోగిని బురిడి కొట్టించి అతని ఖాతా నుంచి పది లక్షల రూపాయలను కొట్టేసిన సైబర్ నేరగాళ్లకు సైబర్ క్రైం పోలీసులు షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. విశ్రాంత ఉద్యోగి నుంచి కొట్టేసిన డబ్బులో ఐదు లక్షల రూపాయలను సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలలో వుండగా జప్తు చేశారు. వివరాలు ఇలావున్నాయి. ఈ నెల నాలుగవ తేదీన నగరానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యో గి పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆన్‌లైన్ సేవ విభాగంలో తన ఫించన్ కోసం వాకబు చేస్తుండగా కొట్టేసారు.

# దూకుడు పెంచిన హైడ్రా.. 954 కబ్జాల తొలగింపు

## 1,045.12 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ
## వాటి విలువ రూ. 50వేల కోట్ల పైనే..
## ప్రజల మద్దతు మాకు స్ఫూర్తి : హైడ్రా కమిషనర్ రంగనాథ్



**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** సామాజిక మాధ్యమాలు వేదికగా.. వేల ఇళ్లను హైడ్రా కూల్చిందంటూ కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని ర్యాలీలు, ప్రదర్శనల ద్వారా తిప్పి కొట్టిన వారికి హైడ్రా ధన్యవాదాలు తెలిపింది. ప్రజల నుంచి వచ్చిన మద్దతు హైడ్రాకు మరింత స్ఫూర్తినిచ్చింది అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర భవిష్య త్తును దృష్టిలో పెట్టుకొని.. పర్యావరణ హితమైన నగరంలో ప్రజలు మెరుగైన జీవనాన్ని కొనసాగించాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు హైడ్రా పని చేస్తోందని స్పష్టం చేశారు. హైడ్రా వల్ల జరిగిన మేలును వివరిస్తూ.. పెద్దలు, పిల్లలు, మహిళలు, యువకులు ర్యాలీలు నిర్వహించి హైడ్రాకు మద్దతు తెలపడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా వల్ల లక్షల మందికి లాభం చేకూరిందంటూ.. నగరవ్యాప్తంగా జరిగిన మేలును వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి తీరు మాలో స్ఫూర్తిని నింపిందన్నారు. మీడియా సంస్థలతో పాటు.. చాలా వరకు సామాజిక మాధ్యమాలు కూడా హైడ్రా కార్యక్రమా లను ప్రజలవద్దకు చేరవేసిన తీరును అభినందిస్తు న్నామన్నారు.

**చట్టాలను గౌరవిస్తూనే..**
చట్టంలో ఉన్న అక్షరాల వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం, ఆంతర్యం, లక్ష్యం తెలుసుకుని హైడ్రా పని చేస్తోందని రంగనాథ్ తెలిపారు. రాజ్యాంగం, న్యాయస్థానాలు, చట్టాలపైన హైడ్రాకు ఎనలేని గౌరవం ఉందని.. వాటి స్ఫూర్తితోనే ప్రకృతి పరిరక్షణకు పాటుపడుతున్నా మ న్నారు. పేదవారిని అడ్డం పెట్టుకొని బడాబాబులు సాగిస్తున్న కబ్జాలను వెలికి తీస్తుందన్నారు. ధనదాహంతో ఇష్టానుసారం కబ్జాలు చేసి ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్నవారు హైడ్రాపై దాదాపు 700ల వరకూ కేసులు పెట్టారని.. వ్యక్తిగతంగా తనపై కూడా 31 వరకూ కంటెంప్ట్ కేసులు వేశారని గుర్తు చేశారు. చట్టాలను గౌరవిస్తూ.. ప్రజలు ఇచ్చిన స్ఫూర్తితో పర్య వరణాన్ని, ప్రజల ఆస్తులను పరిరక్షిస్తామన్నారు. ప్రభుత్వం దిశానిర్దేశం చేసిన విధంగా చెరువులు, ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కాపాడుతూ ప్రకృతిని పరిరక్షించేందుకు పని చేస్తున్నామన్నారు. 2024 జూలైకి ముందు నుంచే నివాసం ఉన్నవారి ఇళ్ళ జోలికి హైడ్రా వెళ్ళదని స్పష్టం చేశారు. తప్పనిసరి అయి తొలగించాల్సివస్తే వారికి ప్రత్యామ్నాయం, పరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. హైడ్రా ఏర్పాటయిన నాటి నుంచి నేటి వరకు మొత్తం 181 డ్రైవ్స్ నిర్వహించి 954 కబ్జాలను తొలగించామని మొత్తం 1,045.12 ఎకరాల భూమిని హైడ్రా కాపాడిందని.. వీటి విలువ సుమారు ..50,000 కోట్ల నుండి ..55,000 కోట్ల వరకు ఉంటుందన్నారు. ఇందులో ప్రభుత్వ భూములు 531.82 ఎకరాలు కాగా.. రహదారుల కబ్జాలు 222.30 ఎకరాల వరకూ ఉన్నాయి. చెరువుల కబ్జా 233.00 ఎకరాలు, పార్కుల కబ్జాలు 35 ఎకరాలు ఇలా.. మొత్తం 1045.12 ఎకరా లను హైడ్రా స్వాధీనం చేసుకుందన్నారు. వర్షాలు వచ్చిన ప్పుడు కాకుండా.. ముందుగానే జాగ్రత్తలు తీసుకోవ డంతో.. ఈ ఏడాది వరదలు చాలావరకు నియంత్రిం చామన్నారు. క్యాచ్‌పిట్స్ క్లీనింగ్ 56,330, నాళాల క్లీనింగ్ 6,721, నీటి నిల్వ పాయింట్లు క్లియర్ చేయడం 10,692, కల్వర్టు క్లియర్ చేయడ వల్ల 1,928, ఇతర పనులు 21,301 ఇలా మొత్తం 96,972 పనులు హైడ్రా ఈ వర్షాకాలంలో చేపట్టిందన్నారు.

అలాగే రూ. 58.40 కోట్లతో చెరువుల పునరుద్ధరణ చేపట్టామని మొదటి విడతగా చేపట్టిన 6 చెరువుల్లో ఇప్పటికే బతుకమ్మకుంట ప్రారంభమవ్వగా.. తమ్మిడి కుంట (మాధాపూర్), కూకట్‌పల్లి నల్ల చెరువు, పాతబస్తీలోని బమ్‌రుక్ ఉద్‌దౌలా చెరువులు ఈ నెలాఖరుకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సున్నం చెరువు (మాదాపూర్), నల్లచెరువు (ఉప్పల్) చెరువుల పునరుద్ధరణతో వరద ముప్పును తగ్గించామని అంతే కాకుండా చెరువుల ఆక్రమణలను తొలగించి 105 ఎకరాల నుండి 180 ఎకరాలకు పెంచామన్నారు. 75 ఎకరాల భూమి తిరిగి ప్రజలసొంతమయింది. బతుకమ్మకుంట పునరుద్ధరణతో అక్కడ లోతట్టు ప్రాంతాలను, కూకట్‌పల్లి నల్లచెరువుతో చుట్టూ ఉన్న బస్తీలు, తమ్మిడికుంటతో శిల్పారామం ప్రధాన రహదారిపై వరద లేకుండా చేశామని కమిషనర్ తెలిపారు. ప్రాధాన్య క్రమంలో మరిన్నిచెరువులు అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో హైడ్రా పని

# జాతీయస్థాయి క్రీడలకు 59 మంది ఇఎంఆర్ఎస్ విద్యార్థులు

## రాష్ట్రస్థాయి క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్ ఇఎంఆర్ఎస్



రాష్ట్రస్థాయి ట్రోఫీతో విద్యార్థులు, ప్రిన్సిపాల్

**చింతూరు, నవంబరు 8, ప్రభాతవార్త:** చింతూరు మండలం లక్కవరం కేంద్రంగా నిర్వహించ బడు తున్న ఎకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల రాష్ట్రస్థాయి క్రీడల్లో చరిత్ర సృష్టించింది. మొత్తం 28 ఇఎంఆర్ఎస్ పాఠశాలల రాష్ట్రస్థాయి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకొని చరిత్ర సృష్టించింది. అదే పాఠశాలకు చెందిన 59 మంది విద్యార్థినీవిద్యార్థులు ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలోని రూర్‌కేలాలో ఈనెల 10వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి క్రిడలకు ఎంపిక అయ్యారు.

ఎపిలోని మొత్తం 28 ఎకలవ్య మోడల్ పాఠశాలల నుండి జాతీయ స్థాయి క్రిడలకు 428 మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంపికయితే వారిలో చింతూరు ఇఎంఆర్ఎస్ నుంచి 59 మంది విద్యార్థినీవిద్యార్థులు ఎంపిక కావటం మరో విశేషం.అదే పాఠశాలకు చెందిన ప్రధానాచార్యులు డాక్టర్ ధలీప్‌సింగ్‌ను ఎపిలోని ఇయంఆర్‌యస్ పాఠశాలల నుండి ఓవరాల్ కంటిన్‌జెంట్ మేనేజర్‌గా సైతం భాధ్యతలు అప్పగించారు. అల్లూరి జిల్లా మారేడుమిల్లి కేంద్రంగా మొత్తం ఎపిలోని 28 ఇయంఆర్‌యస్ పాఠశాలలకు రాష్ట్రస్థాయి క్రిడా పోటిలను ఈనెల 3నుండి 5వరకు నిర్వ హించారు.

మొత్తం 980 మంది విద్యార్థిని,విద్యార్థులు ఈ క్రిడల్లో పాల్గొనగా చింతూరు ఇఎంఆర్ఎస్ సంగీతం, కళలు, సాహిత్య కార్యక్రమాల్లో 13 బహుమతులు గెలుపొంది రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ సాధిం చింది. దాంతో రాష్ట్రస్థాయి 2025 సాంస్కృతిక, సాహిత్య ఉత్సవం చాంపియన్‌గా ఇఎం ఆర్ఎస్ చింతూరు ఎంపిక అయినట్టు ప్రకటించారు. మన్యంలో మారు మూల ఉన్న పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్ కావటం, జాతీయ స్థాయి పోటీలకు అదే పాఠశాల నుండి 59 మంది విద్యార్థినీ,విద్యార్థులు ఎంపిక కావటం మన్యం ప్రాంతానికే గర్వకారణంగా మారింది.

# రాష్ట్రపతి ద్రౌపదిముర్ముతో కలిసి ఆఫ్రికా వెళ్లిన ఎంపి డికె అరుణ

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి విదేశీ యాత్రలకు బిజెపి ఎంపి డికె అరుణ వెళ్లారు. భారత ప్రతినిధి బృందంలో సభ్యురాలిగా ఆమె ఈ పర్యటనకు ఎంపికయ్యారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణకు ప్రాతినిధ్యం వహించే ఈ కీలక పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా వాణిజ్యం, వ్యవసాయం, సాంకేతికత, సాంస్కృతిక మార్పిడి వంటి కీలక రంగాల్లో భారత్, ఆఫ్రికా దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడంపై ప్రధానంగా చర్చలు జరపనున్నారు. తెలంగాణ మహిళా నాయకత్వాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టేందుకు ఇదొక గొప్ప అవకాశంగా డికె అరుణ భావిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళల పురోగతి, రైతుల సంక్షేమం కోసం ఆమె చేసిన సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.ఈ సందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ, "ప్రపంచ ప్రగతిలో తెలంగాణ పాత్రను మరింత బలంగా నిలబెట్టడమే నా లక్ష్యం. ఈ పర్యటన ద్వారా మహిళలు, రైతులు, యువతకు ఉపయోగపడే అవకాశాలను మన రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తాను" అని తెలిపారు. ఈ పర్యటనతో భారత్ ఆఫ్రికా సంబంధాలు కొత్త దిశగా పయనిస్తాయని, అదే సమయంలో తెలంగాణ ప్రతిష్ఠ అంతర్జాతీయంగా ఇనుమడింప చేస్తుందన్నారు.




# వైఫల్యాల నుంచి తప్పించుకునేందుకు బిజెపిపై నిందలా?

## కాంగ్రెస్‌పై ఎంపి డా.లక్ష్మణ్ ఆగ్రహం

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తన వైఫల్యాల నుంచి తప్పించుకునేందుకు బిజెపిపై నిందలు వేస్తుందని బిజెపి ఎంపి డా.లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాయలంలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మాటల్లో కాంగ్రెస్ ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. ఫ్రస్టేషన్లో ఉన్న సిఎం రేవంత్‌రెడి బిజెపిపై నిందలు వేస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇంటికొక ఉద్యోగం అంటూ.. మీ మిత్రుడు బిహార్లో హామీ ఇచ్చారు. ఏడు కోట్ల మంది ఉన్న బిహార్‌లో ఇంటికొక ఉద్యోగం సాధ్యమేనా? అని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రజలకు మీరిచ్చే గిఫ్ట్ ఏంటో చెప్పాలన్నారు. గతంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ చెట్టాపట్టాలు వేసుకొని అధికారాన్ని పంచుకున్నారని ఆరోపించారు. 20 శాతం ఓట్ల కోసం ఇంకా దిగజారి మాట్లాడితే 80 శాతం ఉన్న ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం అని హెచ్చరించారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపి




శనివారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

## దేశంలో జరుగుతున్న ఓటు చోరీపై రాహుల్‌గాంధీ ఎనలేని పోరాటం

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీస్తూ బిజెపి అవకతవకలకు పాల్ప డుతుం దని పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ తీవ్రంగా విమ ర్శించారు. శనివారం గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జరుగు తున్న ఓటు చోరీలపై రాహుల్‌గాంధీ ఎనలేని పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ఇప్పటివరకు 5 కోట్ల మందికిపైగా ప్రజలు మద్దతు తెలి పారని తెలిపారు. లోక్‌సభతోపాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చేసిన అవకతవ కలను కాంగ్రెస్ ఆధారాలతో సహా నిరూపిస్తుందన్నారు. కర్ణాటకలోని మహదేవ్‌పుర నియోజక వర్గంలో ఓటర్ల జాబితాలో జరిగిన భారీ తప్పి దాలు, బిజెపి మో సాలను రాహుల్ గాంధీ ఆధారాలతో సహ బయట పెట్టినా ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం దురదృ ష్టకర మన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బిజెపి చేసిన కుట్రలను రాహుల్‌గాంధీ స్పష్టమైన రుజువులతో నిరూ పించారని తెలిపారు. హర్యానాలో 25 లక్షలకుపైగా నకిలీ ఓటర్లు, 5 లక్షల డూప్లికేట్ ఓటర్లు, వందలాది తప్పుడు చిరునామాలు, వేలాది తప్పు ఫోటో వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒకే మహిళ ఫోటోతో 22 ఎంట్రీలు, 100 ఓటరు కార్డులు ఉన్నట్టుగా రాహుల్ గాంధీ నిర్ధారణ చేశారని చెప్పారు. బీహార్‌లో బిజెపి సహకారంతో సర్ పేరుతో సంబంధం లేని ఓట్లను తొల గించిందని విమర్శించారు. ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా అభివర్ణించారు. ఎన్నికల సంఘం ప్రస్తుతం బిజెపి చెప్పుచేతుల్లో ఉందని, ఏకపక్షంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాహుల్ గాంధీ బీహార్‌లో ప్రారంభించిన ఓటు అధికార్ ర్యాలీ బిజెపిలో వణుకు పుట్టించిందని మహేష్‌గౌడ్ అన్నారు. హర్యానా ఫార్ము లాను అనుసరించి బిజెపి ఇప్పుడు బీహార్‌లో గెలవాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. జూబ్లీహిల్స్ నియో జకవర్గంలో గతంలో పక్క జిల్లాల ఓటర్లను నమోదు చేసి, బిజెపి సహకారంతో బిఆర్ఎస్ గెలిచిన ఉదాహరణ ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన ఓటు చోరీలను ప్రజలు అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందిరా గాంధీ ఏనాడు అవకతవకలకు పాల్పడలేదు. ఓటు హక్కు కాలరాసే హక్కు ఎవరికీ లేదు అని మహేష్‌గౌడ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, అల్లం భాస్కర్, హనుమంతురావు, లింగం యాదవ్, గజ్జి భాస్కర్

# పత్తి 7 క్వింటాళ్ల కొనుగోలు పరిమితి ఎత్తేయాలి

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పత్తి ఎకరానికి 7 క్వింటా ళ్లను మాత్రమే కొనుగోలు చేయాలనే నిబంధనను ఎత్తి వేయాలని వ్యవ సాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సిఎండి లలిత్ కుమార్‌గుప్తాతో మాట్లాడినట్లు మంత్రి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే 20 తేమశాతం ఉన్న పత్తి కొనేవిధంగా చర్యలు తీసుకుని, ఎకరానికి 12 క్వింటాళ్ల వరకు పరిమితి ఇవ్వాలన్నారు. అంతేకాకుండా కాపాస్ కిసాన్ యాప్ రాత్రి 10 గంటల సమయంలో మాత్రమే ఓపెన్‌గా ఉండడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. యాప్‌ను 24 గంటలు అందుబాటులో ఉంచేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినట్లు ప్రకటనలో వెల్లడించింది. జిన్నింగ్ మిల్లర్ల, రైతుల విన్నపం మేరకు అన్ని మిల్లులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని సీసీఐని మంత్రి కోరినట్లు వెల్లడించింది. కాగా యాచారం ప్రాంతంలో రైతులు పండించిన పంటల కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.5 లక్షల టన్నుల యూరియా బఫర్ స్టాక్ నిల్వ ఉండగా, ఈ నెలలో 2 లక్షల టన్నులు, వచ్చే నెలలో మరో 2 లక్షల టన్నుల యూరియా కేటాయింపులు జరిగినట్లు తెలిపారు. యూరియా సరఫరా త్వరగా జరిగేలా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. మ్యొంథా తుఫాన్ వల్ల జరిగిన పంట నష్టంపై సర్వే నివేదిక వివరాలు వెంటనే అందించాలన్నారు.

# ఎన్టీపిసి ద్వారా 84,849 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

### ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** దేశ విద్యుత్ అవసరాల్లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) కీలకంగా ఎదుగుతోందని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి) చందన్ కుమార్ సమాంత అన్నారు. ఎన్టీపీసీ ఆడిటోరియంలో నిర్వహించిన సంస్థ 51వ ఆవిర్భావ వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడుతూ. దేశానికి కరెంట్ కొరతను తీర్చడంలో సంస్థ అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. ప్రస్తుతం ఎన్టీపీసీ దేశంలో 108 ప్లాంట్ల ద్వారా 84,849 మెగావాట్ల కరెంట్ ఉత్పత్తి చేస్తోందన్నారు. వీటిలో బొగ్గు, గ్యాస్, హైడ్రో, సౌర మరియు పవన విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయని వివరించారు. ఐదు దశాబ్దాలుగా దేశానికి వెలుగులను అందిస్తూ ప్రపంచ అగ్రగామి సంస్థగా ఎన్టీపీసీ వెలుగొందుతోందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి ఎన్టీపీసీ చేయూతనందిస్తుందన్నారు. పారిశ్రామిక, గృహ అవసరాలకు విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. దేశంలో నాలుగో వంతు విద్యుత్‌ను ఎన్టీపీసీ సంస్థ నిరంతరాయంగా అందిస్తుందన్నారు. 2032 నాటికి 150 గిగావాట్ల లక్ష్యంతో కొత్త ప్రాజెక్టులను ఏర్పాటుకు కృషి చేస్తోందని తెలిపారు. మరోపక్క తెలంగాణలో సౌర, పవన విద్యుత్ రంగాలలో పెటు బడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడించారు. ఇక 2023-24 ఆర్థిక సంవత్సరంలో 400 బిలియన్ యూనిట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా విద్యుత్ ఉత్పత్తితో పాటు అనేక సామాజిక కార్య క్రమాల్లో పాల్గొని అన్ని విభాగాల్లో ఎన్నో అవార్డులు అందుకొందన్నారు. పర్యావరణ పరిరక్షణకు లక్షలాది మొక్కలు

# ఫీజు బకాయిల పోరాటం కాలేజీ యాజమాన్యాల కోసం కాదు

### ముఖ్యమంత్రి ప్రకటనపై ఎంపి ఆర్.కృష్ణయ్య వివరణ

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** ఫీజుల రీయింబర్స్‌మెంట్ కోసం బీసీలు చేస్తున్న పోరాటం కాలేజీ యాజమాన్యాల కోసంకాదని, విద్యార్థుల కష్టాలు బాధలు తీర్చడం కోసం చేస్తున్నానని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'కృష్ణన్న యజమాన్యాల ఉచ్చులో పడకు' అంటూ చేసిన వ్యాఖ్యాలపై ఆయన వివరణ ఇచ్చారు. '50 యేళ్ల నుంచి ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థుల చదువుల కోసం పోరాడుతున్నాను. ఫీజుల రీయింబర్స్‌మెంట్ స్కీమ్ కోసం 2004-08 వరకు అనేక పోరాటాలు చేశాను. చివరకు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి అప్పుడు సిఎం రాజశేఖర్‌రెడ్డి స్పందించి, మంత్రివర్గ ఉపసంఘం నిర్మించి, వారితో చర్చించి ఈ పథకం ప్రవేశపెట్టారు. అప్పటినుంచి ఈ పథకం కింద లక్షలాదిమంది విద్యా ర్థులు పైసా ఖర్చు లేకుండా ఉన్నత విద్య చదువుచున్నారు. ఈ స్కీం ప్రవేశ పెట్టినప్పుడు జీవో జారీ చేసిన జీవో నం, 8, 50లపైన నా పేరు రిఫరెన్స్‌లో ఉంది' అని అన్నారు. 'ఫీజుల రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల నిధులు విడు దల చేయ డంలో ప్రభుత్వ జాప్యంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. వారి బాధలు చూసి స్పందించి ఉద్యమాలు చేస్తున్నామన్నారు. ఫీజులు కట్టాలని విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నారు. చదువులు పూర్తయిన ఫీజులు లేక సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు వచ్చినవారికి అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకుం టున్నారు. సర్టిఫికెట్లు తీసుకోలేక కొందరు ఉద్యోగాలు కోల్పోతున్నారు. విదేశాలకు చదువుకోవడానికి సీట్లు వచ్చిన వారికి కూడా సర్టిఫికెట్లు లేక వెళ్లలేకపోతున్నారు' అని కృష్ణయ్య పేర్కొన్నారు.

# గంజాయి సేవిస్తూ ఈగల్ పోలీసులకు పట్టుబడిన హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రగ్స్ భరతం పట్టేందుకు ఏర్పాటైన ఈగల్ (పూర్వపు టి.నాబ్) నగరంలోని ఓ ప్రముఖ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజిలో చదువుతున్న ఆరుగు రు విద్యార్థులు పార్టీలో గంజాయి సేవిస్తుండగా పట్టుకుంది. పట్టుబడ్డ ఆరుగురు విద్యార్థులను పున రావాస కేంద్రానికి తరలించారు. దీనిపై నార్కోటిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబం ధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాం డిల్యా శనివారం మీడియాకు వెల్లడించారు. బేగంపేట్‌లోని క్యులినరీ అకాడమి ఆఫ్ ఇండియా అనే కాలేజిలో హోటల్ మేనేజ్‌మెంట్‌లో చివరి సంవత్స రం చదువుతున్న 11 మంది విద్యార్థులు శుక్రవారం రాత్రి కాళాశాల ప్రాంగణంలో పార్టీ చేసుకున్నారు. అయితే ఈ పార్టీలో కొందరు విద్యార్థులు గ ంజాయి సేవిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దాడి చేశారు. 11 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా ఇందులో సా క్షి ఎమాలియ (22), మోహిత్ షాహి (21), కరోలినా రావత్ (27), అరిక్ జనాథన్ అంటోని (21), లాయ్ బారువ (22)లు గంజాయి సేవించినట్లు తేలింది. ఈ పరీక్షలు విద్యార్థుల కుటుంబీకుల సమక్షంలోనే నిర్వహించారు. దీనిపై నార్కోటిక్ పోలీసులు కేసు నమోదు చేసి గంజాయి సేవించిన ఆరుగురిని వెంటనే ఎర్రగడ్డలోని పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ కేంద్రంలో వీరంతా కొన్ని రోజుల పాటు వుండాల్సి వుంటుంది. అక్కడ పూర్తిగా ఆరోగ్యవంతులయ్యే వరకు వుండాల్సి వుంటుంది.

ఒకవేళ ఈ కేంద్రంలో ఏదైనా గొడవలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమి నల్ కేసులు నమోదు చేస్తారు. కాగా ఆరుగురిలో మోహిత్ గతంలో పలుమార్లు డ్రగ్స్ సేవిస్తూ దొరికిపోయినట్లు ఈగల్ పోలీసులు తేల్చారు. ఇతని పై కఠిన నిఘా వుంచాలని నిర్ణయించారు. వీరికి ఎస్ఆర్ నగర్‌కు చెందిన జాసన్ అనే వ్యక్తి గంజాయి అమ్ముతున్నట్లు తేల్చిన ఈగల్ పోలీసులు అ తని కోసం గాలింపు చేప ట్టారు. ఈ ఘటనలో కాలేజి యాజమాన్యం నిర్లక్ష్యం వుండడంతో దానిపైనా విచారణ చేబట్టారు. గతంలో ఇదే కాలేజికి చెందిన కొందరు విద్యార్థులు డ్రగ్స్ సేవిస్తూ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసు లకు పట్టుబడడంతో తాజా ఘటనను ఈగల్ పోలీసులు తీవ్రంగా పరిగణించారు.

విద్యార్థుల విషయంలో తల్లిదండ్రుల నిఘా వుండాలని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు. తమ పిల్లలు ఏం చేస్తునా న్నరనే దానిపై తల్లి దండ్రులు నిరంతరం గమనిస్తూ వుండాలని ఆయన కోరారు. లేకుంటే పిల్లల భవిష్యత్తు పాడవుతుందని ఆయన తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం వున్నా వెంటనే 1908 లేదా 8712671111కు ఫోన్‌చేసి తెలపాలని ఆయన కోరారు. డ్రగ్స్ నిర్మూలన లో అందరి సహకారం కావాలని సందీప్ శాండిల్యా కోరారు.

# యువతలో బ్రహ్మసమాజం జ్ఞానదీప్తిని వెలిగించాలి

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ




సమావేశంలో మాట్లాడుతున్న గరవ్నర్ జిష్ణుదేవ్‌వర్మ తదితరులు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** బ్రహ్మ అనేది ప్రతి చోటా ఉన్న పరమాత్మ తత్వం, మనలో, మన చుట్టూ, సృష్టిలో ప్రతి అణువులో బ్రహ్మతత్వం ఉందని గ్రహించడం ఆధ్యాత్మిక బోధనలో మొదటి అడుగు అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. హైదరాబాద్ దక్కన్ బ్రహ్మసమాజం ఆధ్వర్యంలో శనివారం కాచిగూడ లోని మున్నూరుకాపు భవన్‌లో 134వ ఆల్ ఇండి యా బ్రహ్మో కాన్ఫరెన్స్ జరిగింది. ఓం ఏకమే వాద్వితీయం అనే ఆధ్యాత్మిక సందేశాలతో కార్య క్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ బ్రహ్మ సమాజం వంటి మానవతా, ధార్మిక ఆలోచనలను ముందుకు తీసుకెళ్తున్న సంస్థల్లో యువతరం చురుకుగా పాల్గొని సూచించారు. సమాజ సేవ, నీతి, ధర్మం, జ్ఞానం ఇవన్నీ మన దేశానికి బలమైన పునాద న్నారు. 'వర్క్ ఈజ్ వర్షిప్' పని అంటేనే పూజ అని స్వామి వివేకానంద చెప్పిన మాటలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ధర్మం అంటే కేవలం ఆచారం కాదు. అది సత్యం, కర్తవ్యబోధ, నైతికతతో నిండిన సజీవమైన జీవన విధానం అని అన్నారు. విశ్వభారతి విశ్వ విద్యాలయం భారత ఆధ్యాత్మి కత, జ్ఞానం, సంస్కృతికి ప్రతీకగా నిలిచిందని. బ్రహ్మ సమాజం కూడా అదే భావజాలాన్ని సమాజంలో వ్యాప్తి చేస్తోందని ఆయన అభినందించారు. బ్రహ్మ సమాజం యువతలో ఆత్మవిశ్వాసం. సేవాభావం, జ్ఞానదీప్తిని వెలిగించే వేదికగా నిలవాలని గవర్నర్ ఆకాంక్షించారు. బ్రహ్మ సమాజం ఆధ్యాత్మిక తత్వాలు సమానత్వం, మానవతా సిద్ధాంతాలను ప్రోత్సహించడమే బ్రహ్మ సమాజం ప్రధాన ఉద్దేశమని హైదరాబాద్ డెక్కన్ బ్రహ్మ సమాజ్ అధ్యక్షులు కేశవ్ చందు చల్ల, ఆల్ ఇండియా బ్రహ్మో కాన్ఫరెన్స్ కమిటీ చైర్పర్సన్ డి. అభిగన్య. అధ్యక్షురాలు రేఖ శహాణి, సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ బ్రహ్మ సమాజ్ అధ్యక్షుడు డాక్టర్ వుడై పి. కృష్ణ, కార్యదర్శి అనిరుద్ రక్షిత్ తెలిపారు. బ్రహ్మ సమాజం స్థావకులాలోచనలను స్మరించుకుంటూ సమాజ సేవలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. బ్రహ్మ సమాజం అనేది కేవలం ఒక తమ ఉద్యమం కాదని, ఇది మనిషిని మనిషిగా చూడడం, సమానత్వం. ప్రేమ. నీతి, జ్ఞానం అనే విలువలపై ఆధారపడి ఉన్న ఆధ్యాత్మిక స్ఫూర్తి ఉద్యమం అని వారు అన్నారు. 19వ శతాబ్దం లో రాజా రామ్మోహన్ రాయ్ స్థాపించిన ఈ బ్రహ్మ సమాజం దేశంలో సామాజిక సంస్కరణలకు పునాది వేసిందన్నారు. నేటి కాలంలో కూడా బ్రహ్మ సమాజం ఆత్మ, నైతికత, విద్య, సాంఘిక సమానత్వం వంటి విలువలను మళ్లీ ప్రజల్లో నాటించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. యువతరం ఆలోచనలో సత్యం, సౌమ్యత, మానవత్వం నాటే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మ సమాజం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు. రెండు రోజులపాటు ఈ సదస్సు జరుగుతుందని

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తేనే అభివృద్ధి

### ప్రతిపక్షం గెలిస్తే ధర్నాలు.. రాస్తారోకోలే : కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), నవంబరు 8, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే అభివృద్ధి చేస్తాడని అపోజిషన్ గెలిస్తే ధర్నాలు, రాస్తా రోకో లకే పరిమితం అవుతారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శనివారం యూ సుఫ్‌గూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలే కరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిపించుకోవాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రెండు సంవత్సరాలు గడిచాయని మరో మూడేళ్ల అధికారంలో ఉంటమాని రాబోయే మరో ఐదేళ్ల కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి స్థానికులు, విద్యా వంతులు రెండుసార్లు పోటీచేసిన అనుభవం ఉందని అలాంటి యువనాయకుడిని ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ద్వారా రాష్ట్రముఖ్య మంత్రి కావాల్సిన అంత నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తారన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉండి ఎలాంటి అభివృద్ధి చేయలేదని తెలిపారు. తమ అభ్యర్థి పైనా, అతని తండ్రిపైనా కేటీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారం చేస్తున్నారని వారిని దగ్గర పరిశీలిస్తే వాళ్లు ఎలాంటి వాళ్లో అర్థమవుతుందన్నారు. కేటీఆర్ రాజకీయ ఉనికి కోసం ప్రయత్నిస్తున్నాడని అందుకు జూబ్లీహిల్స్ ఎన్నికలను ఉపయోగించు కోవాలని చూస్తున్నారన్నారు. హైడ్రాను బూచీగా చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారని జూబ్లీహిల్స్‌లో ఏ ఒక్క ఇల్లు కూల్చలేదన్నారు. బాధ్యతలేని సోషల్ మీడియాను నమ్మి మోసపోకండి అని సూచించారు.

# గుర్తింపు పొందిన స్కూళ్ల సమస్యల పరిష్కారానికి కృషి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), నవంబరు 8, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధి లోని గుర్తింపు పొందిన పాఠశాలలు సమస్య లను పరిష్కరిం చాలంటూ రికగనైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలిసి వారి సమస్యలపై పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా పాఠశాలలపై ప్రొఫెషనల్ ట్యాక్స్ (వృత్తి పన్ను) విషయమై, ట్రేడ్ లైసెన్స్‌లపై మంత్రికి విన్నవించుకోగా పాఠశాలలు స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు వాణిజ్య పన్ను చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని అదేవిధంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా సొసైటీ ద్వారా నడుస్తున్న పాఠశాలలకు ట్రేడ్ లైసెన్స్ వర్తించదని ఆయనకు వర్తించదని వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి కమిటీ సభ్యుల సమక్షంలోనే వాణిజ్య పన్నుల కమిషనర్‌కు ఫోన్‌లో మాట్లాడి ఈ సంవత్సరం నుంచి పాఠశా లల యాజ మాన్యాలు స్వచ్ఛందంగా రిజిస్టర్ చేసుకుని పన్ను చెల్లిస్తారని తెలిపారు. అదేవిధంగా ట్రేడ్ లైసెన్స్ ల విషయంలో కూడా తగిన విధంగా వారికి సహకరించాలని సూచిం చారు. బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించడంలో ఆర్ ఎస్ఎమ్‌ఏ మరోసారి విజయం సాధించడంతో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అగస్టీన్, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి క్వాజా కుద్బుద్దీన్, ఎమ్ఎస్ ప్రసాద్, కేఏమ్ అసీఫ్ అలీ, దస్తగిరి ఖాన్, ఏ శ్రీకాంత్‌రాజు, ఎల్ సుధాకర్, ఎమ్ ఆర్ దేవీ ప్రసాద్, ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు పొందిన పాఠశాలల సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ కమిటీ సభ్యులు.

# మినరల్స్ తవ్వకంలోకి ఖనిజాభివృద్ధి సంస్థ

### అనుమతి కోసం సర్కార్‌కు ప్రతిపాదనలు

### రాష్ట్రంలో గ్రానైట్, సున్నపురాయి నిక్షేపాలు గుర్తింపు

### ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న ప్రైవేటు సంస్థలు

### సొంతంగా తవ్వకాలు జరపాలని సంస్థ నిర్ణయం

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** తెలంగాణలో మినరల్స్ తవ్వకాలను చేపట్టేందుకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఖనిజ అభి వృద్ధి సంస్థ ప్రస్తుతం ఒక్క ఇసుక విక్రయాలు మాత్రమే నిర్వహిస్తుండగా, మిగిలిన ఖనిజాలను టెండర్ల పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు కేటాయిం పులు చేస్తోంది. అయితే అనుమతి పొందిన సం బంధిత కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతూ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నట్లు సంస్థ గుర్తించింది. దీంతో ఇసుకతో పాటు, ఇతర ఖనిజాలను కూడా సంస్థ ద్వారా చేపట్టాలని నిర్ణ యించింది. ఈ నేపథ్యం లో దీనికి సంబంధించిన ప్రతిపాద నలను ఖనిజ అభివృద్ధి సంస్థ అధికా రులు ప్రభుత్వానికి సమ ర్పించారు. రాష్ట్రం లో ఇసుకతో పాటు, డోలమై ట్, గ్రానైట్, సున్నపు రాయి, మార్బుల్, మైకా తదితర ఖనిజాల నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వం నుండి అనుమతి వచ్చినట్లయితే వీట న్నింటినీ ఇక నుండి సొంతంగానే తవ్వకాలు జరిపాలని అధికారులు నిర్ణ యించారు. కాగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీగా గ్రానైట్, సున్నపు రాయి నిల్వలు ఉన్నట్లు బయటపడింది. ఈ మేరకు తెలంగాణ ఖనిజా భివృద్ధి సంస్థ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించింది.

ఈ పరీక్షల్లో రాష్ట్రంలోని 5 జిల్లాల్లో గ్రానైట్, సున్నపు రాయి నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. ప్రధానంగా కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గ్రానైట్ నిల్వలు భారీగా ఉన్నట్లు తేల్చింది. కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు, ఖమ్మం జిల్లాలో కొత్తగట్టు, నమిలికొండ, వెంతడుప, తాళ్లపూసపల్లె తదితర ప్రాంతాల్లో 83.25 హెక్టార్ల విస్తీర్ణంలో 28,400 క్యూబిక్ మీటర్లలో తెలుపు, బ్రౌన్, నలుపు రకాలకు చెందిన గ్రానైట్ నిల్వలు ఉన్నాయి. అదేవిధంగా నల్లగొండ, సూర్యాబాద్, వికారాబాద్ జిల్లాల్లో సున్నపు రాయి నిక్షేపాలు ఉన్నట్లు కనుగొంది. ఆయా జిల్లాల్లోని సూర్యాపేట్ జిల్లాలోని మేళ్లచెర్వు, మఠంపల్లి, రఘునాథపాలెం, రామాపురం, దొండపాడు, నల్లగొండ జిల్లా తామరచెర్ల, వికారాబాద్ జిల్లా మల్కాపూర్, జివాంగి ప్రాంతాల్లో 276.83 కిలోమీటర్ల విస్తీర్ణంలో సున్నపు రాయి నిల్వలు ఉన్నట్లు గుర్తించింది. ఈ మేరకు వీటికి సంబంధించిన తాజాగా నివేదికను ఖనిజాభివృద్ధి సంస్థ ప్రభుత్వానికి సమర్పించింది. ఇదే సమయంలో ఈ నిక్షేపాలను తవ్వేందుకు అను మతి ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది.

# దుండిగల్‌లో వివాహిత దారుణహత్య

### అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్ (దుండిగల్), నవంబరు 8, ప్రభాతవార్త:** వివాహితను గొంతు కోసి హత్యకు పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌జిల్లా, తిమ్మాపూర్‌కు చెందిన సుజాత(30)దంపతులు జీవనోపాధి కోసం నగరానికి వచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాది క్రితం దంపతుల ఇరువురి మధ్య గొడవలు చోటు చేసుకోవడంతో సుజాత తన పిల్లలతో కలిసి భర్తకు దూరంగా బహాదూర్‌పల్లిలోని గ్రీన్‌హిల్స్ కాలనీలో ఇంటిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటుంది. ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ పిల్లలను పోషించు కుంటుంది. ఈ క్రమంలో ఆమెకు ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడి కొంతకాలంగా సన్నిహి తంగా ఉంటున్నారు. గత పదిరోజులుగా వీరి ఇరువురి మధ్య తగాదాలు జరుగుతున్నాయి. శనివారం సుజాత ఇంట్లో దారుణ హత్యకు గురైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరు కొని ఆధారాలు సేకరించారు. సిసి కెమెరాలు ఉండడంతో పుటేజీలను పరిశీలి స్తున్నారు. మృతురాలితో సన్నిహితంగా ఉంటున్న వ్యక్తికి సంబంధించిన వారే హత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు.



సుజాత (ఫైల్)

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో భయం మొదలైంది

### బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 8:** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాల అనంతరం తన పదవికి గండం పొంచి ఉందనే భయం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో మొదలైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత జగదీశ్ రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి మానసికస్థితి దెబ్బతిన్న ట్లుందని అందుకే సందర్భం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శిం చారు. ముఖ్యమంత్రిని చూసి సిగ్గే సిగ్గుపడేలా ఉందని వ్యాఖ్యా నించారు. నగరంలో నిఘా పెట్టేందుకు కేసీఆర్ కమాండ్ కంట్రోల్ నిర్మిస్తే, రేవంత్‌రెడ్డి అదే కమాండ్ కంట్రోల్‌లో కూర్చొని తమపై నిఘా పెడుతున్నారని మండిపడ్డారు. ప్రగతిభవన్‌లో బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు, కమాండ్ కంట్రోల్, సచివాలయం అంశాలపై కమిషన్ వేయవచ్చు కదా అని ప్రశ్నించారు. ప్రగతి భవన్‌లో ఎన్ని గదులు ఉన్నాయో చూడటానికి రావాలని సూచించారు. హైదరాబాద్ అభివృద్ధి అజెండా పైనే జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు వేయబోతున్నారని జగదీశ్ రెడ్డి అన్నారు. దేశంలో ఎవరూ తిట్టని విధంగా వైఎస్‌ను, సోనియా గాంధీని రేవంత్ రెడ్డే తిట్టారని ఆరోపించారు. ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలను ఎన్ని రోజులు భయపెడతారని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదని జోస్యం చెప్పారు. రేవంత్ రెడ్డి చేసే తప్పులను చరిత్ర క్షమించదని అన్నారు. రేవంత్ రెడ్డి తన నోటి దురుసుతనం కారణంగా బీహార్ నుంచి వెళ్లగొట్టే పరిస్థితి తెచ్చుకున్నారని అన్నారు. బీహార్ ఎన్నికల ప్రచారానికి రేవంత్ రెడ్డిని కాదని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని పిలిపించుకున్నారని గుర్తు చేశారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఇద్దరు పదవుల్లో ఉన్నారు కాబట్టే వారిని బ్యాడ్ బ్రదర్స్ అని కేటీఆర్ అన్నారని వ్యాఖ్యానించారు. వారిద్దరూ మోదీ శిష్యులేనని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, హైదరాబాద్ అభివృద్ధి బాధ్యతను రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలని సూచించారు. మాగంటి గోపీనాథ్ తల్లితో ఎవరు మాట్లాడిస్తున్నారో తెలుసని అన్నారు. రేవంత్ రెడ్డి ఓటమి భయంతో చేసే పనుల్లో ఇదీ ఒకటని విమర్శించారు. రేవంత్‌రెడ్డి డ్రగ్స్ మత్తులో మాట్లాడు తున్నారని విమర్శించారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక డ్రగ్స్ సంబంధత నేరాలు ఎక్కువయ్యాయని అన్నారు. పోలీసు కమిషనర్లే నేరాల రేటు పెరిగిందని చెప్పారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి భాషతో తెలంగాణ పరువు పోతోందని, ఇప్పటికైనా ఆయన తనతీరు మార్చుకోవాలని హితవు పలికారు.



దొంగతనం జరిగిన దుకాణం పరిశీలిస్తున్న డిఐ బాల్‌రెడ్డి

# జ్యుయెలరీ షాపులో చోరీ

### 15 కిలోల వెండి అపహరణ

**హైదరాబాద్ (దుండిగల్), నవంబరు 8, ప్రభాతవార్త:** గుర్తుతెలియని వ్యక్తులు జ్యుయెలరీ షాపులో వెండి ఆభరణాలు దొంగలించిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ, భౌరంపేట పరిధి ఒక్రిడ్జ్ స్కూల్ సమీపంలో మోతుర్కార్ సోమేశ్వర్ అనే వ్యక్తి సోమేశ్వర జ్యుయెలరీ పేరుతో బంగారు, వెండి ఆభరణాల దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి సోమేశ్వర్ దుకాణం మూసి వెళ్లాడు. శనివారం ఉదయం దుకాణం తెరిచి చూడగా ఓవైపు గోడకు రంధ్రం ఉండడంతో పాటు వెండి ఆభరణాలు కనిపించ లేదు. దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఘటనాస్థలికి చేరుకున్న క్లూస్‌టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. దుకాణంలోని 15 కేజీల వెండి ఆభరణాలను దొంగలించ బడినట్లు సోమేశ్వర్ పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# కొబ్బరిపాలతో వంటలు


కొబ్బరి కమ్మదనం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందేం ఉంది?! కూర, రసం, చారుల్లో కొన్ని పాలు చేర్చామంటే వాటి రుచి రెట్టింపైపోతుంది. అంతేనా.. వీటితో కొబ్బరన్నం, పాయసం, బిస్కెట్లు ఇలా ఎన్నెన్నో వంటలు చేయొచ్చు. మహత్తరమైన మరి కొన్ని కొబ్బరిపాల రెసిపీలు మీ కోసం..

## కేక్



**కావలసినవి..** పంచదార అర కప్పు, మిల్క్ పౌడర్ అర కప్పు, నెయ్యి 3 టేబుల్‌స్పూన్లు, తాజా కొబ్బరి తురుము కప్పు, పిస్తా పలుకులు 2 చెంచాలు, కొబ్బరి పాలు అర కప్పు **తయారీ..** ప్యాన్‌లో పంచదార, అర కప్పు నీళ్లు పోసి మరిగించాలి. నాలుగు నిమిషాల తర్వాత మిల్క్ పౌడర్, కొబ్బరి పాలు జతచేసి కలుపుతూ.. ఇంకో మూడు నిమిషాలు చేయాలి. చిక్కగా అయ్యాక నెయ్యి, కొబ్బరి తురుము వేసి కలపాలి. మరో నాలుగు నిమిషాల తర్వాత సెగ తీయాలి. ఈ మిశ్రమాన్ని బటర్ పేపర్ పరిచి, నెయ్యి రాసిన పళ్లెంలోకి తీసి సమంగా సర్దాలి. పైన పిస్తా పలుకులు, కాస్త కొబ్బరి తురుము చల్లి.. ఓ గంట ఫ్రీజర్లో ఉంచాలి. బయటకు తీసి ముక్కలుగా కోసుకుంటే సరిపోతుంది..

## పాస్తా...



**కావలసినవి....** టొమాటో గుజ్జు కప్పు, తుంచిన బ్రోకలీ పూలు అర కప్పు, వెల్లుల్లి రెబ్బలు కొబ్బరిపాలు అర లీటర్, ఉప్పు రుచికి తగినంత, మిరియాల పొడి అర చెంచా, ఉల్లిపాయ ముక్కలు అర కప్పు, పాస్తా 400 గ్రాములు, చిల్లీ ఫ్లేక్స్ చెంచా, ఆలివ్ నూనె 2 టేబుల్ స్పూన్లు, చీజ్ తరుగు 2 చెంచాలు, పుదీనా ఆకులు ఏడెనిమిది **తయారీ...** వెల్లుల్లిని సన్నగా తరగాలి. పాస్తాను తెర్లుతున్న నీళ్లలో వేసి ఉడికించి, ఆ నీళ్లు వడకట్టి పక్కనుంచాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. ఉల్లిపాయ ముక్కలను కాస్త వేయించి.. సగం వెల్లుల్లి తరుగు వేయాలి. అందులో టొమాటో గుజ్జు, బ్రోకలీ, చిల్లీ ఫ్లేక్స్ జోడించి మీడియం సెగ మీద కలియతిప్పుతుండాలి. రెండు నిమిషాల తర్వాత ఉప్పు, మిరియాల పొడి జతచేయాలి. మధ్యమధ్యలో కలియబెడుతూ పన్నెండు నిమిషాలు ఉడికించి దించాలి. చల్లారాక గ్రైండ్ చేసి... మళ్లీ ప్యాన్‌లో వేసి, రెండు కప్పుల నీళ్లు, కొబ్బరిపాలు, పాస్తా వేసి దగ్గరగా ఉండే వరకు ఉడికించాలి. చివర్లో మిగిలిన వెల్లుల్లి తరుగు వేసి కలియబెట్టి సెగ తీయాలి. పుదీనా, చీజ్ చల్లి.. వేడివేడిగా ఆస్వాదించండి.

## ఐస్‌క్రీమ్



కావలసినవి: తాజా క్రీమ్ కప్పు, మొక్కజొన్న పిండి 4 టేబుల్ స్పూన్లు, కొబ్బరిపాలు 1 కప్పులు, కొబ్బరి తురుము, పంచదార కప్పు చొప్పు తయారీ.. కొబ్బరితురుములో కొబ్బరిపాలు అర కప్పు, మొక్కజొన్న పిండి వేసి పక్కనుంచాలి. ప్యాన్‌లో మిగిలిన కొబ్బరిపాలను వేడిచేయాలి. అందులో పంచదార జోడించి మధ్యమధ్యలో కలియతిప్పుతుండాలి. నాలుగైదు నిమిషాల తర్వాత మొక్కజొన్న పిండి కలిపిన కొబ్బరిపాలు జతచేసి కలియబెడుతూ చిక్కగా అయ్యాక సెగ తీయాలి. చల్లారాక మరో పాత్రలోకి తీసి అల్యూమినియం ఫాయిల్‌తో కప్పేసి ఆరేడు గంటలు ఫ్రీజర్‌లో ఉంచాలి. బయటకు తీసి మెత్తగా అయ్యేవరకూ గ్రైండ్ చేసి మళ్లీ ఇందాకటి పాత్రలో వేసి.. అల్యూమినియం ఫాయిల్ చుట్టి.. నాలుగైదు గంటలు ఫ్రీజర్‌లో ఉంచాలి. అంతే నోరూరించే కొబ్బరి ఐస్క్రీమ్ తయారైపోతుంది.

## బర్ఫీ..



**కావలసినవి ...** ఫుల్ క్రీమ్ పాలు, కొబ్బరిపాలు 2 కప్పుల చొప్పున, పంచదార అర కప్పు, యాలకుల పొడి పావు చెంచా, నెయ్యి 2 చెంచాలు, పిస్తా, బాదం పలుకులు గుప్పెడు, కుంకుమ పువ్వు కొద్దిగా **తయారీ..** అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో పాలు, కొబ్బరిపాలను వేడిచేయాలి. మీడియం సెగ మీదుండి.. నిమిషానికోసారి కలియతిప్పుతుండాలి. నాలుగు నిమిషాల తర్వాత పంచదార, పిస్తా పలుకులు, కుంకుమ పువ్వు, బాదం పలుకులు జోడించి. ఇక కలుపుతూనే ఉండాలి. కొంచెం చిక్కబడ్డాక.. యాలకుల పొడి వేసి మరింత గట్టిపడే వరకూ ఉంచి సెగ తీసేయాలి. చల్లారాక ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన పళ్లెంలోకి తీసి సమంగా సర్దాలి. నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కోసుకుంటే.. తియ్యటి బర్ఫీ తిని ఆనందించవచ్చు. □

# ఆమె పరిశోధనకు కోట్ల బహుమానం




**కోరుకున్న చదువు, మంచి ఉద్యోగం! కానీ విధుల్లో భాగంగా ఆమెకు ఎదురైన సంఘటన ఆమె ఆలోచనలో పడేసింది. దాంతో పరిశోధనకు వెళ్లారు. ఏళ్ల తరబడి దానికి అంకితమయ్యారు. తాజాగా ఆ కృషికిగానూ ప్రతిష్ఠాత్మక 'మ్యాక్ ఆర్థర్' ఫెలోషిప్ అందుకున్నారు... థెరెసా పుతుస్సెరి!**

చదువు పూర్తయ్యాక ఓ ఆసుపత్రిలో ఆప్టోమెట్రిస్ట్‌గా చేరారు థెరెసా. తన వద్దకు ఓ 20 ఏళ్లబ్బాయి చూపు తగ్గుతోందంటూ వచ్చాడు. అతనికి 'రెటినైటిస్ పిగ్మెంటోసా' అని తేలక ఆలోచనలో పడ్డారామె. ఇంత చిన్న వయసులో చూపుకోల్పోతే అతని భవిష్యత్తేంటి అనుకున్నా... దీనికి పరిష్కారం కనుక్కోవాలి అనుకున్నారు. పరిశోధనల వైపు వెళ్లారు. భారతీయ సంతతికి చెందిన ఈమె చిన్నప్పుడే ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే. ఇంట్లో తండ్రికి చిన్న బయాలజీ ల్యాబ్ ఉండేది. స్కూలు నుంచి రాగానే నాన్నతోపాటు దానిలోకి వెళ్లడం, జీవశాస్త్ర అంశాలను అధ్యయనం చేయడం ఆమెకు ఇష్టమైన వ్యాపకం. దానివల్లే ఆరోగ్య రంగాన్ని ఎంచుకున్నారు థెరెసా. మానవ మెదడు, ఇంద్రియ వ్యవస్థలపై ఆసక్తితో 'ఆక్యులర్ థెరప్యూటిక్స్'లో పీజీ చేసి, ఆప్టోమెట్రిస్ట్‌గా మారారు.

రిసెర్చ్ వైపు వెళ్లాలనుకున్నాక ఉద్యోగాన్ని వదిలి, న్యూరోసైన్స్‌లో పిహెచ్ చేశారు. ఒరెగాన్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ పూర్తిచేసి... ప్రస్తుతం ఆప్టోమెట్రీ అండ్ విజన్ సైన్స్లో అసోసియేట్ ప్రొఫెసర్గా చేస్తున్నారు. దానితోపాటే కంటి సమస్యలు, దృష్టి లోపానికి గల కారణాలపై లోతుగా అధ్యయనం చేస్తున్నారు. మెరుగైన కంటి చూపు రెటీనాపైనే ఆధారపడి ఉంటుంది. కానీ, రెటినైటిస్ పిగ్మెంటోసా, వయసు పెరుగుతున్న కొద్దీ వచ్చే కంటి సమస్యలు రెటీనాపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా దృష్టిలోపల బారిన పడుతున్నారు. అయితే వీటికి సరైన చికిత్స లేదు. ఈ అంతరాన్ని తొలగించాలన్నదే నా ప్రయత్నం అంటారీమె. ఇదే కాదు, ఇతర పరిశోధకులతో కలిసి 'మూన్‌షాట్' అనే ప్రాజెక్ట్ చేస్తున్నారు థెరెసా. తన పరిశోధనలకు గుర్తింపుగా మ్యాక్ ఆర్థర్ జీనియస్ గ్రాంట్‌కి ఎంపికయ్యారు. వివిధ రంగాల్లో విశేష పరిశోధనలు చేసినవారికి 'మ్యాక్ ఆర్థర్ ఫౌండేషన్' ఈ ఫెలోషిప్ అందిస్తుంది. ఈ ఏడాదికిగానూ 22 మందిని ఎంపిక చేయాలి... భారత సంతతికి చెందినవారు థెరెసా ఒకరే. దీనికి దాదాపు రూ.7 కోట్లు అందుకోనున్నారామె. ఈ ప్రతిష్ఠాత్మక ఫెలోషిప్‌కి ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. ఈ నగదు కంటి సమస్యలపై అధ్యయనానికే వినియోగిస్తా. బాధితులు తిరిగి కంటిచూపు పొందేలా కొత్త చికిత్సలు అందజేయడమే నా లక్ష్యం అంటోన్న ఈమెను అభినందించాల్సిందే! □

# ప్రార్థిస్తే..ఫలితం తప్పనిసరి



'అంతట ఏలీ–నీవు క్షేమముగా వెళ్లుము, ఇశ్రాయేలు దేవునితో నీవు చేసికొనిన మనవిని ఆయన దయచేయును గాక అని ఆమె(హన్నా)తో చెప్పగా..'(1 సమూయేలు 1:17). ఏలీ దేవుడి మందిరంలో ఉండే యాజకుడు. హన్నా పిల్లలు లేక బాధపడుతున్న స్త్రీ. షిలోహులో ఉన్న దేవుడి వద్దకు వచ్చి, తనకు సంతానం ఇవ్వాలని ప్రార్థన చేసుకున్నది. అదే విషయం ఆమె ఏలీకి చెప్పింది. తాను దేవుడికి మొఱపెట్టుకుంటున్నట్లుగా చెప్పడంతో ఏలీ పైవిధంగా సమాధానం ఇచ్చాడు. అన్నట్లుగానే దేవుడు ఆమె ప్రార్థన విని, సంతానాన్ని ఇచ్చాడు. నిజమే కదా! మనం కూడా దేనిగురించి అయినా ప్రార్థన చేస్తే, దేవుడు తప్పనిసరిగా సమాధానం ఇస్తాడు. హన్నా కూడా మనలాంటి సామాన్యమైన గృహిణే. సంతానం కోసం ప్రార్థిస్తే ఆ ఫలాన్ని పొందింది. మనం కూడా నిజమైన విశ్వాసంతో ప్రార్థన చేస్తే, దేవుడు తప్పనిసరిగా జవాబు ఇస్తాడు. అయితే ప్రార్థనలో మనకు పట్టుదల ఉండాలి. ఇలాంటి విశ్వాసం, పట్టుదలతో దేవుడిని వేడుకుందాం..

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# ఒత్తిడిని తగ్గించే జాబితా



ఆర్గనైజ్డ్ ఉండాలని కోరుకొని మహిళలు ఉంటారా! రేపేం చేయాలో ముందు రోజు రాత్రే ఆలోచిస్తారు. కొందరికైతే వారానికి సరిపడా ప్రణాళిక ఉంటుంది. ఉద్యోగినులకైతే లక్ష్యాలు, డెడ్‌లైన్ల పేరుతో నెల మొత్తానికి చేయాల్సిన పనులు సిద్ధంగా ఉంటాయి. వీట నిలబడి 'టు డు లిస్ట్' అని రాసుకుంటారు చాలామంది మహిళలు. ప్రణాళిక ఉంది కాబట్టి, పని సులువవుతుంది. అనుకుంటారు. కానీ క్షేత్రస్థాయిలో ఇది ఇచ్చే ఒత్తిడి చాలా ఎక్కువంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఈరోజు చేయాల్సిన పనులివి అంటూ లిస్ట్ రాసుకున్నాక అవి పూర్తయ్యేదాకా నిద్రపోరు. విశ్రాంతి తీసుకోరు. సమయం లేదు. పూర్తిచేయాల్సిన పనులు ఇంకా చాలానే ఉన్నాయి అంటూ తిండి తినరు. రాసుకున్న పనుల్లో ఏ కొన్ని మిగిలిపోయినా వాటి గురించే ఆలోచిస్తూ నిద్రకూ దూరమవుతారు. వీటన్నింటి ఫలితమే ఉత్పాదకత తగ్గిపోవడం, మానసిక సమస్యలు. రోజువారీ పనులను జాబితాలా రాసుకొని... ప్రణాళికాబద్ధంగా ఉండటం మంచి విషయమే కానీ... అది ఆందోళనా, ఒత్తిడికి కారణమవుతుంటే దాన్ని విస్మరించడమే మేలు చెప్తారు. మానసిక నిపుణులు. బదులుగా'పూర్తయిన పనుల జాబితా' అని కూడా అంటారు. రోజుని ఖాళీ కాగితంతో ప్రారంభించండి... పూర్తి చేసిన పనులను ఒక్కొక్కటిగా అందులో చేర్చమంటున్నారు. దీనివల్ల అసంపూర్తి అన్న అంశమే ఉండదు. పైగా ఇవి విజయాలుగా కనిపించి సానుకూల దృక్పథాన్ని పెంచుతాయట. □

# కాటన్ కొత్తగా ఉండాలంటే..

నచ్చిందని కనిపించిన డ్రెస్ నల్లా కొనేవాళ్లు చాలామందే. కానీ, వాటిని ఏళ్లు గడుస్తున్నా "త్తవాటిల్లా మన్నికగా ఉంచేవాళ్లు మాత్రం కొద్దిమందే. ముఖ్యంగా హుందాత నాన్నీ, ఒంటికి సౌకర్యాన్ని తెచ్చిపెట్టే విషయంలో ఇంకాస్త ఎక్కువగా శ్రద్ధ పెట్టాలి.



✦ నూలు దుస్తులు ఎక్కువ రోజులు మన్నికగా ఉండాలంటే... ప్రతిసారీ డ్రైవాష్ ఇస్తే స్తే చాలనుకుంటారు చాలామంది. అలా అయితే, ఈ విధానంలో వాడే రసాయనాలు కాటన్‌లోని సహజ తేమను తొలగిస్తాయి. దీంతో అవి త్వరగా చినిగిపోయే అవకాశం ఉంటుంది.

✦ వీటిని ఎప్పుడూ వేడి నీటిలో నానబెట్టకూడదు. గోరువెచ్చని లేదా చల్లటి నీళ్లల్లో మాత్రమే ఉతకాలి. అప్పుడే కుంచించుకుపోకుండా, వెలిసిపోకుండా ఉంటుంది. ✦ చాలా వరకు వీటిని గాఢత తక్కువగా ఉండే డిటర్జెంట్‌లో పదిహేను నిమిషాలు నానబెట్టి సున్నితంగా ఉతకండి. అయితే, ఇలాంటప్పుడు రంగులు, ఇతర రకాల దుస్తులను కలపొద్దు. 3.కాటన్ దుస్తులు లేకుండా ముఖ్యంగా చీరలు ముడతలు ఆరేయడం మంచిది. తీగల మీద కాకుండా నేలమీద ఆరేస్తేనే మేలు. ఐరన్ చేసేటప్పుడు కాసిని నీళ్లు చల్లుతూ చేయాలి. ప్యాడెడ్ హ్యాంగర్లు వాడితే ముడతలు రాకుండా ఉంటాయి.

✦ గంజి పెట్టడం ఓ కళ. కాటన్ దుస్తులకు ఇది ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌వేర్ ఉపయోగపడుతుంది. లీటర్ నీటికి కప్పు గంజి కలిపి పదినిమిషాలైనా నాకుంటుంది. సువాసన కోసం ఆ నీటిలో ఓ చుక్క ఎసెన్షియల్ ఆయిల్ కలిపితే చీరలు సువాసనలు వెదజల్లుతాయి. అప్పుడే రంగు కోల్పోకుండానూ ఉంటాయి. ఐరన్ చేసినా చక్కగా నిలబడతాయి. □

# తెర

## నవ్వుల విందు సినిమా



సెన్సేషనల్ మత్తువదలరా కాంబినేషన్ మరోసారి అలరించబోతోంది. కల్ట్ హిట్ అయిన మత్తు వదలరాతో తో దర్శకుడిగా పరిచయమై, ఆ తర్వాత మరో బ్లాక్‌బస్టర్ సీక్వెల్ మత్తువదలరా 2 విజయాన్ని అందుకున్న రితేష్ రానా తన నాల్గవ డైరెక్షనల్ మూవీని ప్రకటించారు. యూనిక్ స్టయిల్ నరేషన్ తో ఆకట్టుకునే రితేష్ రానా మరోసారి సత్యతో జతకడుతున్నారు. ఇది ప్రేక్షకులకు మరో నవ్వుల విందును అందిస్తుంది. ఈ చిత్రాన్ని క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 4గా చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. మత్తు వదలరా ఫ్రాంచైజీలో భాగమైన వెన్నెల కిషోర్, అజయ్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్రలు పోషిస్తున్నారు. అఫీషియల్‌గా చిత్రాన్ని ప్రకటిస్తూ, మేకర్స్ ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. రితేష్ రానా గత హిట్లకు పని చేసిన కోర్ టెక్నికల్ టీం ఈ సినిమాకి వర్క్ చేస్తుంది. సంగీతం కాల భైరవ, సినిమాటోగ్రఫీ సురేష్ సరంగం, ఎడిటింగ్ కార్తిక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైన్ నార్ని శ్రీనివాస్.

## కుంభ ఫస్ట్ లుక్ విడుదల




ఎస్.ఎస్.రాజమౌళి, మహేష్ బాబు సినిమా నుంచి పృథ్వీరాజ్ సుకుమారన్ గ్లోబల్ ట్రాటర్ ఈవెంట్‌కి ముందు పర్ఫెక్ట్ గిఫ్ట్‌బాహుబలి ఫ్రాంఛైజీ, ట్రిపుల్ ఆర్‌తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న సినిమా గ్లోబల్ ట్రాటర్ ఈవెంట్ అత్యంత ఘనంగా జరగనుంది. ప్రియాంక చోప్రా ఈ సినిమాలో నాయికగా నటిస్తున్నారు. భారతదేశం గర్వించదగ్గ సినిమాగా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు రాజమౌళి.. ఏమాత్రం దయాదాక్షిణ్యం లేని, కరడుగట్టిన, కమాండింగ్ ప్రతి నాయకుడి పాత్రలో కుంభగా కనిపి స్తున్నారు పృథ్వీ రాజ్ సుకుమారన్. హైటెక్ వీల్ చెయిర్ లో న్యూ ఏజ్ విలన్ గా ఫస్ట్ లుక్‌లోనే మెప్పిం చేశారు పృథ్వీరాజ్ సుకుమారన్. రాజమౌళి, మహేష్ బాబు మోస్ట్ యాంబిషి యస్ వరల్డ్ బిల్డింగ్ వెంచర్ గ్లోబ్ ట్రాటర్. ఎన్నో ఏళ్లుగా ప్రేక్షకులు అత్యంత ఆసక్తితో ఎదురు చూసిన వెంచర్ ఇది. నవంబర్ 15న రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగే ఈవెంట్ మీద అంచనాలు విపరీతంగా పెరుగుతూనే ఉన్నాయి. రాజమౌళి తన పోస్టులో..

## 'సైక్ సిద్ధార్థ' కొత్తగా ఉంది




నందు, వరుణ్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి, స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ 'సైక్ సిద్ధార్థ' మ్యాడ్లీ హ్యూమరస్ టీజర్ రిలీజ్, డిసెంబర్ 12న ఆసియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్స్ ద్వారా గ్రాండ్ రిలీజ్ యంగ్ హీరో శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ 'సైక్ సిద్ధార్థ'కు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్ తో వస్తున్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. దర్శకుడు వరుణ్ రెడ్డి ఒక యువతను దృష్టిలో ఉంచుకుని కథను రూపొందించాడు, శ్రీ నందు పాత్రను హై ఎనర్జీతో ఎంటర్టైనింగ్ చేశారు. ఈ టీజర్ హ్యూజ్ బజ్‌ను సృష్టిస్తుంది, డిసెంబర్ 12న సైక్ సిద్ధార్థ గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సినిమా ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా విడుదల కానుంది. మార్కెటింగ్‌ను రానా స్పిరిట్ మీడియా నిర్వహిస్తుంది. టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో శ్రీ నందు మాట్లాడుతూ.. ఈ సినిమా, ఈవెంట్ మాకు చాలా స్పెషల్. ఈ సినిమా మీ అందరికీ నచ్చి మా టీమ్ అందరు జీవితంలో వెలుగు నిండాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ .. అందరికీ హాయ్. చాలా కొత్తగా అనిపించే సినిమా ఇది. సురేష్ బాబు గారు రానా గారు చాలా సపోర్ట్ చేశారు. ఈ టైటిల్ కథకి పర్ఫెక్ట్ యాప్ట్. ఈ సినిమా ఎలా ఉండబోతుందో ప్రమోషన్స్ లో చాలా క్లియర్‌గా చెప్పబోతున్నాము. యామిని మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఇది మాకు చాలా స్పెషల్ ఫిలిం. మా టీమ్ అందరు చాలా నమ్మకంతో చేశాం.

## 'సంతాన ప్రాప్తిరస్తు'14న రిలీజ్



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా "సంతాన ప్రాప్తిరస్తు". ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా ఈ నెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు దర్శకుడు సంజీవ్ రెడ్డి.

మా మూవీని కొంతమంది ప్రొడ్యూసర్స్ ప్రివ్యూ చూశారు, బాగుందని చెప్పారు. మేల్ ఫెర్టిలిటీ ఇష్యూను మా కథలో చూపించడం వల్ల వాళ్లు ఎక్కడా ఇబ్బంది పడలేదు. ఆ విషయం మాతో చెప్పారు. అలాగే యూఎస్ కు ప్రింట్స్ పంపినప్పుడు అక్కడ ప్రింట్స్ కోసం వర్క్ చేసే ఆపరేటర్స్ మూవీ చూసి బాగుంది, మా ఫ్యామిలీతో వెళ్లి చూస్తామని జెన్యూన్ గా చెప్పడం హ్యాపీగా అనిపించింది. మా సినిమా ద్వారా ఒక సమస్యపై అవగాహన కల్పిస్తున్నాం, ఒక చిన్న మెసేజ్ కూడా ఉంటుం "సంతాన ప్రాప్తిరస్తు" సినిమాలో లవ్ స్టోరీ ఉంటుంది, ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి, ఎంటర్ టైన్ మెంట్ ఆకట్టుకుంటుంది. ఈ ఎలిమెంట్స్ అన్నీ ఉన్న కథలో చిన్న ఇష్యూను కూడా చూపిస్తున్నాం. ఈ కథలో హీరోయిన్ గా తెలుగమ్మాయి అయితేనే బాగుంటుందని చాందినీ చౌదరిని తీసుకున్నాం. మ్యారీడ్ వుమెన్ గా నటించడానికి ఆమె ఏమాత్రం సందేహించలేదు. మా సినిమాను ఇప్పటిదాకా చూసిన వాళ్లంతా అప్రిషియేట్ చేశారు. ఆ మార్పు తెచ్చేందుకు మొదటి అడుగు మా సినిమా అవుతుందని ఆశిస్తున్నాం.

## 'బా బా బ్లాక్ షీప్' శరవేగంగా ..



ప్రముఖ నిర్మాత వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్ తెరకెక్కిస్తున్న ట్రెండీ క్రైమ్ కామెడీ సినిమా 'బా బా బ్లాక్ షీప్'. ప్రస్తుతం మేఘాలయలో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. అక్టోబర్‌లో ఈ సినిమా షూటింగ్ మొదలైంది. టిన్ను ఆనంద్, ఉపేంద్ర లిమయే, జార్జ్ మరియన్, రాజా రవీంద్ర, అక్షయ్ లఘుసాని, విష్ణు ఓ అయ్, కార్తికేయ దేవ్, కశ్యప్, విస్మయ, మాల్వి మల్హోత్రా, సమృద్ధి ఆర్యల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మేఘాలయలో సంపూర్ణంగా షూటింగ్ జరుపుకుంటున్న తొలి సినిమా ' బా బా బ్లాక్ షీప్' కావడం గమనార్హం. వేణు దోనేపూడి మాట్లాడుతూ"మా బా బా బ్లాక్‌షీప్ మేఘాలయాలో పూర్తి స్థాయిలో షూటింగ్ చేసుకుంటున్న తొలి చిత్రం. కథ మొత్తం నార్త్ ఈస్ట్ ఇండియాలో సాగుతుంది కాబట్టి, ఇక్కడే చిత్రీకరిస్తున్నాం. కథలోనే ఓ బ్యూటీ ఉంటుంది. జలపాతాలు, కొండలు, అందమైన ప్రదేశాల్లో సాగే కథ ఇది. ఎన్నో చోట్ల రెక్కీ చేసి, మా కథకు మేఘాలయా పర్ఫెక్ట్‌గా సూట్ అవుతుందని ఇక్కడ ఫిక్స్ అయ్యాం అని అన్నారు.

## పాన్ ఇండియా ఫిల్మ్ 'నాగబంధం'



యంగ్ హీరో విరాట్ కర్ణ, అభిషేక్ నామా దర్శకత్వం దర్శకత్వంలో కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న పాన్‌ఇండియా ఎపిక్ మైథలాజికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ నాగబంధంతో అలరించబోతున్నారు. విరాట్ తన పాత్ర కోసం ఎంతో డెడికేషన్‌తో అద్భుతంగా ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. నాగబంధం ఆధ్యాత్మికత, యాక్షన్, విజువల్ స్ప్లెండర్ మిళితమైన ఓ మ్యసీవ్ సినిమాటిక్ జర్నీ. అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం భక్తి, యాక్షన్, మిస్టరీని సమపాళ్లలో కలిపి ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది..ఈ చిత్రంలోని ప్రధాన ఆకర్షణగా నిలవనున్న డివోషనల్ సాంగ్ "ఓం వీర నాగ" ప్రస్తుతం రామానాయుడు స్టూడియోస్‌లో అత్యద్భుతంగా నిర్మించిన శివాలయ సెట్‌లో షూట్ చేస్తున్నారు. సినిమా కథ భారతదేశంలోని ప్రాచీన విష్ణు ఆలయాల నేపథ్యంపై సాగుతుంది. శతాబ్దాలుగా రహస్యంగా కొనసాగుతున్న "నాగబంధం" అనే ఆధ్యాత్మిక సంప్రదాయం చుట్టూ నడిచే ఈ కథ, పద్మనాభస్వామి, పూరి జగన్నాథ్ ఆలయాల ధన నిధుల మిస్టరీల స్ఫూర్తితో వుంటుంది. ఈ చిత్రానికి సౌందర్ రాజన్ సినిమాటోగ్రఫీ, ఆర్ సి ప్రణవ్ ఎడిటర్. నాగబంధం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుంది. ప్రమోషనల్ యాక్టివిటీస్ త్వరలో ప్రారంభం కానున్నాయి.

# టైటిల్ పోరుకు సబలెంకా



**న్యూఢిల్లీ:** సబలెంకా అనిసిమోవాను అధిగమించి డబ్ల్యూటిఏ ఫైనల్స్ టైటిల్‌కు చేరుకుంది. ప్రపంచ నంబర్ వన్ అరినా సబలెంకా 6-3, 3-6, 6-3 తేడాతో అమండా అనిసిమోవాను ఓడించి ఎలెనా రైబాకినాతో ఫైనల్స్ పోరుకు అర్హత సాధించింది. ఇద్దరు క్రీడాకారులు తమ మొదటి బిల్లీ జీన్ కింగ్ ట్రోఫీని లక్ష్యంగా చేసుకుని తలపడనున్నారు. 2022 ఫైనలిస్ట్ సబలెంకా, రెండేళ్ల క్రితం ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌లో తలపడిన విజయంతో సహా, రైబాకినాపై 8-5 హెడ్‌టుహెడ్ రికార్డుతో ఆధిక్యంలో ఉంది. అనిసిమోవాతో ప్రారంభ మ్యాచ్‌లలో కఠినమైన పోటీ తర్వాత, ఇటీవల జరిగిన యుఎస్ ఓపెన్ ఫైనల్‌లో సబలెంకా 5-3 ఆధిక్యంలోకి దూసుకెళ్లి, గంటలోపు తొలి సెట్‌ను కైవసం చేసుకోవడంతో ఆమెకు అనుకూలంగా మారింది. అంతకుముందు ఐదు బ్రేక్ పాయింట్లను కాపాడుకున్న న్యూయార్క్ ఛాంపియన్, రెండవ సెట్‌లో అనిసిమోవా మొదటి నాలుగు గేమ్‌లను తిరిగి ఆడటంతో వెనుకబడిపోయింది. మూడో సెట్‌లో సబలెంకా వరుసగా ఏస్‌లు కొట్టి 3-3తో ఆధిక్యంలో నిలిచింది. తర్వాతి గేమ్‌లో భారీ బ్యాక్‌హ్యాండ్ విన్నర్‌తో నిర్ణయాత్మక బ్రేక్‌ను సాధించి తన అమెరికన్ ప్రత్యర్థిని ఓడించింది. అంతకుముందు రైబాకినా జెస్సికా పెగులాను 4-6, 6-4, 6-3 తేడాతో ఓడించి, కింగ్ సౌద్ యూనివర్సిటీ స్పోర్ట్స్ అరీనాలో అద్భుతమైన రికార్డుతో ఫైనల్‌కు చేరుకుంది. రైబాకినా చేసిన 25వ అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్ కారణంగా 31 ఏళ్ల పెగులా తొలి స్టాంజాను దక్కించుకుంది, కానీ తదుపరి సెట్‌లో ఆమె 1-4 తేడాతో వెనుకబడి ఉండటంతో అకస్మాత్తుగా జోరు మారింది. పెగులా సమం చేయడానికి తీవ్రంగా ప్రయత్నించింది. కానీ 10వ గేమ్‌లో రైబాకినా గట్టిగా స్పందించి నిర్ణయాత్మక పోరాటంలో మళ్ళీ బ్రేక్‌లను మార్చుకుంది. ఎనిమిదో గేమ్ చివరిలో పెగులా నుండి ఫోర్‌హ్యాండ్ నెట్‌లోకి వెళ్లడంతో రైబాకినా ఆధిక్యాన్ని తిరిగి పొందింది, ఆమె తదుపరి గేమ్‌లో నిలుపుకుని తన అజేయ పరుగును కొనసాగించిన విజయాన్ని ఖాయం చేసుకుంది.



హాంగ్‌కాంగ్ సిక్సెస్ నుంచి

# భారత్ ఔట్

## కువైట్ చేతిలో సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** కువైట్, యూఏఈ చేతిలో భారత్‌కు వరుస ఓటములు ఎదురై హాంగ్ కాంగ్ సిక్సెస్ టోర్నీ నుంచి ఔట్ అయింది. క్రికెట్‌లో టీమ్ఇండియాపై పసికూన కువైట్ 27 పరుగుల తేడాతో ఓడించింది. క్రికెట్‌లో పటిష్ఠమైన భారత్‌ను చిన్న దేశమైన కువైట్ ఓడించడం సంచలనం అయింది. కాంగ్ వేదికగా జరుగుతున్న హాంగ్ కాంగ్ సిక్సెస్ 2025 టోర్నీలో భారత్ మాజీ ఆటగాడు దినేష్ కార్తిక్ నేతృత్వంలో బరిలోకి దిగింది. ఈ టోర్నీలో భాగంగా భారత్ శనివారం పసికూన కువైట్‌ను ఢీ కొట్టింది. ఈ మ్యాచ్‌లో భారత్‌కు షాక్ తగిలింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన చూపించిన కువైట్ భారత్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. కువైట్ జట్టు కెప్టెన్ యాసిన్ పటేల్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన కువైట్ నిర్ణీత 6 ఓవర్లలో 5 వికెట్లకు 106 పరుగులు చేసింది. కెప్టెన్ యాసిన్ పటేల్ (58 నాటౌట్ ) సెంచరీతో చెలరేగగాడు. బిలాల్ తాహీర్ (25 పరుగులు) రాణించాడు. టీమ్ఇండియా బౌలర్లలో మిథున్ 2, స్టువర్ట్ బిన్నీ, నదీమ్, దినేశ్ కార్తీక్ తలో 1 వికెట్ తీశారు. అనంతరం ఛేజింగ్‌లో భారత్ 5.4 ఓవర్లలో 79 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ దినేశ్ కార్తీక్ (8 పరుగులు), అభిమన్యు మిథున్(26 పరుగులు, 9 బంతుల్లో), షెహ్‌బాజ్ నదీమ్ (19), ప్రియాంక్ పాంచల్ (17) ఫెయిల్ అయ్యారు. కువైట్‌తో మ్యాచ్ అనంతరం భారత్, యూఏఈని ఢీ కొట్టింది. అయితే ఈ మ్యాచ్‌లోనూ టీమ్ఇండియా ఓడడం గమనార్హం. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 6 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. మిథున్ (50), దినేష్ కార్తిక్ (42) రాణించారు. అనంతరం యూఏఈ 5.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసి నెద్దింది. ఈ ఓటమితో భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.



# భారత్‌దే టి20 సిరీస్

## ఆస్ట్రేలియాపై తీర్చుకున్న ప్రతీకారం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాపై టీమిండియా ప్రతీకారం తీర్చుకుంది. టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుని సత్తా చూపించింది. టీ20 సిరీస్‌లో భాగంగా శనివారం రోజున చివరి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 2-1 తేడాతే టీమిండియా సొంతం చేసుకుంది. తొలి టీ20 కూడా వర్షార్పణం కాగా, మెల్‌బోర్న్ వేదికగా జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. అనంతరం మూడు, నాలుగు టీ20ల్లో కంగారులను చిత్తు చేసిన భారత్ జట్టు సిరీస్‌లో 2-1తో ముందజ వేసింది. ఆ తర్వాత కీలకమైన ఐదో టీ20 శనివారం వర్షం కారణంగా రద్దు కావడంతో సిరీస్ భారత్ కైవసమైంది. చివరి మ్యాచ్‌లో ఆట నిలిచిపోయే సమయానికి భారత్ 4.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 52 పరుగులు చేసింది. తొలుత ఉరుములు, మెరుపులు రావడంతో ఆటను నిలిపేశారు. ఆ తర్వాత భారీ వర్షం కూడా తోడవడంతో మ్యాచ్‌ను అంపైర్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఎంపికయ్యాడు. అభిషేక్ ఈ సిరీస్ అసాంతం అద్భుతమైన ప్రదర్శన కనపరిచాడు. నాలుగు మ్యాచ్‌ల్లో 159.09 స్ట్రైక్ రేటుతో 140 పరగులు చేశాడు. కాగా అంతకు ముందు వన్డే సిరీస్‌ను 2-1 తేడాతో మార్ష్ సొంతం చేసుకున్నాడు.

# రాత్రికి రాత్రే సూపర్ స్టార్లు

## రిచ్ లీగ్ ఐపిఎల్‌తో కోట్లల్లో సంపాదన.. టాప్ 10లో రోహిత్ నం.1



**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అత్యంత రిచ్ లీగ్‌గా నిలిచిన ఐపీఎల్‌తో రాత్రికి రాత్రే సూపర్ స్టార్లుగా మారిన క్రికెటర్లు కోట్లు సంపాదించుకుంటున్నారు. ఇప్పటివరకు జరిగిన 18 సీజన్ల ఐపీఎల్ చరిత్రలో అత్యధికంగా సంపాదించిన టాప్10 ప్లేయర్లలో హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ అగ్రస్థానంలో ఉన్నాడు. 2008 నుంచి 2025 వరకు అతని మొత్తం ఆదాయం రూ.178.6 కోట్లుగా ఉంది. ముంబై ఇండియన్స్‌కు కెప్టెన్‌గా 5 ఐపీఎల్ టైటిళ్లు అందించిన రోహిత్ టోర్నీ ప్రారంభంలో డెక్కన్ ఛార్జర్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 2011లో ముంబైలో చేరిన తర్వాత అతని విలువ క్రమంగా పెరిగింది. తర్వాత స్థానంలో ఉన్న ఎంఎస్ ధోని నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ 5 సార్లు ఛాంపియన్‌గా నిలిచింది.

ఐపీఎల్‌లో అతడు రూ.176.84 కోట్లు సంపాదించాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్ ధోనీనే. ఇక తొలి నుంచి ఆర్సీ బెంగళూరుకే ప్రాతినథ్యం వహిస్తున్న విరాట్ కోహ్లీ రూ.173.2 కోట్లు వెనుకేసుకున్నాడు. మిస్టర్ ఐపీఎల్ సురేశ్ రైనా 2008 నుంచి 2021 వరకు రూ.110.74 కోట్లు సంపాదించాడు. చెన్నై సూపర్ కింగ్స్ ఛాంపియన్‌గా నిలవడంతో రైనా కీ రోల్ ప్లే చేశాడు. ఐపీఎల్‌లో ఇటు బ్యాట్‌తో అటు బంతితో చెన్నై సూపర్ కింగ్స్ టీమ్‌లో కీలక పాత్ర పోషించిన ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా రూ.109 కోట్లు గడించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ టీమ్‌లో కీలక ప్లేయర్‌గా కొనసాగుతున్న వెస్టిండీస్ మిస్టరీ స్పిన్నర్ సునీల్ నరైన్ రూ.107.25 కోట్లు సంపాదించాడు.

ఐపీఎల్ ద్వారా రూ.102.52 కోట్లు సంపాదించిన దక్షిణాఫ్రికా దిగ్గజ ఆటగాడు ఏబీ డివిలియర్స్ సంచలన బ్యాటింగ్‌తో అలరించాడు. ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్ ఐపీఎల్ సమయంలో రూ.94.62 కోట్లు కూడబెట్టాడు. కేకేఆర్‌కు కెప్టెన్‌గా 2 టైటిళ్లు, కోచ్‌గా ఒక టైటిల్ గెలిపించాడు. ఐపీఎల్‌లో వివిధ టీమ్‌లకు ప్రాతినిధ్యం వహించిన టీమిండియా మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ రూ.91.8 కోట్లు సంపాదించాడు. మాజీ వికెట్ కీపర్ దినేష్ కార్తీక్ అనేక జట్ల తరుఫున ఆడిన దినేష్ కార్తీక్ ఐపీఎల్ రూ.86.92 కోట్లు అందుకున్నాడు.



ఫిడే వరల్డ్ కప్‌లో అర్జున్, హారికృష్ణ

# అద్భుత విజయం

## గుకేష్, ప్రజ్ఞా విదిత్ డ్రా

**న్యూఢిల్లీ:** ఫిడే ప్రపంచ కప్ 2025లో భారత్ గ్రాండ్ మాస్టర్లు ఎ అర్జున్, పెంటాల హారికృష్ణ అద్భుత విజయాలు నమోదు చేయగా, డి గుకేష్, ఆర్ ప్రజ్ఞానంద, గుజరాతీ విదిత్ బ్లాక్ తో డ్రా గా ముగించారు. పనాజీలో జరిగిన ఫిడే ప్రపంచ కప్, రౌండ్ 3లో అర్జున్, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన షంసిద్దీన్ వో ఖిడోవ్‌ను కేవలం 30 ఎత్తుగడలలోనే ఓడించి టోర్నమెంట్‌లో తన అజేయ పరుగును పెంచుకున్నాడు. మొదటి రౌండ్‌లో బై పొందిన 21 ఏళ్ల ఈ యువకుడు ఇప్పుడు వరుసగా మూడు విజయాలు సాధించాడు. ప్రారంభం నుంచే ఖచ్చితమైన నియంత్రణను ప్రదర్శిస్తూ, అర్జున్ విజేత స్థానంలో తన సమయాన్ని వెచ్చించి క్లీన్ ఫినిషింగ్‌ను లెక్కించాడు. ఆత్మవిశ్వాసంతో నాల్గవ రౌండ్‌కు ఒక అడుగు దగ్గరగా వెళ్ళాడు. ప్రారంభంలో హారికృష్ణ రౌండ్ 3లో బెల్జియంకు చెందిన డేనియల్ దర్ధాను 25 ఎత్తుగడలలో ఓడించి విజయం సాధించిన తొలి ఆటగాడిగా నిలిచాడు. 39 ఏళ్ల అతను సిసిలియన్ క్లాసికల్ వేరియేషన్‌ను ఉపయోగిస్తూ, తన ప్రత్యర్థిని అయోమయానికి గురి చేశాడు. అలాగే గుకేష్, ప్రజ్ఞానంద, విదిత్ బ్లాక్ పావులతో డ్రాల్లో నిలకడగా ఉన్నారు. ఇతర భారతీయ పోటీదారులలో, గుకేష్ జర్మనీకి చెందిన ఫ్రెడెరిక్ స్వాన్నేతోను, ప్రజ్ఞానంద అర్మేనియాకు చెందిన రాబర్ట్ హోవన్నిస్యాన్‌తో డ్రా చేసుకున్నారు. విదిత్ అమెరికన్ గ్రాండ్ మాస్టర్ సామ్ షాంక్లాండ్‌తో పాయింట్‌ను పంచుకున్నాడు. ఈ ముగ్గురూ ఇప్పుడు తిరిగి వచ్చే ఆటలను తెల్లటి పావులతో ఆడతారు.

# వాణిజ్యం

# డిజిటల్ గోల్డ్‌పై జరజాగ్రత్త సుమా!

## ఇన్వెస్టర్లకు సెబీ అలర్ట్..



**న్యూఢిల్లీ, నవంబరు 8:** బంగారంలో పెట్టుబడులకోసం ఇటీవలికాలంలో డిజిటల్ గోల్డ్‌పైనే ఎక్కువ ఆధారపడుతున్నారు. ఇంటినుంచే కొనుగోలుకు అవకాశం రావడంతో ఈ తరహా కొనుగోళ్లకు ఎక్కువమంది మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ డిజిటల్ లేదా ఆన్‌లైన్‌ఫ్లాట్‌ఫామ్‌లలో లభించే బంగారం ఉత్పత్తులపైఅప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం కూడా ఉందని శనివారం ప్రకటించింది.

కొన్ని డిజిటల్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలు పెట్టుబడిదారులకు డిజిటల్ గోల్డ్ ఇగోల్డ్ ఉత్పత్తులను అందిస్తున్నట్లు మాదృష్టికి వచ్చిందని, బంగారంలోపెట్టుబడికి ప్రత్యామ్నాయంగా డిజిటల్ గోల్డ్ ప్రచారంలోకి వచ్చిందని ప్రస్తుత చట్టాలప్రకారం అవి సెక్యూరిటీలు, కమోడిటీ డెరివేటివ్‌లు కావని వాటికి సెబీ నియంత్రణ వర్తించదని స్పష్టం చేసింది.

సెబీ నిబంధనల వెలుపలే అవి పనిచేస్తాయని, దీనివల్ల సెక్యూరిటీల మార్కెట్‌పరంగా ఇన్వెస్టర్లకు రక్షణ విధానాలు ఏవీ కూడా వర్తింపచేయలేమని వెల్లడించింది. డిజిటల్ గోల్డ్‌లో కౌంటర్‌పార్టీ, నిర్వహణ రిస్క్‌లు పొంచి ఉంటాయని తెలిపింది. సదరు ప్లాట్‌ఫామ్ తిరిగి డబ్బు చెల్లించలేకపోవడం, నిర్వహణ పరమైన ఇబ్బందులకు ఆస్కారం ఉంటుందని తెలిపింది. ఫండ్స్ అందించే ఇటిఎఫ్‌లు, స్టాక్ ఎక్ఛేంజీల్లో ట్రేడ్ అయ్యే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్‌లు వంటివిసెబీ పరిధిలో ఉంటాయని వీటిని రిజిస్టరుఅయిన మధ్యవర్తులనుంచి కొనుగోలుచేసుకోవచ్చని సెబీ సూచించింది.



వచ్చే 3 నెలల్లోనూ

# ఆటోమొబైల్ సేల్స్ వృద్ధి

## జిఎస్టీ తగ్గింపు, గ్రామీణ ఆదాయం వృద్ధి కీలకమని ఫాడా అంచనాలు

**న్యూఢిల్లీ,నవంబరు 8:** భారత్ ఆటోమొబైల్ సేల్స్ వచ్చేమూడునెలల్లో కూడా ఆశాజనకంగా ఉంటాయన్న అంచనాలున్నాయి. జిఎస్టీ రేట్ హేతుబద్ధీకరణ, గ్రామీణుల ఆదాయంలో వృద్ధి వంటి వాటితో వచ్చే మూడు నెలల్లోకూడా కొనుగోళ్లు పెరగవచ్చని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ ఫాడా తెలిపింది. అక్టోబరులో ఆల్‌టైమ్ గరిష్టస్థాయిలో అంటే4.02 మిలియన్ వాహనాలు విక్రయించామని,గత ఏడాదితోపోలిస్తే 40.53శాతం వృద్ధినమోదయిందని చెపుతోంది. జిఎస్టీ 2.0 అమలులోకి వచ్చినతర్వాత గ్రామీణ ఆదాయవనరులు పెరిగాయిన, పెళ్లిళ్ల వంటిశుభకార్యాలయాల సందర్భంగా సీజనల్ డిమాండ్‌కూడా పెరిగిందని చెపుతున్నారు. ఏడాదిచివరిలో ఇచ్చే ఆఫర్లతో పాటు కొత్త సంవత్సర రిజిస్ట్రేషన్లు కూడా పెరుగుతాయని ఫాడా డీలర్ సర్వేప్రకారం 70శాతం వృద్ధి ఉండవచ్చని చెపుతున్నారు. అక్టోబరులో ప్యాసింజర్ వాహనాలు 11శాతం పెరిగి ఐదులక్షలు క్రాస్ అయ్యాయి. టూవీలర్లుకూడా 3.15 మిలియన్ యూనిట్లు సేల్స్‌తో 52శాతం పెరిగాయి. అక్టోబరులో రిటైల్ విక్రయాలు 40.5శాతం వృద్ధినమోదు చేసాయని ఫాడా అధ్యక్షుడు సిఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. 2025లో ఉన్న 42 రోజుల పండుగల కాలంలో మొత్తంగా రిటైల్ వాహనాల విక్రయాలు 21శాతంపెరిగి 5.23 మిలియన్ యూనిట్లువరకూ అమ్ముడుపోయినట్లు ఫాడా చీఫ్ తెలిపారు.

మార్కెట్ విలువల్లో

# జియో 170 బిలియన్ డాలర్లు!

## ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల అంచనాలు

**ముంబయి, నవంబరు 8:** మార్కెట్లలో లిస్టింగ్ అవుతున్న జియో ప్లాట్‌ఫామ్స్ మార్కెట్ విలువలు 170 బిలియన్ డాలర్లుగా ఇన్వస్ట్‌మెంట్ బ్యాంకర్లు విలువలు కట్టడంతో సంస్థ విలువలు మరింతపెరిగాయి. భారత్‌లో ముందెన్నడూ లేనివిధంగా ఐపిఒ ఆఫరింగ్స్ తెస్తోందని కూడా ఇన్వెస్టర్లు చెపుతున్నారు. భారతి ఎయిర్‌టెల్ 143 బిలియన్ డాలర్ల విలువలు కడితే హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు విలువలు 185 బిలియన్ డాలర్లుగా అంచనావేసారు. ఈ మూడు టాప్ కంపెనీలు మార్కెట్ విలువలపరంగా భారత్‌లో దిగ్గజకంపెనీలుగానే కొనసాగుతున్నాయి. అదే జియో మాతృసంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువలు 225 బిలియన్ డాలర్లు అంటే 20 లక్షల కోట్ల రూపాయలుగా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు చెపుతున్నారు. 2026 మొదటి అర్ధభాగంలో జియో ఐపిఒకు వస్తుందని చెప్పినట్లుగానే సంస్థ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు, లీడ్‌మేనేజర్లను సిద్ధంచేసుకుంది. జియో మొట్టమొదటి ఐపిఒయే ప్రపంచ వాణిజ్యంలో రికార్డుస్థాయిలో ఉంటుందన్న అంచనాలున్నాయి. 2006లో రిలయన్స్ పెట్రోలియం ఇదేవిధంగా ఐపిఒ జారీచేసిందని ఇన్వెస్టర్లు అంటున్నారు. జియో ఇప్పటివరకూ వ్యూహాత్మక పెట్టుబడులద్వారా 10 బిలియన్ డాలర్లు ఐదేళ్ల క్రితమే సాధించింది. మెటా, ఆల్ఫాబెట్ వంటి దిగ్గజకంపెనీలు టెక్నాలజీసాయం అందిస్తున్నాయి. పెట్టుబడులు పెట్టాయి. తొలిదశలో సుమారు 6 బిలియన్ డాలర్లకుపైగా ఐపిఒ ఉంటుందని అంచాలున్నాయి. జియోలో 2.5 శాతం ఈక్విటీ తోనే సుమారు 150 బిలియన్ డాలర్లవరకూ పెట్టుబడులు ఆకర్షించవచ్చన్న అంచనాతో ఉంది. ఎగువసర్క్యూట్ విలువలకు వెళితే 4.3 బిలియన్ డాలర్లవరకూ ఉంటుందని అంచనా. సెప్టెంబరునాటికి జియో 50.6 కోట్లమంది కస్టమర్లు ఉన్నారు. సగటు చందారూపంలో జియోకు 211.4 రూపాయలుగా వస్తోంది.






# రూ.13,740.43 కోట్ల ఎఫ్‌పిఐలు విత్‌డ్రా!

**న్యూఢిల్లీ, నవంబరు 8:** విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఈ వారంలో అధికశాతం విక్రయాలు జరిపారు. మార్కెట్లనుంచి 13,740.43 కోట్ల విలువైన పెట్టుబడులు విత్‌డ్రాచేసుకున్నారు. ఈనెల 3 నుంచి ఏడో తేదీవరకూ విత్‌డ్రాల పరంపర కొనసాగిందని ఎన్‌ఎస్‌డిఎల్ గణాంకాలు చెపుతున్నాయి. ఎఫ్‌పిఐలు సోమవారం ఒక్కరోజే 6422.49 కోట్లు వెనక్కి తీసుకన్నారు. ఆతర్వాత శుక్రవారం 3754కోట్లు విత్‌డ్రాచేసారు. గురువారం ఒక్కరోజే స్వల్పంగా పెట్టుబడులు అంటే 20.14 కోట్లు వచ్చాయి. మళ్లీ మంగళవారం కూడా 1583.52 కోట్లు ఇన్వెస్టర్లు విత్‌డ్రాచేసుకున్నారు.

అక్టోబరులో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు 3902 కోట్లు కొనుగోళ్లుజ రిపితే నవంబరులో తమ పెట్టుబడులు విత్‌డ్రాచేసుకున్నారని జియోజిత్ ఇన్వెస్ట్ ఛీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త డా.వికె విజయకకుమార్ తెలిపారు. నవంబరులో ఎనిమిదోతేదీవరకూ పరిశీలిస్తే 13,367 కోట్లు విత్‌డ్రాచేసారని, దీన్నిబట్టి మొత్తం విదేశీ ఇన్వెస్టర్లు 2025లో ఇప్పటివరకూ 2,07,568కోట్లు వెనక్కితీసుకున్నట్లు తేలిందని ఆయన వివరించారు. ఇందుకు రూపాయి క్షీణత కూడా ఒకకారణం అని చెప్పవచ్చు. 88.72 రూపాయలుగా చెలామణీలో కొనసాగింది. అదే శుక్రవారం 88.60 రూపాయలుగా కొనసాగింది. దీనివల్లనే ఎఫ్‌పిఐలపై అమ్మకాల ఒత్తిడిపెరిగిందనే చెప్పాలి. ఇక డెట్ విభాగంలో ఎఫ్‌పిఐలు మిశ్రమంగా ఉన్నాయి. డెట్ ఎఫ్‌ఎఆర్ కేటగిరీలో విదేశీ ఇన్వెస్టర్లు బయ్యర్లుగా ఉన్నారు. 1,003.81 కోట్లుగా ఇన్వెస్ట్‌చేసారు. డెట్ విఆర్‌ఆర్ సెగ్మెంట్‌లో 1,416.67 కోట్లు ఇన్వెస్ట్‌చేసారు. ఇక జనరల్ డెట్ లిమిట్‌కేటగిరీలో 1857.59 కోట్లు విత్‌డ్రా అయ్యాయి.

వచ్చే ఐదేళ్లలో ప్రపంచంలో

# టాప్ టెన్‌లో ఎస్‌బిఐ!




**న్యూఢిల్లీ, నవంబరు 8:** భారతీయ స్టేట్‌బ్యాంకు వచ్చే ఐదేళ్లలో ప్రంచంలోనే టాప్ పది బ్యాంకుల్లో ఒకటిగా నిలిచేందుకు కృషిచేస్తోంది. ఇప్పటికే దేశంలో నంబర్‌వన్ బ్యాంకుగా నిలిచిన ఎస్‌బిఐ 100 లక్షలకోట్ల బిజినెస్ టర్నోవర్ అధిగమించింది. ఛైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి మాట్లాడుతూ క్యాపిటల్ అడక్వసీ రేషియో 15శాతం, కోర్ ఈక్విటీ టైర్ అంటే సిఇటి-1 12శాతంగా ఉండాలన్న లక్ష్యం ఉందన్నారు. 2025లో సెప్టెంబరునాటికి బ్యాంకు సిఎఆర్ 14.62శాతంగా ఉంది. బ్యాంకుకు ఆరు నుంచి ఏడులక్షలకోట్ల మూలధన నిల్వలునానయని, లాభాలను పెంచుకోవడంద్వారా మూలధన వనరులను కూడా పెంచుకోగలిగామని వెల్లడించారు.

ఈ టర్నోవర్ పెరగడం ద్వారా ఇతర హెచ్‌డిఎఫ్‌సి, టిసిఎస్, రిలయన్స్, భారతి ఎయిర్‌టెల్, ఐసిఐసిఐబ్యాంకుల జాబితాలో చేరింది. సెప్టెంబరు త్రైమాసికంలోనే బ్యాంకు 10శాతం లాభాలను పెంచుకోగలిగింది. 20,160 కోట్ల నికరలాభాలు ఆర్జించింది. వనయవసాయం, ఎంఎస్‌ఎంఇ, రిటైల్ రంగాల్లో పటిష్టమైన పనితీరు చూపింది. అలాగే యెస్‌బ్యాంకులో వాటా విక్రయం కూడా బ్యాంకుకు కలిసొచ్చింది.

# మూడేళ్లకు గాను అమెరికాలో 600 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

## మెటా సిఇఒ మార్క్ జుకర్‌బెర్గ్



**శాన్‌ఫ్రాన్సిస్కో, నవంబరు 8:** మెటా సిఇఒ మార్క్ జుకర్‌బెర్గ్ తమ కంపెనీ అమెరికాలో 2028 నాటికి 600 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతుందని ప్రకటించారు. మౌలిక వనరులు, ఉపాధికల్పనలోనే ఈ పెట్టుబడులుంటాయని వెల్లడించారు. ప్రత్యేకించి ఎఐ టెక్నాలజీ ఆధారిత డేటా కేంద్రాలను అమెరికా వ్యాప్తంగా ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి ఎఐ టెక్నాలజీ వృద్ధికోసం 600 బిలియన్ డాలర్లు వెచ్చించనున్నది. అలాగే ఉద్యోగుల నియామకాలు కూడా మరింతపెరగనున్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటు ఇందుకు కీలకమని ప్రకటించిన జుకర్‌బెర్గ్ మౌలికవనరులు కూడాముఖ్యమేనన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల్లో 30 వేల మంది నిపుణులతో కూడి ఉన్నాయని, మరో ఐదేవేల మంది ఆపరేషనల్ విభాగంలో 2010 నుంచి కొనసాగుతున్నట్లు తెలిపింది. అమెరికా కస్టమర్లు, జనరల్ కాంట్రాక్టర్లు, ఉత్పత్తిదారులనుంచిదేశవానయప్తంగా మరో 20 బిలియన్ డాలర్ల బిజినెస్ రాగలదన్న ధీమా వ్యక్తంచేసారు. అలాగే అమెరికా పవర్‌గ్రిడ్స్ ఇంధన ఉత్పత్తిలో తాము 15 గిగావాట్ల కొత్త ఇంధన సామర్థ్యం పెంచుకోగలిగామని చెప్పారు. సిఎస్‌ఆర్ పరంగా స్కూళ్లకు గ్రాంట్లుగా 58 మిలియన్ డాలర్లు ఇచ్చామని మెటా జుకర్‌బెర్గ్ వివరించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.